ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

https://prajakalam.com
RNI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526



శుక్రవారం | 14-02- 2025 | సంపుటి: 15 , సంచిక: 316, నిజామాబాద్ పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

Circulated to Hyderabad,Ranagareddy,Nizamabad, Warangal, Mulugu, Shadnagar, Yadadri, Nalgonda, karimnagar, khammam, Medak, Sangareddy, Siddipet, Medchal, Jagityal,Vemulawada




## పార్లమెంట్ ముందుకు వక్ఫ్ బిల్లుపై

# జేపీసీ నివేదిక!

- అసమ్మతి నోట్‌ను నివేదికలోంచి తొలగించారంటూ విపక్షాల అభ్యంతరం
- సభ్యుల నిరసనలు, నినాదాలు, వాకౌట్లు
- ముగిసిన తొలి విడత బడ్జెట్ సమావేశాలు
- వక్ఫ్ సమస్యలపై దుష్ప్రచారం.. ఆమోదిస్తే దేశవ్యాప్త ఉద్యమం: ముస్లిం పర్సనల్ లా బోర్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: సభ్యుల నిరసనలు, నినాదాలు, వాకౌట్లు, స్వల్ప వాయిదాల మధ్య వక్ఫ్ సవరణ బిల్లు-2024పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నివేదిక గురువారం పార్లమెంటు ఉభయసభల ముందుకొచ్చింది. రాజ్యసభలో బీజేపీ సభ్యుడు మేధా విశ్రామ్ కులకర్ణి, లోకసభలో ఎంపీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ చైర్‌పర్సన్ జగదాంబికా పాల్ నివేదికను ప్రవేశపెట్టారు. రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున్ ఖర్గే ఈ నివేదికను 'ఫేక్ రిపోర్టు' గా కొట్టిపారేశారు. విపక్ష ఎంపీలు జారీచేసిన అసమ్మతి నోట్‌ను నివేదిక నుంచి తొలగించారని, ఇది అప్రజాస్వామిక చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# భవిష్యత్తు కృత్రిమ మేధదే

- టెక్నాలజీలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ
- మైక్రోసాఫ్ట్ కొత్త భవనం ప్రారంభోత్సవంలో సీఎం
- డేటా సెంటర్లలో 15వేల కోట్ల పెట్టుబడులు
- ప్రకటించిన మైక్రోసాఫ్ట్ యాజమాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో ఒప్పందాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ప్రజాకలం ప్రతినిధి): ప్రపంచగతిని మార్చబోతున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో తెలంగాణ విద్యార్థులు, పరిశ్రమల్లో నిపుణులు, ప్రభుత్వ అధికారులు మొత్తం 1.2 లక్షల మందికి శిక్షణ ఇచ్చే బృహత్తర కార్యక్రమానికి ముందడుగు పడింది. అంతేకాకుండా రాష్ట్రంలో వ్యవసాయం, ట్రాఫిక్ రంగాల్లో భారీఎత్తున ఏఐని వినియోగించేందుకు మార్గం సుగమం అయ్యింది. ఇందుకు సంబంధించి ఆయా రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏఐలో శిక్షణ, సాంకేతిక సహకారం అందించేందుకు రెండు ప్రపంచ దిగ్గజ ఐటీకంపెనీలు మైక్రోసాఫ్ట్, గూగుల్ సిద్ధమయ్యాయి. ఈ మేరకు రెండు కంపెనీలతో గురువారం రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నిర్మించిన భవనం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఒక ఒప్పందం కుదరగా, టీ హబ్‌లో ముఖ్యమంత్రి సమక్షంలోనే జరిగిన మరో కార్యక్రమంలో గూగుల్‌తో మరో ఒప్పందం చేసుకున్నారు. ఈ రెండు సందర్భాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, టెక్నాలజీ రంగంలో భారీ ఉద్యోగ అవకాశాలకు కృత్రిమ మేధ అత్యంత కీలకం కాబోతుందని చెప్పారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ప్రకటించారు. ఐటీరంగంలో ఇప్పటికే హైదరాబాద్ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతోందన్నారు. ఏఐతో రాష్ట్రం మరింత ప్రత్యేకత సాధిస్తుందని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఐటీ ప్రయాణంలో ఈ రోజు కీలక మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అధునాతన ప్రమాణాలతో 2,500 ఉద్యోగులకు సరిపడేలా మైక్రోసాఫ్ట్ కొత్త భవనం నిర్మించడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. మైక్రోసాఫ్టకు, హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని, మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్ నగరం పేరు ప్రపంచ వ్యాప్తమైందని గుర్తుచేసుకున్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో ఇక్కడి యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని చెప్పారు. ఏఐ ఫౌండేషన్ అకాడమీలో ప్రభుత్వానికి మైక్రోసాఫ్ట్ భాగస్వామిగా ఉంటుందని ప్రకటించారు. ఈ భాగస్వామ్యంతో 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెడతామని చెప్పారు. ప్రభుత్వ పాలన, ప్రజాసేవల్లోనూ ఏఐని ఉపయోగిస్తామని ప్రకటించారు. ఏఐ రంగంలో పెట్టుబడి హైదరాబాద్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తుందని, కొత్త కంపెనీలకు మార్గదర్శనం లభిస్తుందని, ఏఐ టూల్స్ అందుబాటులోకి వస్తాయని, అంతర్జాతీయ పరిచయాలు పెరుగుతాయని ముఖ్యమంత్రి చెప్పారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్

తరువాయి 2వ పేజీలో...

## బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌కు

# చిత్తశుద్ధి లేదు



ఆ పార్టీ మోసాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లండి..
బీసీ నాయకులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచన

2లో



## ఎస్సీలలోని అన్ని కులాలకు తహసీల్దార్ ద్వారానే

# కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి

వర్గీకరణ చట్టరూపం దాల్చక ముందే లోపాలు సరిచేయాలి: మందకృష్ణ

## కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి

# డిజైన్ లోపాలే ప్రధాన కారణం!

### ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక - జలశక్తి శాఖ, ఎన్డీఎసఏకు అందజేత



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ప్రజాకలం ప్రతినిధి): మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సీపేజీలకు డిజైన్ లోపాలే ప్రధాన కారణమని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తేల్చింది. వాటితో పాటు 'కార్యకలాపాలు, నిర్వహణ (ఓఅండ్ఎం)' లోపాలు కూడా కారణమని గుర్తించింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖకు, ఎన్‌డీఎసఏ చైర్మన్‌కు నివేదిక అందించింది.

తరువాయి 2వ పేజీలో...




## ముస్లింలను బీసీల్లో చేర్చితే

# ఒప్పుకోం



- కేంద్రానికి ఆ బిల్లు పంపితే తిరస్కరిస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ప్రజాకలం ప్రతినిధి): ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడాన్ని తాము ఒప్పుకోబోమని, ఆ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిస్తే తిరస్కరిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తేల్చిచెప్పారు.

తరువాయి 2వ పేజీలో...

## కృష్ణా జల వివాదంపై..

# 27న వాదనలు వింటాం

## 25లోపే షార్ట్ నోట్ ఇవ్వండి

### న్యాయవాదులకు సుప్రీం కోర్టు స్పష్టం

### తెలంగాణకు అన్యాయం జరగనివ్వం: ఉత్తమ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 : తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వివాదంపై ఈ నెల 27న సుదీర్ఘ వాదనలు వింటామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 25లోపే అన్ని అంశాలపై షార్ట్ నోట్ సమర్పించాలని న్యాయవాదులను ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాలను విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని తొలుత నిర్ణయించారు. దీని ప్రకారం తొలుత బ్రిజేషకుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే, దీని వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం 1956లోని సెక్షన్3 ప్రకారం కృష్ణా జలాల పునఃపంపిణీని చేపట్టాలని కేంద్రాన్ని తెలంగాణ కోరింది. సుదీర్ఘకాలం తర్వాత కేంద్రం బ్రిజేషకుమార్ ట్రిబ్యునల్‌కు గతేడాది అక్టోబర్‌లో నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. సెక్షన్ 3 ప్రకారం కృష్ణాజలాల పంపిణీ చేపట్టాలని ఆదేశించింది. అయితే,



కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ట్రిబ్యునల్‌కు కేంద్రం జారీ చేసిన సెక్షన్ 3 టీవోఆర్‌ను రద్దు చేయాలని 17 అక్టోబరు 2023న ఏపీ సర్కారు సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

తరువాయి 2వ పేజీలో...

# భవిష్యత్తు కృత్రిమ మేధదే

మొదటి పేజీ తరువాయి...

ఏఐ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుందని గర్వంగా చెబుతున్నానన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచినందుకు మైక్రోసాఫ్ట్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల మైక్రోసాఫ్ట్ నిబద్ధత తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని వ్యాఖ్యానించారు.

**మెరుగైన పాలనకు ఏఐతోడు**

టీ-హబ్‌లో గూగుల్ ఒప్పంద కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, ఏఐ వినియోగంలో తెలంగాణ దార్శనికతకు గూగుల్ సహకారం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఏఐ టెక్నాలజీతో కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు తేవాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నామని, ఈ లక్ష్య సాధనలో గూగుల్ ఒప్పందం కీలకంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా మాట్లాడుతూ, ఏఐ ఆధారిత మానవ వనరులను పెంచడం, స్టార్ట్‌పలను ప్రోత్సహించడం, వ్యవసాయం, విద్య లాంటి కీలక రంగాల్లో పని చేయటం ఉత్సాహంగా ఉందని అన్నారు.

**500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన**

మైక్రోసాఫ్ట్ అడ్వాంటేజ్ తెలంగాణ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏఐని పరిచయం చేసేందుకు ప్రాథమిక కోర్సులు ప్రారంభించనుంది. దీనికోసం మైక్రోసాఫ్ట్ ప్రత్యేకంగా ఏఐ ఫౌండేషన్స్ అకాడమీ ఏర్పాటుచేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రభుత్వ పాఠశాలల్లో 100 మంది చొప్పున మొత్తం 50 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఏఐ ఇండస్ట్రీ ప్రో పేరుతో చిన్న, భారీ పరిశ్రమల్లోని 20 వేల మంది నిపుణులకు ఏఐ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. ఏఐ గవర్న్ ఇనీషియేటివ్ పేరుతో 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రొడక్టివిటీ వంటి కీలకమైన రంగాలలో శిక్షణ ఇస్తారు.

**రూ. 15 వేల కోట్ల పెట్టుబడులు**

తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ స్థాపిస్తామని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఏఐ నాలెడ్జ్ హబ్‌తో పాటు ఏఐ అభివృద్ధికి క్లౌడ్-ఆధారిత మౌలిక సదుపాయాలు ఇందులో ఉంటాయి. రాష్ట్రంలో వేల మంది ఉద్యోగులకు ఉపయోగపడేలా ఉత్తమ పరిశోధన పద్ధతులు అందుబాటులో ఉంచుతుంది. ఏఐ అభివృద్ధితో పాటు రాష్ట్రంలో హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లలో పెట్టుబడులను రెట్టింపు చేస్తామని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఇంతవరకు ప్రకటించిన పెట్టుబడులకు అదనంగా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది.

**విద్య, వ్యవసాయంలో గూగుల్ సహకారం**

విద్య, వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, తదితర కీలక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలు, పరిష్కారాలు అమలు చేస్తామని గూగుల్ తెలిపింది. భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు వ్యూహాత్మక సహకారం అందించనుంది. రైతులకు వ్యవసాయ సంబంధిత ఏఐ ఆధారిత పరిష్కారాలు అందించనుంది. రవాణా సదుపాయాలను మెరుగుపరిచే డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలోనూ భాగస్వామ్యం పంచుకుంటుంది. గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఏఐ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారిస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సర్వీసెసను అందిస్తుంది. రైతులకు అవసరమైన ఇన్‌పుట్, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ వ్యవసాయ నెటవర్క్‌ను ప్రారంభిస్తుంది.

**అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి**

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న కోర్ అర్బన్ ఏరియాను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకువెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి పురపాలక శాఖ అధికారులకు సూచించారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన డ్రోన్ సర్వేను కోర్ అర్బన్ ఏరియా మొత్తం నిర్వహించాలని ఆదేశించారు. గురువారం పురపాలక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో ఇళ్లు, మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మురుగునీటి వ్యవస్థకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాలని, తద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలను మెరుగుపరచవచ్చని సూచించారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైతే గూగుల్ సాంకేతిక సహకారం తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రధానమైన 7 కూడళ్లలో ఫ్లై-ఓవర్ నిర్మాణాలు చేపట్టేందుకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. భూసేకరణ, ఇతర పనులు పూర్తిచేసి వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలన్నారు. చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

## కృష్ణా జల వివాదంపై..

# 27న వాదనలు వింటాం

మొదటి పేజీ తరువాయి...

కేంద్ర నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, నదీ జలవివాద చట్టం ప్రకారం బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు ఇలా అదనపు అంశాలను పరిశీలించే అధికారం లేదని రిట్ పిటిషన్‌లో పేర్కొంది. ఏపీ దాఖలు చేసిన పిటిషన్ గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే, ఈ నెల 19నుంచి కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు జరగాల్సి ఉందని, ఈ నేపథ్యంలో త్వరగా తమ వాదనలు వినాలని ఏపీ తరఫు న్యాయవాదులు కోరారు. వాదనలు వినిపించడానికి ఎంత సమయం పడుతుందని ధర్మాసనం ప్రశ్నించింది. సుమారు రెండు గంటలకుపైగా పడుతుందని న్యాయవాదులు స్పష్టం చేశారు. అయితే.. ప్రస్తుతం అంత సమయం లేనందున ఈ నెల 27న వాదనలు వింటామని ధర్మాసనం స్పష్టం చేసింది.

**రాష్ట్ర హక్కులను పరిరక్షిస్తాం: ఉత్తమ్**

తెలంగాణ హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరగనివ్వబోమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

సుప్రీంకోర్టులో గురువారం జరిగిన విచారణకు రాష్ట్ర అధికారులు, న్యాయవాదులతో కలిసి ఉత్తవ్ హాజరయ్యారు. గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తెలంగాణ ప్రభుత్వ వాదనలకు మద్దతుగా నిలిచాయని, ఇది రాష్ట్ర హక్కులను రక్షించడంలో ముందడుగని అన్నారు.



## బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌కు

# చిత్తశుద్ధి లేదు

**ఆ పార్టీ మోసాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లండి.. బీసీ నాయకులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచన**

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ప్రజాకలం ప్రతినిధి):

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ సర్కార్‌కు లేదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దుయ్యబట్టారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని వ్యవసాయక్షేత్రంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, పలువురు నాయకులు గురువారం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కులగణనపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసనలతో ప్రభుత్వం దిగివచ్చిందని, రీ సర్వే చేపట్టిందని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేసే దాకా ప్రభుత్వంపై పోరాటానికి ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. కాగా, బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ఆవిర్భవించి 25 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో.. త్వరలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు ఆ పార్టీ సమాయత్తమవుతోంది. ఈనెల 19న పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో తగిన ఏర్పాట్లు చేయాలని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కేసీఆర్ ఆదేశించారు. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణ, పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఎర్రవెల్లి ఫాంహౌసలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో కేసీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 19న నిర్వహించే విస్తృత స్థాయి సమావేశంతోపాటు ఇటీవల ప్రకటించిన సభకు సంబంధించిన తేదీ, వేదిక వంటి అంశాలపై లోతుగా చర్చించినట్లు తెలిసింది. కాగా, కులగణనలో వైఫల్యాలను డిప్యూటీ సీఎం భట్టి పరోక్షంగా అంగీకరించారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెసపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, ఆ కారణంగానే స్థానిక ఎన్నికలను మరింత ఆలస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# పార్లమెంట్ ముందుకు వక్ఫ్ బిల్లుపై జేపీసీ నివేదిక!

మొదటి పేజీ తరువాయి...

నివేదికను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి తిప్పి పంపాలని డిమాండ్ చేశారు. అయితే విపక్ష సభ్యుల ఆరోపణలను పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు కొట్టిపారేశారు. నివేదిక నుంచి ఏదీ తొలగించలేదని, అన్ని వివరాలనూ సభ ముందు ఉంచామన్నారు. మంత్రులు భూపేందర్ యాదవ్, నిర్మలా సీతారామన్ కూడా విపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కాగా అభ్యంతరాల నోట్‌ను తొలగించారంటూ విపక్షసభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ ఎంపీ మేధా విశ్రామ్ కులకర్ణి సభలో నివేదికలోని ఐదో భాగానికి సంబంధించిన తప్పొప్పుల పట్టిక (కోరిజండమ్)ను ప్రవేశపెట్టారు. లోక్‌సభలో అమిత్ షా మాట్లాడుతూ అసమ్మతి నోట్‌తో కూడిన నివేదికను ప్రవేశపెట్టడంపై బీజేపీకి అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. తొలి విడత బడ్జెట్ సమావేశాలకు ముగింపు పలుకుతూ ఉభయసభలు వాయిదాపడ్డాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 10నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి.

**హిందూ, ముస్లింల మధ్య పోరుగా చూడొద్దు**

ముస్లింల అభిప్రాయాలను వక్ఫ్‌ప్యానల్ పూర్తిగా విస్మరించిందని, వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదిస్తే, దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) హెచ్చరించింది. వక్ఫ్ బిల్లుపై ముందుకు వెళ్లొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బిల్లుపై జేపీసీ నివేదికను ఉభయసభల్లో ప్రవేశపెట్టిన నేపథ్యంలో లా బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సయిఫుల్లా రెహమానీ విలేకరులతో వక్ఫ్ సమస్యలనేవి హిందువులు, ముస్లిం మ?ధ్య పోరు కాదని.. ఇది న్యాయం కోసం జరిగే పోరాటమని పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లును రూపకల్పనలో 'మతపరమైన వివక్ష' కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు.

**లోక్‌సభలో కొత్త ఆదాయ పన్ను బిల్లు**

ఆదాయ పన్ను చట్టాన్ని సరళీకరిస్తూ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ గురువారం లోక్‌సభలో కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని స్పీకర్ ఓం బిర్లాను అభ్యర్థించారు. అసలు బిల్లు ప్రవేశ పెట్టడాన్నే విపక్షాలు వ్యతిరేకించాయి. అయితే, మూజువాణి ఓటుతోనే బిల్లు ప్రవేశపెట్టడానికి స్పీకర్ అనుమతి లభించింది. లోక్‌సభ సెలక్ట్ కమిటీ బిల్లును అధ్యయనం చేసి వచ్చే సమావేశాల తొలిరోజు తన నివేదికను సమర్పిస్తుంది. ప్రస్తుత చట్టంలో కన్నా కొత్త బిల్లులో ఎక్కువ సెక్షన్లు ఉన్నాయని కాంగ్రెస్ సభ్యులు మనీశ్ తివారీ, ప్రేమచంద్రన్ చేసిన వ్యాఖ్యలను నిర్మల ఖండించారు. ప్రస్తుత చట్టంలో 819 సెక్షన్లు ఉండగా.. కొత్త బిల్లులో కేవలం 536 సెక్షన్లు ఉన్నాయని గుర్తు చేశారు. కొత్త చట్టాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తామన్నారు.

## ఎస్సీలలోని అన్ని కులాలకు తహసీల్దార్ ద్వారానే

# కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి

**వర్గీకరణ చట్టరూపం దాల్చక ముందే లోపాలు సరిచేయాలి: మందకృష్ణ**

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ప్రజాకలం ప్రతినిధి):



ఎస్సీలలోని అన్ని కులాలకు తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. షమీర్ అక్తర్ నివేదికలో లోపాలు ఉన్నాయని, వర్గీకరణ చట్టరూపం దాల్చకముందే లోపాలను సరిచేయాలని కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మిత అయ్యాల్వార్ సంఘం అధ్యక్షుడు యంద్రపల్లి రాంబాబు అధ్యక్షతన సదస్సు నిర్వహిం చారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీలలో కొన్ని కులాలకు ఆర్డీఓ ద్వారా, మరికొన్ని కులాలకు తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. వీటిని పరిష్కరించేందుకు అన్ని కులాలకు తహసీల్దార్ ద్వారానే ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. గ్రూప్- 3లో ఉన్న ఇబ్బందులను ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వాటిని సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని విన్నవించారు. మహార్, నేతకాని, గోసంగి కులాలు మాల కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారని, అవసరం అయితే మాలలను డీ గ్రూప్‌లో చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాదిగలతో పాటు అన్యాయానికి గురైన అన్ని కులాల పక్షాన పోరాడతామని మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు.

## కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి

# డిజైన్ లోపాలే ప్రధాన కారణం!

మొదటి పేజీ తరువాయి...

బ్యారేజీల నిర్మా ణ ప్రదేశాల్లో జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలు సరిగ్గా చేయలేదని, పరీక్షలు చేయడానికి ముందే డిజైన్లు/డ్రాయింగ్‌లు సిద్ధం చేశారని గుర్తించింది. డిజైన్‌కు తగ్గట్లుగా నిర్మాణం చేయకపోవడం, క్వాలిటీ కంట్రోల్‌తో పాటు ఓఅండ్ఎం లోపాలూ కారణమని గుర్తు చేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టడానికి వీలుగా వాటి నిర్మాణం, లోపాలపై అధ్యయనం చేయాలని కోరుతూ గతేడాది ఫిబ్రవరి 13న ఎన్‌డీఎసఏ చైర్మన్‌కు లేఖ రాయగా.. మార్చి 2న కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురు నిపుణులతో ఎన్‌డీఎసఏ కమిటీ వేసింది. సుదీర్ఘ ఉత్తరప్రత్యుత్తరాల అనంతరం నివేదికకు తుదిరూపు అందించి, నిపుణుల కమిటీ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఎన్‌డీఎసఏ చైర్మన్‌కు అందించింది. ఈ నివేదిక కోసం కూడా కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదురు చూస్తోంది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు 2019లో పూర్తికాగా.. ఆ ఏడాది నవంబరు లో వరదల అనంతరం గేట్లు మూయడంతో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు చెల్లాచెదురయ్యాయని, ఆప్రాన్లు దెబ్బతిన్నాయని, మేడిగడ్డలో ఐదేళ్లపాటు ఓఅండ్ఎం పనులు జరగలేదని కమిటీ తేల్చింది. మేడిగడ్డ కుంగుబాటుకు ఇది కూడా కారణమని పేర్కొంది. అన్నారం, సుందిళ్లలో కూడా డిజైన్లతో పాటు నిర్వహణ పనులు సరిగ్గా చేయలేదని తేల్చింది. కాగా, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్ల నిర్వహణలో స్టాండింగ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పాటించలేదని నిపుణుల కమిటీ గుర్తు చేసింది.

# ముస్లింలను బీసీల్లో చేర్చితే ఒప్పుకోం

మొదటి పేజీ తరువాయి...

ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి కేంద్రానికి పంపించాలనుకోవడం మూర? త్వమని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనలను కేంద్రం వ్యతిరేకించడం పక్కా అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిపాదనలతో ఒరిగేదేమీ లేదని ఒక ప్రకటనలో తెలిపారు. "మతపరమైన రిజర్వేషన్లను బీజేపీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెపాన్ని కేంద్రంపైకి నెట్టాలని చూస్తోంది.

తద్వారా కొరివితో తలగోక్కునే ప్రయత్నం చేస్తోంది. దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదు. బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ముస్లింలను బీసీల్లో చేర్చకుండా జాబితాను కేంద్రానికి పంపించాలి. లేనిపక్షంలో బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీని క్షమించబోదు. అసలు కులగణన రీసర్వే ఏంటి..? పూర్తి చేయడమేంటి..? రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 60 లక్షల మం దికి సంబంధించి క్షేత్రస్థాయి సర్వే చేస్తారా..? చెయ్యరా..? ప్రభుత్వం స్పష్టం చేయాలి." అని సంజయ్ పేర్కొన్నారు.

**మరో నాలుగు జిల్లాలకు బీజేపీ అధ్యక్షులు**

బీజేపీ మరో నాలుగు జిల్లాలకు అధ్యక్షులను గురువారం ప్రకటించింది. గోల్కొండ గోషామహల్-టి. ఉమామహేంద్ర, మహబూబాబాద్- వల్లభు వెంకటేశ్వర్లు, సంగారెడ్డి- సి.గోదావరి, యాదాద్రి భువనగిరి- ఊటుకూరు అశోక్‌గౌడ్‌లను నియమించినట్లు పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ తెలిపారు.




# ముదిగొండలో 30 క్వింటాల నల్లబెల్లం పట్టివేత

## - వివరాలు తెలిపిన సిఐ మురళి

మధిర ఫిబ్రవరి 13(ప్రజా కలం న్యూస్)

ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి నుంచి మహబుబాద్ జిల్లా కొరివి కి అశోకాలైలాండ్ ట్రాలీ ఆటో లో



30 క్వింటాళ్లు 60బస్తాల ,12క్వి లోల తెల్లపట్టిక ను అక్రమంగా తరలిస్తుండగా ముదిగొండ పోలీసులు వాహనాలు తనిఖీ లో దొరకడంతో మొత్తం రూ. 1,80, 880 విలువ చేసే నల్లబెల్లం పట్టుకొవడం జరిగింది. అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న డ్రైవర్ ఆడియాల అనిల్ తోపాటు వాహన యజమాని కొరివి ఇజ్రాయెల్ ,కొరవికి చెందిన బెల్లం వ్యాపారి వెంకట్ పై కేసునమోదు చేయడం జరిగింది. తనిఖీ లో పాల్గొని నల్లబెల్లం పట్టుకున్న ఎస్సై అంతరములు, హెడ్ కానిస్టేబుల్ ఖలీక్,కానిస్టేబుల్ ఉపేందర్ ను సిఐ మురళి అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ముదిగొండ మండలం గందశిరి, పెద్దమండవ మున్నేరుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు సువర్ణపురం వద్ద హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు,కానిస్టేబుల్ శ్రీను పట్టుకోవడం జరిగింది. .

# నా జ్ఞాపకం...

నలభై వసంతాల ఆ జ్ఞాపకం నన్ను ఓలుస్తూ తొలిస్తూనే ఉంది. గమ్యం తెలియని నా ఒంటరి జీవితం నిరంతర ప్రయాణం కొనసాగిస్తూనే ఉంది. రైలు పట్టాల తంతులను దాటుతున్న నా మనసులో.... ఏదో ఒక జ్ఞాపకం తట్టింది. కిటికీల అంచులో నుంచి తొంగి చూస్తే చెట్లు చేలు పరుగులు తీస్తున్నాయి. అప్పుడే ఆగిన రైలును దిగి పక్కనే ఉన్న ఒక చెట్టు కింద సేద తీర్చుకుంటున్నాను. అంతలోనే నా వైపు పసుపు పాదాలు అడుగులో అడుగులు వేసుకుంటూ తన ముందుకు వస్తున్నాయి. పిల్లలు,తాను, తన భర్తతో ఖాళీ లేని తన చేతి నిండా ఇంటి సామాన్లతో తన వైపుకు వచ్చేసింది. మాసిన గడ్డం, అన్నం తిని నాలుగు రోజులు గడిచిన ముఖం నీరసించి పోయింది. నన్ను గుర్తు పట్టకుండా తన భర్త పిల్లలతో సంతోషంగా ఉన్న ఆమె ఎవరో కాదు...... నేను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన ఓ ప్రేమికురాలు...! వాలంటేన్ రోజున నా జ్ఞాపకం మీతో...!

- మామిడి రమేష్ జర్నలిస్టు

## ఈటెల చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన

# గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసితులు

హనుమకొండ ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి

హనుమకొండ కలెక్టరేట్ లో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతులు మల్కాజిగిరి ఎంపీ ఈ టెల రాజేందర్ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం




నిర్వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రైతుల తరపున ఎంపీ ఈటెల రాజేందర్ నిర్వాసిత రైతులకు ఇచ్చే ఆర్బిట్రేషన్ పరిహారాన్ని పెంచే అధికారం కలెక్టర్లకి ఇచ్చినట్లయితే రైతులకు మార్కెట్ విలువల ప్రకారము నష్టపోకుండా పరిహారం అందే వీలుంటుందని లోకసభలో ప్రస్తావించడం జరిగిందని తెలిపారు. ఏ ప్రజా ప్రతినిధి దగ్గరికి వెళ్లిన న్యాయం జరగలేదని మొదటిసారి చట్టసభలో ఈటెల రైతుల తరఫున సమస్యను లేవనెత్తినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు. భూమి రేటు నిర్ణయించేటప్పుడు కరోనా సమయంలో ఉన్న రిజిస్ట్రేషన్ విలువలను పరిగణలోకి తీసుకొని అవార్డు పాస్ చేయడాన్ని రైతులు వ్యతిరేకించడం జరిగిందన్నారు. ఎందుకంటే కరోనాకాలంలో ఏ విధమైన రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరగలేదు. కాబట్టి కరోనా సమయంలో జరిగిన రిజిస్ట్రేషన్ విలువలను ఆధారంగా చేసుకుని అవార్డు పాస్ చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు తమ గో డును వెళ్ళబోసుకున్నామని తెలిపారు.

నూతన రిజిస్ట్రేషన్ విలువలను పరిగణలోకి తీసుకొని ఇంతకుముందు ప్రకటించిన అవార్డును వెనక్కి తీసుకొని తిరిగి కొత్త రిజిస్ట్రేషన్ విలువలను ఆధారంగా చేసుకుని అవార్డును ప్రకటించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రీన్ఫీల్డ్ హైవే రైతులు కోరారు. అలాగే కలెక్టర్లు ప్రకటించే 100% ఆర్బిట్రేషన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి ఈ ఆర్బిట్రేషన్ 500 %, పెంచినట్లయితే కొంత రైతు నష్టపోయే అవకాశం తగ్గుతుందని ఈ సందర్భంగా రైతులు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు బూర్గుల రామచందర్,బొల్లు నమ్మి రెడ్డి, రాజిరెడ్డి, ఎరుకల రమేష్,సంధ్యారాని,సాప్తే రాజు,దేవేందర్,రమేష్,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని అనుసరించండి X @SCRailwayindia. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

No. Y/C. E-Auction/HYB/14/2024
తేది: 13.02.2025

PUB/0161

కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్టుల కొరకు హైదరాబాద్ డివిజన్ ఇ-వేలం అమలు చేసింది. ఇ-వేలం షెడ్యూలు దిగువ పొందుపరచబడినది:

| క్ర. సం. | కేటగిరీ | కేటలాగ్ నం. | వివరాలు | వేలం తేది | వేలం ప్రారంభ సమయం | వేలం ముగింపు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | పార్శిల్ | HYB-Parcels-08 | Train No. 1) 17652 (FSLR-1) 2) 17653 (FSLR-1) 3)16353 (FSLR-1, FSLR-2 & RSLR-1) 4) 22715 (FSLR-1) 5)17028 (FSLR-1 & FSLR-2) | 28.02.25 | 15.00 | 16.40 |
| 2 | Advertising Advt-HYb-SFX-OH-124-25-1 (అడ్వర్‌టైజింగ్ అవుట్ ఆఫ్ హోమ్) | HYB-ADVT-33 | సఫిల్‌గూడ, దయానంద్ నగర్ & రామకిష్టాపురం వద్ద అవుట్ ఆఫ్ హోమ్ కేటగిరీ క్రింద ప్రకటన హక్కులు | 28.02.25 | 11.00 | 11.30 |
| 3 | Advertising Advt-HYb-TMX-OSN-123-25-1 (అడ్వర్‌టైజింగ్-ఆన్ స్టేషన్) | HYB-ADVT-33 | తిమ్మాపూర్, షాద్‌నగర్ & జడ్చర్ల రైల్వే స్టేషన్ వద్ద ప్రకటన హక్కులు | 28.02.25 | 11.10 | 11.40 |

A0207 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్


## నేడు వాలంటైన్స్ డే...

# నా స్వప్నలోకాల సౌందర్య రాశి

**కూకట్‌పల్లి పిబ్రవరి 13 (ప్రజాకలం ప్రతినిధి) (సముద్రాల జగదీశ్వర్ ):**

అజరామర మైన,అనిర్వచనీయమైన,అనుభూతిని కలిగించేది సృష్టిలో ప్రేమ ఒక్కటే. యువతి యువకులు తమ ప్రేమను పండించుకోవడానికి అనేక ఇబ్బందులు పడడం సహజం. ఇందులో బాగంగానే చూపులు,పలకరింపులు,మొదలుకొని పరస్పర ప్రేమ సందేశాలను అందించుకోవడంవరకు వారు చేస్తూంటారు. ప్రేమ అనే ఈ రెండక్షరాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. ప్రేమికుల మధుర స్వప్నమైన " వాలంటైన్స్ దే" (పేమికుల దినోత్సవం) రోజున ప్రపంచంలోని ప్రేమికుల ఆనోందోత్సవానికి అవధులు ఉండవు. ఊహాల గుసగుసలు, ఊగిసలాటలు, ఆరోజు ప్రత్యేకత. ప్రతిసంవత్సరం పిబ్రవరి 14న వాలంటైన్స్ డే ను పురస్కరించుకొని ప్రేమికులు ఒకరికొకరు బహుమతులు,గ్రీటింగ్ లు ఇచ్చుకోవడం,సిగ్గు,బిడియం, మెహమాటం,బెరుకులాంటీ భావాలను చెరిపివేసి తమ మనసులోని మాటలను చెప్పేందుకు అనువైన రోజుగా భావిస్తారు. గ్రేటర్ హైదరాబాద్,శివారు సర్కిళ్ళ లోని అనేకమంది యువతి యువకులు ఈ ప్రేమికుల దినోత్సవం కోసం ఎంతో ఆతృతతో ఎదురు చూస్తూన్నారు. ఈ ప్రేమికుల దినోత్సవాన్ని తీపి గుర్తుగా మిగిల్చుందుకు గ్రేటర్ లోని అనేక హెూటళ్ళు,క్లబ్బులు,పలు సంస్థలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడానికి ఎర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇది ఇలాఉండగా శివసేన చీఫ్ తో పాటు భజరంగ్ ధళ్ మాత్రం ఈ ప్రేమికుల దినోత్సవాన్ని భారతదేశంలో నిషేదించాలని డిమాండు చేయడంతో పాటు తమ కార్యకర్తలందరూ "వాలంటైన్స్‌డే" ను వ్యతిరేకించడంతో పాటు దీనికి దూరంగా ఉండాలని ఉద్బోదించారు. పిబ్రవరి 14న విశ్వవ్యాప్తంగా ఉన్న యువతి యువకులు తాము ప్రేమించుకొన్న వారికి " ఐలవ్ యూ " చెప్పేందుకు యువత అంగీకరించిన రోజు అదే ప్రేమికుల రోజు. యువ ప్రేమికుల గుండె లపై నెత్తుటి సంతకం మనసా వాచా మనసిసై ఎ నిశేదాన్నయినా అంగీకరించొచ్చని ప్రపంచ ప్రేమికులకు తెలియ జెప్పిన గొప్ప ప్రేమికుడు. మామూలు ప్రేమికులు తమ వ్యక్తిగత ప్రేమను గెలిపించు కోవడానికి నానా తంటాలు పడుతున్నారు. వాలంటైన్స్ మాత్రం రోమ్‌నగరంలో ప్రేమ నిషేదం పై అనేక పోరాటాలు నిర్వహించి రోమ్ చక్రవర్తి అగ్రహానికి గురై శిరచ్ఛేదంతోఆసువులు బాసారు. క్రీస్తుశకం మూడో శతాబ్ధానికి చెందిన వాలంటైన్స్ రోమ్ సామ్రాజ్యంలో క్రైస్తవ మత ప్రచారకుడు. అయితే రోమ్ సామ్రాజ్యం విస్తరణలో భాగంగా ఆ నాటి రోమన్ చక్రవర్తి క్లాడియన్ చీటికి-మాటికి యుద్ధ ప్రకటనలు చేస్తుండగా ప్రజలు విసిగిపోయారు. చక్కగా వ్యక్తిగత జీవితాలతో ఇమిడి పోయేవారు. ప్రజల్లో యుద్ధ వ్యతిరేకత ప్రబలడానికి కారణం ప్రేమ అనిభావించిన చక్రవర్తి క్లాడియన్ తన రోమ్ సామ్రాజ్యంలో ప్రేమను నిషేదించాడు. దీంతో తిరుగుబాటు చేసిన వాలంటైన్ రహస్యంగాప్రేమికులను ఒకటిగా చేయడం లాంటీ కార్యక్రమాలను నిర్వహించడం లో తలమునకలయ్యాడు. ఆ విషయం తెలిసిన రోమ్ చక్రవర్తి క్లాడియన్ తీవ్ర అగ్రహం చెందాడు. దాంతో వాలంటైన్ ను భందించి జైలుకు




పంపించాడు. జైలుకు వెళ్ళిన వాలంటైన్ ప్రేమ విజయానికి అక్కడ కూడ శ్రమించడమే కాకుండ జైలర్ కూతురుతో ప్రేమలో పడ్డాడు. హార్ట్ ఆకారంలో ఉన్న కాగితంలో ప్రేమసందేశం పంపించాడు వాలంటైన్. ఈ విషయాన్ని తెలుసుకొన్న చక్రవర్తి మరింత తీవ్ర అగ్రహినికి గురై వాలంటైన్ కు మరణ శిక్షను విదించి తక్షణం శిరచ్ఛేదం చేయించాడు. కాలక్రమేన రోమన్‌సామ్రాజ్యం పతనమై క్రైస్తవమతం వ్యాప్తిలోకి రాగా వాలంటైన్ ఆసువులు బాసిన పిబ్రవరి 14 నుంచి రోమన్ ప్రేమికుల రోజుగా గుర్తించారు. ఆనాటి నుండి యువతి-యువకులు ప్రేమకుగుర్తుగా జరుపుకోవడం ఆనవాయితిగా మారింది. కాలక్రమేణ ప్రపంచం లోని అన్నిదేశాలలోని ప్రేమికులు జరుపు కొంటున్నారు. అందులో భాగంగానే గత కొన్ని సంవత్సరాలనుంచి భారతదేశమంతటా ప్రేమికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపు కొంటున్నారు. అందుభాగంగానే గ్రేటర్ పరిదిలో ప్రేమికుల దినోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేసుకొంటున్నారు. ఇందుకోసం పలు ప్రదానమైన హెూటళ్ళలో ప్రేమికుల కోసం ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తూన్నారు. అలాగే వివిద ఛానల్స్‌ల్లో వివిద కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నారు.

## చేనేత కార్మికుల త్రీఫ్ట్ పథకాన్ని గత ప్రభుత్వం లాగే

# ఎలాంటి ఆంక్షలు లేకుండా యధావిధిగా కొనసాగించాలి

## బి ఆర్ఎస్ పార్టీ నాయకులు చింతకింది కిరణ్



భూదాన్ పోచంపల్లిబీ జనవరి 13,(ప్రజా కలం ప్రతినిధి)

గత ప్రభుత్వంలో జియో ట్యాగు కలిగిన వ్యక్తి కింద ఇద్దరు అనుసంధానంగా డబ్బులు జమ చేసుకోవడం జరిగినది. ప్రస్తుత ప్రభుత్వం జియో ట్యాగు కలిగిఉన్నటువంటిఅనుసంధానంగాఒకరికిఅవకాశంకల్పిస్తుంది. మరియు రెండు నెలలకోసారి ఎంక్వయిరీ అంటూ కార్మికులను భయోందోళనకుగురిచేస్తున్నారు. అందుకు నిరసనగా ఈరోజు పోచంపల్లి లో ఆచార్య కొండ లక్ష్మణ్ బాబూజీ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేయడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమానికి మద్దతుగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నల్ల లక్ష్మణ్ గారు రావడం జరిగినది. ఈకార్యక్రమంలో టి ఆర్ఎస్ పార్టీ నాయకులు గుండు ప్రవీణ్ , సిద్దుల ప్రభాకర్, మరియు చేనేత కార్మికులు వనం భాస్కర్ , సామల విజయ్ , గుజ్జ లక్ష్మీనారాయణ , బహుజన సమాజ్ పార్టీ పట్టణ అధ్యక్షులు భారత భూషణ్ , తదితరులు పాల్గొన్నారు.



# కూన శ్రీశైలం గౌడ్ ని కలిసిన కొంపల్లి మున్సిపల్ కమిషనర్ క్రిష్ణారెడ్డి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో తన నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ని గురువారం కొంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ క్రిష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ నూతన కమిషనర్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు మరియు కొంపల్లి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈసమావేశంలో కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ పాల్గొన్నారు.




# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: ట్రాఫిక్ ఏసీపీ

నిజామాబాద్ ఫిబ్రవరి 13 (ప్రజా కలం)

నిజామాబాద్ నగరంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ ACP నారాయణ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు అందరికీ తెలిసినా కూడా పాటించడం లేదన్నారు. ప్రధానంగా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్లో వెళ్లడం, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.



# బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

## -కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలలి

## -ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలి

## -బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి

కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి13:(ప్రజాకలం ప్రతినిధి)

బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు చిలువేరు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల రాష్ట్రం దివాలా తీస్తున్నదని, ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మభ్యపెట్టి ఒక్క సంక్షేమ పథకం కూడా సరిగ్గా అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని ప్రతీ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ముందంజలో నిలుస్తుందని కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలిపి లక్ష్యంగా ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలన్నారు. రైతు సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ కుమార్ తో పాటు ఈర్ల శంకర్, చల్లాచంద్రమౌళి,సల్వాల బాలకృష్ణ,ఉప్పుల కుమార్, శంకరాచారి,గరిడే కిషన్,పోగుల శీను,దాసరి కృష్ణ,పూరెళ్ళ దిలీప్,కుసరాజు,ఓర్పుల శ్రీను,కొమ్ము రాజేందర్,నామని రవీందర్,కల్వాల సంపత్,కజ్జం రజిత,బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అఖిలపక్ష నాయకులతో సమావేశం

తుర్కపల్లి, ఫిబ్రవరి 13(ప్రజా కలం ప్రతినిధి)

తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి ఝాన్సీ లక్ష్మీబాయి అధ్యక్షతన మండల స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధులతో మండల ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గం సభ్యుల పోలింగ్ స్టేషన్లో జాబితా పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పార్టీల నాయకులతో చర్చించారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, బిజెపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కుల వెంకటేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, సిపిఎం మండల పార్టీ కార్యదర్శి పోతరాజు జహంగీర్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు వల్లపు రమేష్, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు ,సూపరిండెంట్ జే వినోద్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు





గళం మీది కలం మాది

మీ ప్రాంతంలో ఏ సమస్యనైనా పరిష్కరించడానికి 'ప్రజాకలం' మీకు తోడుగా ఉంటుంది. మీ సమస్యల వివరాలను, పోటోలను మాకు వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

జగిత్యాల: 94403 52123
పెద్దపల్లి :9849007793,9121348522
మెట్‌పల్లి : 95535 39999
రుద్రంగి : 86888 05981
బుగ్గారం : 99897 94948
గోదావరిఖని : 99899 35750
సిరిసిల్ల : 9014368563

◆ కరీంనగర్ ◆ జగిత్యాల ◆ పెద్దపల్లి ◆





# ప్రజాకలం

◆ ఉమ్మడి కరీంనగర్ ◆

శుక్రవారం, ఫిబ్రవరి 14, 2025




## సీఐ నిరంజన్ రెడ్డి కి సన్మానం



మెట్ పల్లి: ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం)భారత కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే ఇండియన్ పోలీస్ మెడల్ కు మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డి ఎంపికవగా గురువారం బీజేపీ సీనియర్ నాయకులు, నిత్యాసాయి చార్టిబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ రఘు, ప్రముఖ వైద్యులు సాగర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆకుల లింగా రెడ్డి లు ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో అందించిన సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ కు మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డి ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాలువాలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

## చదవాలి ...ఉన్నతంగా ఎదగాలి




మెట్ పల్లి: ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం)మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, చదువుతోనే అన్ని సాధ్యమని ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి ఎదగాలని అశ్వని తెలిపారు.మహిళాభివృది శిశు సంక్షేమ శాఖ. ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో పథకం గురించి పిల్లలకు వివరించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుంటూ దేశ ప్రగతికి రథచక్రాల మారాలని వారి అభివృద్ధికి తో పాటు సమాజ అభివృద్ధికి పాటుపడాలని, డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ అశ్విని తెలిపారు. పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మెట్ పల్లి, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు మానసిక ఆరోగ్యం, ప్రేరణ అంశాల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్టిక్ నేషన్ కోఆర్డినేటర్ అశ్విని, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ మానస, మహిళా సాధికారత బృందం జెండర్ స్పెషలిస్ట్ గౌతమి, హెచ్ ఎమ్, రఘుపతి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారి మాట్లాడుతూ నేటితరం విద్యార్థిని విద్యార్థులు ఆకర్షణలకు లోను అవుతున్నారని, ముఖ్యంగా మొబైల్ ఫోన్, ప్రేమ ఆకర్షణలోకి లోన్ అవుతున్నారని, ఆడపిల్లలకి సేఫ్ టచ్ అండ్ సేఫ్ టచ్ గురించి చెబుతూ వారిక విద్యకి అభివృద్ధికి తోడ్పడే విధంగా, చదువుని కొనసాగించాలన్నారు. బాల్య వివాహాల వచ్చే నష్టం గురించి పేర్కొన్నారు, బాలల హక్కు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొనడం జరిగింది.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు



మెట్ పల్లి: ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం) శ్రీ లక్ష్మీనరసింహస్వామి 30 వార్షికోత్సవ పురస్కరించుకొని కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఉదయం అఖండ దీపారాధన, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ట ధ్వజారోహణ బలిహరం హెూమం ప్రత్యేక అభిషేకము కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పరిమి నరసయ్య గంగపుత్ర సంఘ అధ్యక్షులు ఆర్మూర్ నరేందర్, వాల్గొట్ పురుషోత్తం, ఆర్మూర్ రాజేశ్, ప్రోహార్ హేమాచందర్, గుండు నాగేశ్,సురేశ్,లక్ష్మణ్ ప్రవీణ్, తోపారపు నాగయ్య రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమనకు పాల్పడితే సహించేది లేదు

### ములుగు ఎస్పీ డాక్టర్ శబరిష్

మంగపేట ఫిబ్రవరి 13(ప్రజా కలం ప్రతినిధి)

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశించారు. ములుగు జిల్లాలోని మంగపేట పరిధిలో గల రాజుపేట, కత్తిగూడెం ఇసుక క్వారీలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్వారీలో గల ఇసుక నిల్వలపై ఆరా తీసి, క్వారీ ఆఫీసులో ఉన్న రికార్డు పుస్తకాలను పరిశీలించినారు క్వారీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా ఎటువంటి అక్రమాలకు పాల్పడిన జీరో బిల్లులు డబుల్ ట్రిప్ అదనపు లోడ్, నకిలీ బిల్లులు తప్పుడు వాహనంలో రవాణా తప్పుడు గమ్యం స్దానం లాంటి ఉల్లంఘున లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిధిలోని అన్ని క్వారీలలో అలాగే ఇసుక తవ్వకం జరిపే అవకాశం ఉన్న నదులు, వాగుల వంకల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీనివాస్, మంగపేట ఎస్సై టివిఆర్ సూరి పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ బంద్ ని విజయవంతం చేద్దాం

### - మండల మాల సంఘం అధ్యక్షుడు దేవానందం

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 13 (ప్రజా కలం ప్రతినిధి)

ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్ర మాల సంఘం ఫిబ్రవరి 14న రాష్ట్ర బంద్ పిలుపుమేరకు మండల ప్రజలంతా రాష్ట్రబంద్ కి సహకరించాలని ఇబ్రహీంపట్నం మండల మాలసంఘం అధ్యక్షుడు దేవానందం.కోరారు. రిజర్వేషన్లద్వారా మాలలు మాదిగలకంటే ఎక్కువగా లాభపడ్డారని, గుంజుకుతింటున్నారని మాపై నిందలువేసిన మందకృష్ణ మాదిగ.మమ్మల్ని నిందించే వాళ్లసంఘంవారు ఆదినిజమనినిరూపిస్తే వాళ్లకు మారాష్ట్ర నాయకత్వం 25లక్షల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. దానికి మేముకూడా కట్టుబడిఉన్నామని తెలుపుతూ కేవలం ఎస్సీవర్గీకరణపేరుతో మందకృష్ణ తన రాజకీయ స్వార్థప్రయోజనాలకోసం అన్నదమ్ములలాగా కలిసున్న రెండువర్గాలమధ్య చిచ్చుపెట్టి స్వలాభం పొందుతున్నాడని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో ఎస్సీలలో ఉన్న ఇతర ఉపకులాలకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా మాల



సంఘాల తరఫున రాష్ట్ర బంద్ కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని మండల ప్రజలంతా దీనికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కారం ఇంద్రయ్య,రాష్ట్రనాయకులు గుజ్జరి ప్రకాష్, రవి, దూదిగాం గంగాధర్ బొల్లం మురళి,బోరిగం మహేష్, లక్కం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## చికెన్..మటన్ సెంటర్లలో శుభ్రత పాటించాలి

### - మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్



సుల్తానాబాద్,ఫిబ్రవరి13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని చికెన్,మటన్, సెంటర్ల దుకాణ యజమానులు శుభ్రత పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ హెచ్చరించారు.గురువారం మండల కేంద్రం లోని పలు చికెన్,మటన్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం చికెన్,మటన్, సెంటర్ యజమానులు తమ దుకాణాలలో శుభ్రత పాటించి వ్యర్థ పదార్థాలు నిలువ లేకుండా చూడాలన్నారు.బ్లీచింగ్ పౌడర్ చల్లి ఈగలు,దోమలు దరిచేరకుండా చూడాలని,స్వచ్ఛమైన మంచినీరును శుభ్రపరచేందుకు వాడాలన్నారు.ప్రజలకు నాణ్యతతో కూడిన చికెన్,మటన్ విక్రయించాలని, ఎట్టి పరిస్థితిలో మృతి చెందిన కోళ్లను,మేకలను, కోసి విక్రయించవద్దని సూచించారు.ప్రజల జీవితాలతో చెలగాటం ఆడితే సహించబోమని హెచ్చరించారు.అలాగే కోళ్లు,మేకలు నుంచి వచ్చిన వ్యర్థాన్ని డ్రైనేజీలలో ఊరు చివర రోడ్ల పక్కన పడేసిన వారిపై చర్యలు తీసుకొని జరిమానాలు విధిస్తామన్నారు.శుభ్రత పాటించకపోతే జరిమానాలు తప్పవని ఇకనుండి నుంచి తరచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు.ఈ తనిఖీల్లో కమిషనర్ వెంట సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల సంరక్షణకు చర్యలు

### సమస్యల ఫిర్యాదుకు 1098 కు ఫోన్ చేయాలి -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ఫిబ్రవరి13:(ప్రజాకరం జిల్లా ప్రతినిధి)

బాలల సమస్యలపై ఫిర్యాదులు అందించేందుకు 1098 ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బాలల సంరక్షణ చర్యల పై సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అనాథ పిల్లలు,సెమీ ఆర్ఫన్ పిల్లలో స్పాన్సర్షిప్ కు అర్హులైన పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ బాల్య వివాహాలు జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో ఎక్కడ చట్ట వ్యతిరేక దత్తతలు జరగకుండా సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్ లతో సమన్వయం చేసుకోవాలని, గ్రామీణ బాలల పరిరక్షణ కమిటీలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.బాలల పై జరిగే లైంగిక దాడులను నివారించేందుకు సంబంధిత వ్యవస్థలతో




సమయం చేసుకుని పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.బాల కార్మికులు లేని జిల్లాగా పెద్దపల్లిని తీర్చిదిద్దాలని ఇటుక బట్టీ లలో పని చేసే పిల్లలు గుర్తించి వారికి విద్య అదే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లల ద్వారా జరిగే భిక్షాటన వివరాలు,బాల్య వివాహాలు, బాల కార్మికులు ఎక్కడైనా కనబడితే 1098 కు ఫోన్ చేసి వివరాలు అందించాలని అన్నారు.అనాధ పిల్లలను బాల సదనంలో చేర్పించ వచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర,చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఉమాదేవి,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలపోచమ్మ నల్ల పోచమ్మల రథోత్సవం

బుగ్గారం ప్రజాకలం ప్రతినిధి ఫిబ్రవరి 13:బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ ముత్యాల పోచమ్మ నల్ల పోచమ్మల రథోత్సవ వేడుకలు గురువారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయం ముందు ఉంచిన రథంను బంతిపూలతో అలంకరణ చేసి ఒగ్గు కళాకారులు నృత్యాలు చేస్తూ,డప్పు చప్పులతో ఊరిలో ఊరేగింపుగా అమ్మవార్లను ఎదుర్కొన్నారు.దావత్తోళ్ల నృత్యాలు భక్తులకు కనువిందు చేసాయి. అనంతరం భక్తులు

రథంను ఆలయం చుట్టూ లాగారు . ఈ రథోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం నుండే అన్నదాన ప్రసాదం అందించారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ




సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాదినేని రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్, ఆలయకమిటీ చైర్మన్ మసర్తి నర్సయ్య, ఉపాధ్యక్షులు పరమల శ్రీనివాస్, కొసధికారి కాశెట్టి రమేష్,ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు కేసుకు హాజరు కాని వ్యక్తి అరెస్ట్

మెట్ పల్లి: ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం) దొంగతనం కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్టు చేసినట్లు మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డి వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం మెట్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పలు దొంగతన కేసులలో నిందితుడైన భానోత్ శేషును అరెస్టు చేశామని మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. నిందితుడు కొంతకాలంగా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతుండగా, అతనిపై న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందన్నారు.ఈ విషయంలో నిందితుడిని పట్టుకోవడం కోసం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డిఎస్పి రాములు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. నిందితుడు బీదర్ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందడంతో, మెట్‌పల్లి ఎస్సై-2 రాజు నాయక్, హెడ్ కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుల్ రమణ, జలంధర్ లతో కూడిన ప్రత్యేక బృందాన్ని అక్కడికి పంపి అతడిని అరెస్టు చేశారన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకొని కోర్టులో హాజరు పరచడానికి కృషి చేసిన మెట్ పల్లి సి ఐ ఏ. నిరంజన్ రెడ్డి, మెట్ పల్లి ఎస్సై-1, పి. కిరణ్ కుమార్, ఇబ్రహింపట్నం ఎస్సై ఏ. అనిల్, మల్లాపూర్ ఎస్సై కే. రాజు, మెట్ పల్లి ఎస్సై-2 రాజు నాయక్ ని,సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మెట్‌పల్లి డిఎస్పి ఏ రాములు ప్రత్యేకంగా అభినందించారు.




## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



మంగపేట ఫిబ్రవరి 13 (ప్రజా కలం ప్రతినిధి) ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామంలో ఇటీవల నిరుపేదరాలైన గాందేర్ల సమ్మక్క కు చెందిన గడ్డి ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో కాలిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడీష నాగ రమేష్ గురువారం రోజునా వారింటికి వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పి 25 కేజీల బియ్యం, 3000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన అనంతుల రవి మాతృమూర్తి అనంతుల వనమాల ఇటీవల అనారోగ్యంతో మృతిచెందరు వారి కుటుంబాన్ని పరామర్శిచి తిమ్మంపేట గ్రామానికి చెందిన వలబోజు నరసింహచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల్ని కలసి దశదిన కర్మల నిమిత్తం 25 కేజీల బియ్యం 1500 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు . ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బాడిష నవీన్, మునిగెల మహేష్,మండల సంతోష్ యగ్గడి అర్జున్ పూసల నరసింహరావు జాడి రాంబాబు జీముడ నాగేష్ దుర్గం నరసింహ రావు దీగొండ బాబు పూజారి సతీష్ దుర్గం శ్రీను పాల్గొన్నారు.


## బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి



సుల్తానాబాద్,ఫిబ్రవరి13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించి సంస్థకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ పేర్కొన్నారు.గురువారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో రిసోర్స్ పర్సన్ మెప్మా సిబ్బంది లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ మెప్మా సిబ్బందితో మాట్లాడుతూ బ్యాంకులో పొందిన రుణాలు సకాలంలో చెల్లించి తిరిగి కొత్త రుణాలు పొందాలని రుణాలు పొందిన వారు చెల్లించకపోవడంతో వారి సివిల్ స్కోర్ పూర్తిగా తగ్గిపోతుందని,భవిష్యత్తులో రుణాలు పొందేందుకు ఎలాంటి అర్హత ఉండదని ఒకసారి అర్హత కోల్పోతే మరోసారి రుణం పొందే అవకాశం పోతుందని బ్యాంకులో పొందిన రుణాలను ప్రతినెల వాయిదాల పద్ధతిలో చెల్లించి తిరిగి రుణం పొందేందుకు అర్హత కలిగి ఉండాలని అన్నారు.ఇట్టి రుణాలు మార్చి 31 లోపు చెల్లించేలా రిసోర్స్ పర్సన్ మెప్మా లు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ స్వరూప,మెప్మా ఆర్ పిలు,ఓబీలు,పలువురు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలు

పెద్దపల్లి,ఫిబ్రవరి 13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మైదానంలో ఈనెల 15న కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గుజ్జుల కరుణాకర్ రెడ్డి తెలిపారు.



పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు వర్జినల్ ఆధార్ కార్డుతో హాజరుకావాలని,బాలురు 55 కేజీల బరువు, బాలికలు 55 కేజీల బరువు ఉండాలని అన్నారు.ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

# ఏమౌతోంది... ఈ మనుషులకు...

ఈ భూమ్మీద అత్యంత క్రూరమైన జంతువుగా మారగలిగేది ఒక్క మనిషి మాత్రమే. రెండు కాళ్లతో పుట్టి నాలుగు కాళ్ల జంతువుగా మారేది మనిషి ఒపాతికేళ్ల కుర్రాడి నుంచి యాభై ఏళ్ల బామ్మదాకా అందరిలో విలనిజం వెర్రితలలు వేస్తోంది నేరాలకు కారణం ఏంటని.. దాని మూలాలను వెతుకుతూ వెళ్తే కనిపిస్తున్న అడ్రస్ 'ఇల్లు'. నానమ్మ కళ్లలో ఆనందం కోసం చెల్లెలి భర్తనే చంపేశారు. వయసుమళ్లిన తరువాత శాంతంగా, ప్రశాంతంగా ఉండాల్సిన నాయనమ్మే.. మనవళ్లకు పగను నూరిపోయడం వల్ల జరిగింది కాదా ఆ ఘోరం..! వంద మంది అమ్మాయిలను అనుభవించడమే లక్ష్యమట. ఆ టార్గెట్ మరిచిపోకుండా ఉండేందుకు ఏకంగా పచ్చబొట్టు పొడిపించుకున్నాడు ఛాతి మీద. హత్య చేయడానికి, అత్యాచారం చేయడానికి, కన్నవాళ్లనే చిదిమేయడానికి, కట్టుకున్నవాళ్లనే అంతమొందించడానికి.. వీటన్నింటికీ కారణాలున్నాయ్. మనిషి మృగంగా ఎప్పుడు, ఎందుకు మారతాడనడానికి కొన్ని లెక్కలున్నాయి. ఆస్తి ఇవ్వలేదని తాతను పొడిచాడు. ఒక్కసారి కాదు 73 సార్లు పొడుస్తూనే ఉన్నాడు కసిగా. తల్లి అని కూడా చూడకుండా అడ్డొచ్చిన ఆమెపైనా కత్తితో పొడిచేశాడు. మనిషిలో మానవత్వం మాయమవుతోందని చెప్పడానికి ఇదే అతిపెద్ద నిదర్శనం. అసలు.. మానవత్వం మానవత్వం అని గొంతుచించుకుంటూ అరుచుకుంటూ వెళ్తున్నాం గానీ.. కనీసం పశుత్వం అయినా మనిషిలో ఉందా అనేదే అనుమానం. భార్యను ముక్కలుముక్కలుగా నరికి, కుక్కర్‌లో ఉడికించి, ఎముకలు పొడి చేసి, చెరువులో పడేశాడట. మనసులో ఎంత పశుత్వం ఉంటే అంత పనిచేయగలడు. మానిప్యులేటర్స్ అనే పదాన్ని ఈమధ్య క్రైమ్‌లో కూడా వాడుతున్నారు. సైకాలజిస్టులు క్యాటగరైజ్ చేసిన సైకో మెంటాలిటీస్.. ఈ మానిప్యులేటర్స్. ఎలా ఉంటారంటే వీళ్లు. మాటలతోనే మత్తుజల్లుతుంటారు. ఎదుటివారిని నమ్మించగలిగినప్పుడే మోసం చేయొచ్చు. అత్యంత దారుణాలు జరిగేది కూడా నమ్మిన వాళ్ల దగ్గరే. ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఓ అమ్మాయిని.. తనపై నమ్మకం పెరిగేంతగా నటించాడు ఓ యువకుడు. ఇంట్లో ఫంక్షన్ ఉందని చెప్పి, ఆ అమ్మాయిని రప్పించాడు. ఇంట్లో ఫంక్షన్ జరగడం లేదని తెలిసినా సరే.. అక్కడే తన కాలేజ్‌లో చదువుతున్న మరో యువకుడిని చూసి ఏం కాదులే అని నమ్మిందా అభాగ్యురాలు. ఆ నమ్మకమే, అలా నమ్మడం వల్లే ఆ తరువాత నరకం చూసింది. పిలిచిన వ్యక్తి ప్లస్ ఆ తోటి విద్యార్థి.. ఇద్దరూ బయట కాపలాగా ఉంటే.. మూడో వ్యక్తి వచ్చి అత్యాచారం చేశాడు. పైగా ఆ అరుపులు బయటకు వినించకుండా సౌండ్ బాక్సులు పెట్టారట. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో జరిగిందీ దారుణం. ఆడపిల్లల జీవితాలతో మస్తాన్ సాయి ఆడుకుంటూపోయాడని చెబుతున్నారు మానసిక వైద్యులు. ప్రభాకర్ అనే సైకోమెంటాలిటీ ఉన్నవాడిని ఈ మధ్యే చూశాం. వంద మంది అమ్మాయిలే టార్గెట్ అట. ఎంత మానిప్యులేటర్ కాకపోతే.. అంతమందిని లక్ష్యంగా పెట్టుకుంటాడు. మాటలు, మంచితనాన్ని అడ్డుపెట్టి ఎంతమంది అమ్మాయిలను నమ్మించి మోసం చేసి ఉంటాడు. మీర్‌పేటలో భార్యను కిరాతకంగా చంపిన గురుమూర్తినే చూడండి. ఆ చుట్టుపక్కల ఎవరిని అడిగినా సరే.. 'అరె.. అతను చాలా మంచివాడే, ఇలా ఎలా చేశాడు, అసలు అంత దారుణమైన పని చేస్తాడని ఊహించనే లేదు' అనే చెప్పారంతా. హీ ఈజ్ ఆల్సో ఏ వెరీ గుడ్ మానిప్యులేటర్. ఇదనే కాదు.. చిన్న పిల్లలపై, మైనర్లపై అఘాయిత్యాలు చేసేది అలా నమ్మించే వాళ్లే. అన్న కదా, అక్కా అని పిలిచాడు కదా, బాబాయ్, పెదనాన్న, తాతే కదా అని నమ్మకంతో వెళ్లినందుకు ఎంతమంది ఆడపిల్లలు బలైపోతున్నారో. ఆ పశుప్రవృత్తికి కారణం.. 'విషయం బయటకు తెలిస్తే తమ పరువే పోతుందని స్వయంగా తల్లిదండ్రులే భయపడడం'. కామాంధుల బలం కూడా అదే. బయటకు చెప్పుకోలేరు అనే అస్త్రాన్ని ప్రయోగించి.. అయినవాళ్లనే, వావివరసలు మరిచి ప్రవర్తిస్తుంటారు. కొన్ని గణాంకాలు కూడా ఉన్నాయ్. ఎన్సీఆర్బీ–2016 రిపోర్ట్ ప్రకారం మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార కేసుల్లో.. 94 శాతం దోషులు ఆ కుటుంబానికి బాగా తెలిసిన వాళ్లు, దగ్గర వాళ్లే. ఆ దోషులలో 29 శాతం మంది ఇరుగుపొరుగు వాళ్లు, 27 శాతం పెళ్లి చేసుకుంటామని హామీ ఇచ్చిన వాళ్లు, 6 శాతం బంధువులు, మిగతా 30 శాతం ఆ కుటుంబానికి చాలా దగ్గరగా ఉండేవాళ్లు. సో, ఒక్కోసారి నమ్మకమే ప్రమాదకరం. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఇద్దరు పసిపిల్లలను కొట్టిన తీరు చూసి.. వైద్యం చేసిన డాక్టర్లే కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతలా కొట్టడానికి మనసెలా వచ్చిందని. పిల్లల్ని అలా కొట్టడానికి కారణం ఏంటో తెలుసా. వివాహేతర సంబంధం. తన వ్యవహారానికి పిల్లలు అడ్డొస్తున్నారని ఫోన్ ఛార్జర్ వైర్‌తో కొడుతుంటే.. చర్మం చిరిగిపోయి, రక్తం బయటకు చిమ్మింది. అక్కడితో ఆగలేదు. ఆ గాయాలపై కారం పూశారట. 9 ఏళ్ల బాలుడు అనుభవించిన టార్చర్ వింటే ఎవరికైనా కన్నీళ్లొస్తాయ్. ఆ బాలుడి చెల్లెలు.. వయసు ఐదేళుంటాయి.. ఆ చిన్నారిని కూడా వాతలు తేలేలా కొట్టాడు. ఆ అడ్డమైన సంబంధానికి పిల్లలు అడ్డొస్తున్నారన్న కోపంతో చేసిన దుర్మార్గం ఇది. జాతివైరాన్ని మరిచిన జంతువులు' అని ఒక్కోసారి కొన్ని వీడియోలు చూస్తుంటాం. లేడిపిల్ల దగ్గరకు వచ్చినా సరే పులి ఏమీ చేయకుండా దాన్ని నాకుతూ ఉంటుంది ఆప్యాయంగా. అలాంటిది కడుపున పుట్టిన వారినే దయా దాక్షిణ్యాలు లేకుండా ప్రవర్తిస్తున్న తల్లిదండ్రులున్నారు. 14 ఏళ్ల కొడుకుపై పిడిగుద్దులు కురిపించాడో తండ్రి. ఛాతిపై తట్టుకోలేనంత తీవ్రతతో పిడికిలి బిగించి మరీ బాదాడు. అంత దెబ్బ తగిలితే పిల్లాడు ఉంటాడా. అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇంత దారుణంగా ప్రవర్తించడానికి కారణం.. తన కొడుకు రాత్రి 8 అయినా ఇంటికి రాకపోవడం. 'నాన్నా స్కూల్లో ఫేర్‌వెల్ పార్టీ జరిగింది.. కాస్త ఆలస్యం అయింది' అని చెబుతున్నా వినకుండా కొట్టడంతో తొమ్మిదో తరగతి చదివే ఆ బాలుడు అక్కడికక్కడే చనిపోయాడు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిందిది. తెలంగాణనే చూద్దాం. ఒక్క ఏడాదిలోనే కుటుంబ కలహాలతో 229 హత్యలు జరిగాయి. వివాహేతర సంబంధాల కారణంగా 102 హత్యలు, చిన్నచిన్న గొడవల కారణంగా 82, ఆర్థిక వివాదాలతో 53 హత్యలు జరిగాయి. గతేడాది మహిళలపై జరిగిన నేరాలే.. 19వేల 922. వీటిలో సగం వరకట్న వేధింపులే. ఇక అత్యాచార కేసులలో 99.2 శాతం నిందితులు బాధితులకు తెలిసినవారే చేశారంటున్నారు తెలంగాణ పోలీసులు. ఓవైపు.. కఠిన శిక్షలు ఉన్నా, మరణశిక్షలు విధిస్తున్నా సరే.. ఈ అత్యాచారాలు మాత్రం ఆగడం లేదు. 2012లో నిర్భయ ఘటన జరిగాక.. అత్యాచారాలకు అత్యధికంగా మరణశిక్ష కూడా విధించొచ్చు అంటూ చట్టంలో మార్పులు చేశారు. ఈ శిక్షతో నేరస్తులు భయపడిపోతారని అనుకున్నారంతా. కానీ జరిగిందేమిటో తెలుసా. 2015లో 34వేల 651 అత్యాచార కేసులు, 2016లో 38వేల 947 అత్యాచార కేసులు రిజిస్టర్ అయ్యాయి. 2012లో.. అంటే నిర్భయ ఘటన జరిగిన ఏడాదిలో.. 24వేల 923 సంఘటనలే జరిగాయి. అంటే.. ఉరిశిక్ష పడుతుందన్న భయం కూడా లేదని తేలిపోయింది. పైగా ఇలా అత్యాచార బాధితుల్లో ఎక్కువగా పిల్లలే ఉన్నారు. పోక్సో లాంటి పవర్‌ఫుల్ చట్టం ఉన్నప్పటికీ.. కేవలం 3 శాతం కేసులలో మాత్రమే నేరాలుగా నిరూపించగలిగారు. ఔఅఖీః రిపోర్ట్ ప్రకారం.. 2016లో పిల్లలపై అత్యాచారాలకు సంబంధించి 64వేల 138 కేసులు పోక్సో చట్టం కింద నమోదైతే.. కేవలం 3 శాతం కేసులనే నిరూపించగలిగారు. నేరమే నిరూపించలేకపోయినప్పుడు ఎవరిని ఉరి తీస్తారు? వీటన్నింటికీ కారణం ఏంటని అడిగితే.. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవడమే అనే సమాధానమే ప్రధానంగా వినిపిస్తోంది. పిల్లల్ని పెంచే పద్ధతిలోనే ఏదో లోపం జరుగుతోంది. అటుపైన ప్రతి ఇంట్లోకి వేగంగా దూసుకొచ్చిన ఇంటర్నెట్. ఏ నేరం ఎలా చేయాలో, ఎలా చేస్తే తప్పించుకోవచ్చో చెప్పే సినిమాలు సెల్‌ఫోన్ నిండా ఉన్నప్పుడు.. టెస్టోస్టెరాన్ స్థాయిని పెంచే ఘాటైన వీడియోలు కళ్లముందే కదలాడుతున్నప్పుడు.. ఇక నేరాలు జరక్కుండా ఉంటాయా? అయినా లోపం.. ఇంటర్నెట్‌తో, రెచ్చగొట్టే వీడియోలది మాత్రమే కాదు. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న తీరులోనే లోపం ఉంది. యూరప్‌లోని కొన్ని దేశాల్లో జైళ్లనే ఎత్తేశారు. కారణం.. అక్కడ నేరాలు జరక్కపోవడమే. అంటే ఏంటీ అర్థం. మనిషి సంతృప్తిగా జీవించినప్పుడు, ఆ మనిషి సంతృప్తికరంగా జీవించేలా ప్రభుత్వాలు సమాజాన్ని నిర్మించినప్పుడు మాత్రమే నేరాల కట్టడిసాధ్యం. ఉరివేయాలి, మెడలు కోయాలి, బహిరంగంగా తగలబెట్టాలి.. ఇలాంటి శిక్షలు సైతం మనిషిని మార్చలేవు. సో, సమాజం మారాలంటే.. అటు ప్రభుత్వాలు కూడా జీడీపీ ఆధారంగా కాకుండా హ్యాపీనెస్ ఇండెక్స్ కొలమానంగా పాలించాలంటున్నారు విశ్లేషకులు. మరి.. అలాంటి రోజులు ఎప్పుడొస్తాయో, ఎప్పుడు చూస్తామో..!

## ఎండపల్లి మండల నూతన ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన నరేష్ కుమార్



ఎండపల్లి, ఫిబ్రవరి 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండల నూతన ఎంపీడీవో గా ఉప్పరపెల్లి నరేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు ఇక్కడి ఎండపల్లి ఎంపీడీవో జక్కుల శ్రీనివాస్ సెలవు పై వెళ్లడం తో ధర్మపురి లో ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఉప్పరపెల్లి నరేష్ కుమార్ అదనపు బాధ్యతలు స్వీకరించారు ఎండపల్లి ఇంచార్జి ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించడం పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు



# మైనారిటీ సంక్షేమానికి కృషి చేస్తా

### ఖబ్రస్తాన్ నిర్మాణానికి భూమి కేటాయింపు -ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి,ఫిబ్రవరి 13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ముస్లీం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణ రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఫారన్ మసీద్ లో గురువారం ముస్లింలు ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్యే విజయరమణా రావు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ గతంలో ముస్లీంలకు ఇచ్చిన మాట ప్రకారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామ శివారులో స్మశానవాటిక నిర్మాణం కోసం ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత భూమి కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఖబ్రస్థాన్ కు రెండు ఎకరాల భూమి మంజూరు అయ్యిందని ప్రకటించారు. అనేక సార్లు అధికారులతో చర్చించి ముస్లీల కోరిక నెరవేర్చామని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పెద్దపల్లి ముస్లీంలు ఖబ్రస్థాన్, షాదీ ఖానా, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రజల కోరిక, అవసరాలకు అనుగుణంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి పట్టణంలో బస్ డిపో మంజూరు చేయించడం జరిగిందని, మార్చి తర్వాత పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అలాగే బైపాస్ రోడ్డు టెండర్లు పూర్తి అయ్యాయని, మే మొదటి వారంలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని అన్నారు. ఖబ్రస్థాన్ కోసం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామ శివారులోని 1072 సర్వే నెంబర్ లో రెండు ఎకరాల స్థలం ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే మంత్రిమండలి ఆమోదంతో మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. అలాగే షాదీ ఖానా కోసం పది నుండి 15 గుంటల స్థలం కేటాయించే ప్రయత్నం చేస్తున్నామని, డిగ్రీ కళాశాల నిర్మాణానికి సైతం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ముస్లీం మైనారిటీ నాయకులు, మత పెద్దలు ఎమ్మెల్యే విజయ రమణా రావును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మున్నా భాయ్, ఎం.ఏ హై జావిద్, ఎం.ఏ ఖలీల్, ఆరీఫ్, సయ్యద్ మస్రత్, షాకీర్, ఎంఏ మొయిద్, ఇంతియాజ్ ఖాన్, అంజద్ అలీ, ఎండి నాజీమ్, షేక్ అజ్గర్, ఎండి సాజిత్, ఎండి మసూద్, ఎండి కాజా పాషా, అస్లాం, ఎండి ముస్తాక్, జహీర్, అబ్బు, రహీముద్దీన్, సర్వర్, మిరాజ్, నదీమ్, ముక్తి ఇస్తే ఖాన్, ఇమ్రాన్ సాహెబ్ తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు పెన్నులు వితరణ

ఎండపల్లి, ఫిబ్రవరి 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండల కేంద్రం లో గురువారం రోజున ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మారం లో 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థుల కు మోటివేషన్. పిరమిట్ జ్ఞానం క్లాస్. జ్ఞానం గురుజి. దిలేశ్వర్ రెడ్డి గారిచే నిర్వహించనైనది. దాంతో 41 మంది పదవ తరగతి విద్యార్థిని విద్యార్థు లకు ఎగ్జామ్ ప్యాడ్ లు పెన్ను లు బహుకరించడం జరిగింది లయన్స్ క్లబ్ అధ్యక్షులు తలమక్కి రవీందర్ శెట్టి ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మారం ఎంఈఓ పోతు ప్రభాకర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు తలమక్కి రవీందర్ శెట్టి లయన్ రీజియన్ చైర్మన్ తన్నీరు రాజేంద ర్ జోన్ చైర్మన్ లయన్ డాక్టర్ కా మిని శ్రీనివాస్ కార్యదర్శి లయన్ ఎండి ముజా హిద్ ట్రెజరర్ లయ న్ కట్ట రమేష్ లయన్ క్లబ్ సభ్యు లు మిట్టపల్లి చంద్రకాంత్ రెడ్డి లయన్ విట్ట రవి పాఠశాల ప్రధానో పాధ్యాయులు మాలతి ఇంచార్జ్ ఆర్ అరుణ అంజయ్య పలువురు ఉపాధ్యా యులు పాల్గొన్నారు నిర్వహించి నారు విద్యార్థుల్లో పరీక్షల భయ ము ను దూరం చేయడానికి ఒత్తిడి ని తగ్గించ డానికి మంచి మార్కులు వచ్చిన వారికి ధర్మారం లయన్స్ క్లబ్ వారిచే ప్రత్యేక బహుమతులు ఇవ్వడం జరుగుతుందని క్లబ్ అధ్యక్షులు రవీందర్ శెట్టి అన్నారు అలాగే ఇదే స్కూల్లో 9వ తరగతి



విద్యార్థిని ఒకరు డయాబెటిక్ తో బాధపడుతుంటే క్లబ్ తరపున మెడిసిన్ ఖర్చు కోసం కొన్ని నగదు ఇవ్వడం జరిగింది విద్యార్థిని విద్యార్థులకు మంచి మార్కులు తెచ్చుకోవడానికి అనేక సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది పౌష్టికాహారం భుజించాలని పిక్చర్ ఇమేజినేషన్ చేసుకోవాలని ప్రతి దాన్ని పునర్చరణ నిర్వహించు కోవాలని బట్టి పద్ధతి కాకుండా అర్థం చేసుకుని చదవాలని వారు సూచించడం జరిగింది. ఈ కార్య క్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంఈఓ పోతు ప్రభాకర్ మాట్లాడుతూ ఉదయం నిద్ర లేవాలని, ఆకుకూరలు కూర గాయలు తినాలని ఏడు గంటలు నిద్రించాలని మానసిక ఆందోళన తగ్గించాలని తల్లిదండ్రుల ఉపా ధ్యాయుల సలహాలను స్వీకరించా లని విద్యార్థులకు సూచించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు తలమక్కి రవీందర్ శెట్టి తెలిపారు.

# కుష్టు వ్యాధి పై అవగాహన కార్యక్రమం

### - తొందరగా గుర్తించి చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాదు
### - జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి



పెద్దపల్లి,ఫిబ్రవరి13:(ప్రజాకలం ప్రతినిధి)జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా మహాత్మా గాంధీ వర్ధంతి రోజైనా జనవరి 30 నుండి ఫిబ్రవరి13 వరకు అవగాహన పక్షోత్సవాలు నిర్వహించడం జరిగిందని. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ జి అన్నా ప్రసన్న కుమారి తెలిపారు. దీనిలో భాగంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో పి హెచ్ సి ముత్తారంలో కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవాల చివరి రోజు కార్యక్రమమును జరుపుకొన్నరు. ఈ సందర్భంగా పి హెచ్ సి పరిధిలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు చెద్దర్లు, బెడ్ షీట్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుష్టు వ్యాధి పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డాక్టర్ జి. అన్నా ప్రసన్నకుమారి ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు కుష్టు వ్యాధి అనేది సామాన్యమైన అంటువ్యాధి, ఇది బహుళ ఔషధ చికిత్స ద్వారా పూర్తిగా నయం అవుతుందని, ఈ వ్యాధి మైకో బాక్టీరియం లేప్రే అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి. ఈ వ్యాధిని త్వరగా గుర్తించినట్లైతే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని ఈ వ్యాధి యొక్క లక్షణాలు చర్మం పైన స్పర్శ లేనటువంటి రాగి రంగులో లేదా గోధుమ రంగులో పాలిపోయిన, మొద్దు బారిన మచ్చలు. ఇవి ఉన్నట్లయితే అనుమానించి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ వ్యాధి శాపము, పాపము ద్వారా రాదు వంశ పారంపర్యంగా కూడా రాదు అని అన్నారు. 2027 నాటికి కుష్టు వ్యాధి రహిత భారత దేశంగా ఏర్పరచడం కోసం ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని వారు కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమము లో లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కిరణ్ కుమార్, పి. హెచ్. సి. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరేందర్ రావు, డిపిఎమ్ఓలు సువార్త, రమేష్, దేవి సింగ్, పీహెచ్సీ సిబ్బంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించడం జరిగినది.

# 70 శాతం సీసీ కెమెరాలు పనిచేయడంలేదు: కవిత

నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం) భద్రత కోసం మహిళలు పోరాటం చేయాల్సిరావడం బాధాకరమని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన మహిళా జాగృతి సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు 70 శాతం పనిచేయడం లేదని ఆరోపించారు.



# ఆసుపత్రి భవనాన్ని సమర్థవంతంగా వినియోగించాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
### - డయాలసిస్ యూనిట్ నిర్వహణకు అవసరమైన అదనపు పనులు చేపట్టాలి - 42 పడకల ఆసుపత్రి భవనాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి,ఫిబ్రవరి13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన 42 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం అవుతున్న 42 పడకల ఆసుపత్రి భవనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ప్రజల సౌకర్యార్థం ఆసుపత్రి ప్రాంగణంలో మరో 42 పడకల ఏర్పాటు చేసేలా భవనాన్ని నిర్మించామని, వీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా ఆసుపత్రి యంత్రాంగం ఏర్పాటు చేయాలని అన్నారు. నూతన భవనంలోకి డయాలసిస్ యూనిట్ తరలింపు కోసం అదనపు స్పెస్ అవసరం పడుతుందని, దీనికోసం చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సంబంధిత నిర్మాణ ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వాసుదేవ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎండపల్లి మండల పరిషత్ కార్యాలయం లో

# ఆల్ పొలిటికల్ పార్టీ మీటింగ్

### - ఎంపీటీసీ ఎలక్షన్స్ కు సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ పై సమావేశం



ఎండపల్లి, ఫిబ్రవరి 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండల కేంద్రం లో మండల పరిషత్ కార్యాలయం లో గురువారం రోజున ఎంపీటీసీ ఎలక్షన్స్ కు సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ పై ఆల్ పొలిటికల్ పార్టీ మీటింగ్ ఉదయం 10:30 నిమిషాలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని నూతన ఇన్చార్జ్ ఎంపీడీవో నరేష్ కుమార్ తెలిపారు ఈ సమావేశం లో బిజెపి ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సింహాచలం జగన్ పాల్గొన్నట్లు ఎండపల్లి ఇంచార్జి ఎంపీడీవో నరేష్ కుమార్ తెలిపారు.

# మండల అభివృద్ధి అధికారి గా ఏ.పూర్ణచందర్ రావు



కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి13:(ప్రజాకలం ప్రతినిధి)కాల్వశ్రీరాంపూర్ మండల నూతన మండల అభివృద్ధి అధికారి గా ఏ.పూర్ణచందర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవో గా విధులు నిర్వహించిన కలికోట రామ్మోహనచారి పాలకుర్తి మండలానికి బాధిపై వెళ్లారు. పాలకుర్తి మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహించిన పూర్ణచందర్ రావు కాల్వ శ్రీరాంపూర్ మండలనికి బదిలీపై వచ్చారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో పూర్ణచందర్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేల కృషి చేస్తానని తెలిపారు. ఎంపీఓ, సూపర్డెంట్, సీనియర్ అసిస్టెంట్, ఏపీవో, కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవోకు స్వాగతం పలికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

### సంబంధిత వాహన ఒరిజినల్ పత్రాలు తెస్తే

# బాధితులకు వాహనాలను అందిస్తాం

మెదక్ జిల్లా. ఫిబ్రవరి 13 పెద్ద శంకరంపేట ప్రజా కలం ప్రతినిధి గత కొన్ని నెలలుగా ఎలాంటి డాక్యుమెంట్స్ లేని ఐదు వాహనాలను పెద్ద శంకరంపేట పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ నందు భద్రపరిచారు.. ఇందులో డిస్కవరీ 125 ఒక వెహికల్ TS29AS4082.. నాలుగు ఆటోలు వెహికల్ నెంబర్ల వారీగా TS15UD1030... AP28UV4975.. MD2A96AYXKWB15297.. MD2A26AAZ6DWH45589 .. పై నెంబర్లు గల వాహనాలకు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలనుపెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్‌లో తీసుకొచ్చిచూపించినచో వాటిని వాహనదారులకు అప్పగించబడునని పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ తెలిపారు..

## అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన సీఎండీ బలరాం



గోదావరిఖని, ఫిబ్రవరి 13: (ప్రజా కలం ప్రతినిధి) గత నెలలో ఆర్జీ-1 కార్యాలయం ముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి రాలేదని సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. గురువారం సింగరేణి సంస్థ సీఎండీ బలరాం, నూతన డైరెక్టర్ (ఆపరేషన్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ పీపీ కొప్పుల వెంకటేశ్వర్లు ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణలో ప్రముఖ పాత్ర పోషించిన ప్రెసిడెంట్ యాట ఓదెలు, జనరల్ సెక్రెటరీ గంగారపు లింగమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆరెపల్లి రామచందర్, చీఫ్ అడ్వైజర్ పులిమోహన్ ను చైర్మన్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 ఉపాధ్యక్షులు జనగామ నరసయ్య, కార్యదర్శి ఉమేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థకు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

## - సింగరేణి సెక్టర్-1 పాఠశాలలో సీబీఎస్ఈ అప్ గ్రేడ్ చేయాలి..

- ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు 80శాతం ఉద్యోగ అవకాశలు కల్పించాలి
- కాలయాపన చేయకుండా కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- హిందూ శ్మశానవాటికలో ఉచిత దహనసంస్కారలు నిర్వహించాలి - సింగరేణి సీఎండీని కోరిన మద్దెల దినేష్



గోదావరిఖని, ఫిబ్రవరి 13: (ప్రజా కలం ప్రతినిధి)

రామగుండం రీజియన్ లో పర్యటిస్తున్న సింగరేణి సీ అండ్ ఎండీ బలరాంను గురువారం స్థానిక ఓసీపీ-3 కృషి భవన్ లో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్, ఉపాధ్యక్షులు రేణికుంట్ల నరేంద్ర కలిసి గొదావరిఖనిలోని పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని బాలరాంకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మద్దెల దినేష్, రేణికుంట్ల నరేంద్ర మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి గుండె కాయలాంటిది అతి పెద్ద సింగరేణి సంస్థ, అందులో భాగంగా ఆర్జీ-1 కూడా పెద్ద డివిజన్ ఇండస్ట్రీయల్ ఏరియా అయినప్పటికీ నిరుద్యోగం మాత్రం గోదావరిఖనిలో విలయతాండవం చేస్తుందని, సింగరేణి సంస్థ ద్వారా ఆర్జీ-1 ఏరియా లో సింగరేణి సంస్థకు అనుబంధంగా అనుబంధం పరిశ్రమలు ఏర్పాటు చేసి మాజీ కార్మికులు ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికుల, భూనిర్వాసిత పిల్లలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని కొరమన్నారు. అదే విధంగా మారుతున్న కాలానికి అనుగుణంగా సింగరేణి లో సింగరేణి సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సింగరేణి పాఠశాలలను అప్ గ్రేడ్ చేయాల్సిందని. 5-1 పాఠశాలను సీబీఎస్ఈ పాఠశాలగా మార్చాల్సిన గోదావరిఖని సింగరేణి సెక్టర్-1 అవసరం ఉందన్నారు. అదే విధంగా ఓపెన్ కాస్ట్-3,5 భారీ బ్లాస్టింగ్ల తో రోజు మధ్యాహ్నం 03:30 గంటల నుండి 04:00 గంటల వరకు భూకంపాన్ని తలపించే విధంగా బ్లాస్టింగ్లు జరుగుతున్న సందర్భంగా దుమ్ముధాళితో రోగాలభారిన వడుతున్నామని పేర్కొన్నారు. పొమ్మనలేక పొగ పోడుతున్నారని అందులో భాగంగా 33వ డివిజన్ ఓసిపి-5 ప్రభావిత డివిజన్ అయినప్పటికి 33వ డివిజన్ ను సింగరేణి యాజమాన్యమే దత్తత తీసుకుని డివిజన్ లో రోడ్లు, పార్కులు, మంచినీటి సౌకర్యం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఓపెన్ జీమ్, బోరింగ్లు, సోలార్ లైట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఆర్వో వాటర్ ప్లాంట్ల మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కార్మికుల కుటుంబాల పక్షాన కోరడం జరిగిందన్నారు. సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ కొలువుల కోసం పోటీ పడుతున్న తరుణంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి శిక్షణ కేంద్రాలలో ఆర్థికంగా నష్టపోతున్నారని, సింగరేణి ఆధ్వర్యంలో గోదావరిఖనిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేసి విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగ పడేవిధంగా చూడాలని వారికి సూచించమన్నారు. అలాగే గోదావరిఖనిలోని హిందూ స్మశాన వాటికను సింగరేణి దత్తత తీసుకోని స్మశానంలో కనీస మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఎవరైనా దురదృష్టవశాత్తు మరణిస్తే సింగరేణి ద్వారనె ఉచిత దహన సంస్కారాలు నిర్వహించాలని కొరమన్నారు. ముఖ్యంగ సింగరేణిలో గత కొనేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు పార్మనెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న వారికి హైపవర్ వేతనాలు అమలు చేయాలని వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. పై విషయాలను అన్నిటిపై సానుకూలంగా స్పందించి ప్రతి సమస్యను ఒకొక్కటిగా పరిష్కరిస్తామని ముందుగా సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేద్దాం అని హామీ ఇచ్చారాని దినేష్ తెలిపారు.

## అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష,1100 రూపాయల జరిమాన

జగిత్యాల క్రైమ్, ఫిబ్రవరి 13 (ప్రజాకలం ప్రతినిధి) : జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోతే గ్రామానికి చెందిన కల్లెడ సత్తయ్య తేదీ 12- 11- 2019 రోజున అదే గ్రామానికి చెందిన ఆర్మల్లా మధుసూదన్ అను వ్యక్తి మోతే బైపాస్ రోడ్డు దగ్గర హార్వెస్టర్ రిపేర్ నిమిత్తం సత్తయ్యని పిలవగా అక్కడికి వెళ్లిన సత్తయ్య హార్వెస్టర్ కట్టర్ బార్ ఎక్కించుతుండగా మధుసూదన్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా హార్వెస్టర్ ను అకస్మాత్తుగా ముందుకు నడపగా, హార్వెస్టర్ పెద్ద టైర్ సత్తయ్య ఎడమకాలు పై నుండి వెళ్ళగా అతనికి తీవ్ర గాయం అయ్యి హాస్పిటల్ కి తరలించడం జరిగింది. ఇట్టి విషయం గురించి కల్లెడ సత్తయ్య జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్.ఐ సతీష్ నిందితుడి పై కేసు నమోదు చేసి విచారణ జరిపి ఛార్జ్ షీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన జడ్జి శ్రీనిజ కొహిర్కర్ నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష మరియు 1100 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

## విద్యుత్ సరఫరా పనులను సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- విద్యుత్ శాఖ పై రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి,ఫిబ్రవరి13:(ప్రజా కలం ప్రతినిధి)జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు విద్యుత్ సరఫరా పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యుత్ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చేపట్టిన విద్యుత్ సరఫరా పనులను 3 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో ఇప్పటి వరకు 266 అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేశామని,పెండింగ్ ఉన్న 47 అంగన్వాడి కేంద్రాల పనులు 3 రోజులలో పూర్తి కావాలని అన్నారు.జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న మరో 26 అంగన్వాడి కేంద్రాలకు ప్రత్యేకంగా లైన్ వేసి విద్యుత్ సరఫరా కల్పించాలని,ఈ పనులను వారం రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి పట్టణంలోని చందంపల్లి,రాంపల్లి లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు విద్యుత్ సరఫరా పనులు వారం రోజుల వ్యవధిలో పూర్తి చేసి ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ పెద్దపల్లి మాధవరావు,మంథని డీఈ ప్రభాకర్,పెద్దపల్లి డిఈ తిరుపతి,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి గ్రామంలో పర్యటించిన మనాలిఠాకూర్..



గోదావరిఖని, ఫిబ్రవరి 13: (ప్రజా కలం ప్రతినిధి) పాలకుర్తి గ్రామంలో రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ సతీమణి మనాలిఠాకూర్ పర్యటించారు. గ్రామంలోని ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం, ఉపాధి హామీ కూలీలతో జరిగిన సమావేశంలో మనాలిఠాకూర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ, ఎస్సీ బలహీన వర్గాల అభివృద్ధి కోసం చేసిన ప్రత్యేక చర్యలను వారికి తెలిపారు. దేశంలోనే ఇతర రాష్ట్రాలు చేయని విధంగా బీసీ వర్గాలకు రిజర్వేషన్ పెంపు ద్వారా 42శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని గొప్ప కార్యంగా అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ధైర్యంగా తీసుకున్న నిర్ణయాలు బీసీ, ఎస్సీ వర్గాలకు అనూహ్యంగా లాభాలను అందిస్తున్నాయన్నారు. ఉద్యోగాలు, రాజకీయాల్లో ఈ వర్గాల ప్రాధాన్యత పెరగడం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం రైతుకూలీలకు మిఠాయిలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సమావేశంలో గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగామలో మురికి కాల్వలు శుభ్రం చేయించండి..

- సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్

గోదావరిఖని, ఫిబ్రవరి 13 : (ప్రజా కలం ప్రతినిధి)

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9వ డివిజన్ జనగామలోని గణేష్ నగర్ లో మురికి కాలువలను శుభ్రం చేయించాలని,






చెత్తకుప్పలను తొలగించి వాడ ప్రజలు అనారోగ్యాలకు గురి కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేష్ కుమార్ కోరారు. మురికి కాలువల్లోని పూడికను తొలగించకపోవడం వల్ల కాలువల్లో మురికినీరు నిల్వ ఉండి దోమలు.. ఈగలు వ్యాప్తి చెంది ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. దీంతో పాటు చెత్తకుప్పలను తొలగించకపోవడం వల్ల దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి 9వ డివిజన్ జనగామలోని గణేష్ నగర్ లో ఉన్న మురికికాలువల్లోని పూడికను తొలగించాలని అదేవిధంగా వాడలో ఉన్న చెత్త కుప్పలను తొలగించి శుభ్రంగా ఉంచాలని, ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సింగరేణి ఆర్జీ-1లో పర్యటించిన సీఎండీ బలరాం..

గోదావరిఖని, ఫిబ్రవరి 13: (ప్రజా కలం ప్రతినిధి)

సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ,డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్. కె.వెంకటేశ్వర్లు రామగుండం ఏరియాలోని జీడీకే, 11వ గని, జీడీకే.ఓసీపీ-5 ఉపరితర గనులలో ఉద్యోగులతో 'ముఖా ముఖి' కార్యక్రమం చేపట్టారు. ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి. లలితకుమార్ అధ్యక్షతన లో జరిగిన సమావేశంలో ఈ సందర్భంగా చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరు తమకు కేటాయించిన విధులను తప్పనిసరిగా 8 గంటల సమయంలో పూర్తిగా చేయాలన్నారు. భారీ యంత్రాల వినియోగ సమయాన్ని పెంచాలని, సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా విధులకు హాజరవుతూ నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. అలాగే పనిచేస్తున్న సూపర్వైజర్లు, మైనింగ్ సిబ్బంది, కోల్ కట్టర్స్, సపోర్టు మెన్ అండ్ వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగులతో చైర్మన్ ముఖాముఖీతో మాట్లాడి వారికి కావలసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

జీడీకే. 11వ గని, జీడీకే. ఓసీపీ-5 ప్రాజెక్ట్ లో పనిచేస్తున్న ఉద్యోగులు చైర్మన్ తో మాట్లాడుతూ వివిధ రకాల యంత్రాలు, విడిభాగాలు పాతవైనప్పటికీ వీటితోనే పనులు వెల్లదీస్తున్నామని, వాటి స్థానంలో నూతన మెషినరీలను ప్రవేశపెట్టడంతో పనులు పురోగతిలో కొనసాగుతాయని, వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ ఉద్యోగుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిజనిర్ధారణ చేసి వీటికి సంబంధించిన పనులను త్వరగా చేయాలని




అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. భూగర్భ గనిలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరు రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత దిశగా పనిచేయాలనీ, తప్పనిసరిగా గని నిర్దేశిత వార్షిక లక్ష్యాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు.తదనతరం చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జీఎం ఆఫీస్ ముందు ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్, రక్షణ జీఎం కే.హెచ్ యన్ గుప్త, క్వాలిటి జియం డి.వైద్య, ఏజంట్ చిలుక శ్రీనివాస్, ఓసి.5 ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ కే. చంద్రశేఖర్, ఎసియంవో కిరణారాజ్ కుమార్, డిజీఎం పర్సనల్ కిరణ్ బాబు, అధికారులు డి.వి. రావు, అంజనేయప్రసాద్, ఆంజనేయులు, వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, మేనేజర్లు రమేష్ బాబు, అనిల్ బాలే, బి. మల్లేష్. గుర్తింపు సంఘం యూనియన్ నాయకులు, స్వామి, మడ్డి ఎల్లయ్య, అరెల్లి పోషం, సీనియర్ పి.ఓ.హన్మంతరావు, సంక్షేమ అధికారులు, ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ లో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కుల గణన చేపట్టాం..

- బీసీ సంక్షేమం కోసమే 42% రిజర్వేషన్ కేటాయిస్తున్నాం
- బీసీలకు ఆర్థిక,సామజిక న్యాయం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- దేశం మొత్తం గర్వపడేలా తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నాం
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

గోదావరిఖని, ఫిబ్రవరి13: (ప్రజా కలం ప్రతినిధి)

ఇటు రాష్ట్రంలో అటు దేశంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బీసీ లను, బహుజనులను హీనంగా చూసిన చరిత్ర ప్రజలందరికి తెలుసు,సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంటే ఓర్వలేకనే ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతూ కపట ప్రేమను కురిపిస్తున్నాయని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్, పొన్నం ప్రభాకర్ గౌడ్, సీతక్క సురేఖ మంత్రులందరి సమక్షంలో జరిపిన సమావేశంలో భాగంగా బీసీలను ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా బహుజనులందర్నీ బలోపేతం చేయడమే లక్ష్యంగా బీసీలకు 42% రిజర్వేషన్ కేటాయించడంతోపాటు దేశం మొత్తం తెలంగాణ అభివృద్ధిని చూసి గర్వపడే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దబోతున్నామని, తెలంగాణ రాష్ట్రంలో బీసీలను బహుజనలను దృష్టిలో ఉంచుకొని సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, అభివృద్ధి ప్రణాళికలో భాగంగానే కుల గణనను చేపట్టామని కులగణన రిపోర్ట్ లో మిగిలిపోయిన వారు ఎవరైనా ఉంటే యుద్ధ ప్రతిపాదికన వారి వివరాలను పూర్తిస్థాయిలో సేకరించబో తున్నామని అందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ పాలకుల హయాంలో బిఆర్ఎస్, జెజెపి లు బీసీలను బహుజనులను హీనంగా చూశాయని,మాయ మాటలతో మోసం చేశాయని గత ప్రభుత్వాల వ్యవహారాన్ని బీసీ లు, బహుజనులు గమనించే వారికి తగిన బుద్ధి చెప్పారని బీసీల బహుజనుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కృషిని ఓరువలేకనే ప్రతిపక్ష టిఆర్ఎస్ బిజెపి పార్టీలు గగ్గోలు పెడుతూ మేము చేయలేని పని కాంగ్రెస్ పార్టీ చేస్తుందని టిఆర్ఎస్, బిజెపి పార్టీలు కపట ప్రేమను ప్రదర్శిస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తస్మాత్ జాగ్రత్త మీరు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా బీసీలను బహుజనులను సామాజిక,ఆర్థిక,రాజకీయ, ఉపాధి, వాణిజ్య, వ్యాపార రంగంలో అగ్ర భాగాన నిలపడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేయబోతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.



## నిరుపేద ఆర్యవైశ్య దివ్యాంగు రాలికి బియ్యం, నిత్య సరుకుల పంపిణీ

ఎండపల్లి, ఫిబ్రవరి 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ఉమ్మడి వెల్గటూర్ మండలం లోనె కాకుండా జిల్లా స్థాయి లో ఆర్య వైశ్య పేద కుటుంబాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సేవలు కొన్ని సంవత్సరాలుగా ఎంతో మంది అభాగ్యులకు అండగా నిలిచిన సముద్రాల రమేష్ గుప్త మాట్లా డుతూ ఇంటర్నేషనల్ ఆర్య వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పుల శ్రీనివాస్ గుప్త శ్రీమతి స్వప్న పుణ్య దంపతుల పెళ్లిరోజు పురస్కరించు కొని జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్ రావు పేట గ్రామానికి చెందిన రాయల్చు సత్తయ్య హనుమమ్మ కూతురు ధనలక్ష్మి పుట్టుకతోనే దివ్యాంగు రాలు ఈమెకు పెన్షన్ రావడం లేదు గత సంవత్సరం నుండి దాతల సహకారంతో ఆర్థిక సహా యం అందించడం జరుగుతుంది ఈ కుటుంబానికి ఆర్యవైశ్య సోదర సోదరీమణులు దాతలు ఎవరైనా ఉంటే సహకరించగలరని సము ద్రాల రమేష్ గుప్త విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో శివ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## స్వర్ణ్ శక్తి- రాజ్య భాష అవార్డును గెలుచుకున్న ఎన్టీపీసి సంస్థ

గోదావరిఖని, ఫిబ్రవరి 13: (ప్రజా కలం ప్రతినిధి) హిందీని ప్రచారం చేయడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను స్వర్ణ్ శక్తి-2023-24 రాజ్య భాష అవార్డురామగుండం ఎన్టీపీసీ సంస్థ దక్కించుకున్నది . ఈ ఘనత సి.కె. సమంత, ప్రాజెక్ట్ హెడ్. ఈ అవార్డును బి వో డి లతో పాటు ఏ న్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ కు అందించారు. ఐ పి ఎస్ సమ్మిట్ -2025 సందర్భంగా రాయ్‌పూర్‌లో సీకే సమంత, ఎచ్ ఓ పి (అర్ అండ్ టీ ) అందుకున్నారు. ఈ సందర్భంగా టీమ్‌ను అభినందిస్తూ, సమంత మొత్తం రామగుండం తెలంగాణ (అర్ అండ్ టీ ) కుటుంబ సభ్యుల కృషిని ప్రశంసించారు.ఈ కార్యక్రమం లో బాబర్ సలీం పాషా, సెంట్రల్ ఎన్‌బిసి సభ్యుడు కూడా తన అభినందనలు తెలియజేశారు, ముఖ్యంగా బి.కె. సిక్దర్, హెచ్‌ఆర్ హెడ్, ఆదేశ్ కుమార్ పాండే లు మాట్లాడుతూ రామగుండం హిందీ మాట్లాడని ప్రాంతం అయినప్పటికీ, అధికారిక పనిలో హిందీని అమలు చేయడంలో బృందం అద్భుతంగా పని చేసిందని, ఈ అవార్డును గెలుచుకోవడం ఒక గొప్ప విజయంఅని అన్నారు.



## పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు:

నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం)
నిజామాబాద్ జిల్లాలో త్వరలో నిర్వహించే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అధికారులు ప్రకటించిన పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని 33 మండలాల్లో 1564 పోలింగ్ కేంద్రాలు, 8,51,770 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు ఓటర్లు 3,97,140 ఉండగా మహిళా ఓటర్లు 4,54,613 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు.

## తొమ్మిదిన్నర తులాల బంగారం చోరీ



నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం)
నిజామాబాద్ లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సౌత్ CI సురేశ్ తెలిపారు. అర్సపల్లిలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా షేక్ ఆఫ్తాబ్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. ఆటోనగర్లో తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసి నగలను అమ్మేందుకు వెళ్తుండగా పట్టుకున్నట్లు CI తెలిపారు. నిందితుడు నుంచి తొమ్మిదిన్నర తులాల బంగారం, రూ.15 వేల నగదు, 2 చేతి గడియారాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

## మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలి: ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం) బీసీ బిల్లుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదన్నారు. ఒక బిల్లు కాదు.. మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని, విద్యలో 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు పెట్టాలన్నారు. ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు మరొక బిల్లు పెట్టాలని, బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరొక బిల్లును పెట్టాలన్నారు.

## ప్రయోగ పరీక్ష కేంద్రాలు తనిఖీ :



నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13 (ప్రజా కలం)
పరీక్ష కేంద్రాలలో కెమెరాలు ఆగిపోకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా కళాశాలల ప్రిన్సిపల్లను %ణ×జుా% రవికుమార్ ఆదేశించారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మూడో దశ ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కాగా పలు ప్రయోగ పరీక్షా కేంద్రాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

## బ్యాలెట్ పేపర్ ముద్రణకు ఫిబ్రవరి 17 లోపు సీల్డ్ కొటేషన్లు సమర్పించాలి

### - కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఫిబ్రవరి 13(ప్రజా కలం న్యూస్)
ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల నిమిత్తం బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఆసక్తి గల ప్రింటింగ్ ప్రెస్ వారు ఫిబ్రవరి 17 లోపు సీల్డ్ కొటేషన్లు సమర్పించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు -2025 నిమిత్తం బ్యాలెట్ పేపర్ ముద్రణ చేయుటకు ఆసక్తి కలిగిన ప్రింటింగ్ ప్రెస్ షాప్ వివరాలు, రోజు వారి ముద్రణ సామర్థ్య వివరాలతో ఫిబ్రవరి 17 మధ్యాహ్నం 2.00 గంటల లోపు ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా ప్రజాపరిషత్, ఖమ్మం నందు సీల్డ్ కొటేషన్ లు సమర్పించి, ఫిబ్రవరి 19న సాయంత్రం 4.00 గంటలకు జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా ముద్రణ ధరలు ఫైనల్ చేసే సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## దశ దిన కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్.

పాలేరు ఫిబ్రవరి 13(ప్రజా కలం న్యూస్)
పాలేరు గురువారం, ఎదులాపురం మున్సిపాలిటీ,జలగం నగర్ కి చెందిన ఘంటెల.ప్రేమ్ చంద్ ఇటీవల అనారోగ్యం తో మృతి చెందగా వారి దశ దిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించి వారి ఆత్మకి శాంతి కలగాలని దేవున్ని ప్రార్థించారు.వారితో పాటు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ నాగార్జునపు.ప్రద్యుమ్న చారి,మున్సిపల్ నాయకులు సంగయ్య,ఖాజామియా,కళ్లెం.శేష్ రెడ్డి,శ్రవణ్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.



## గురువు కుటుంబానికి పూర్వపు విద్యార్థుల చేయూత



పెద్దపల్లి,ఫిబ్రవరి13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) గురువు కుటుంబానికి పూర్వపు విద్యార్థుల ఆర్థిక చేయూత నందించారు.పెద్దపల్లి జిల్లా మంథని మండలం కూచిరాజు పల్లిలో ఇటీవల మరణించిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయులు ధనుంజయ్ కు వందన స్కూల్ 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వారి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్నారు.ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్నఅని భావిస్తూ పిల్లలకు ఎంతో చక్కగా విద్యను బోధించి వారికి జీవన దారిని చూపిన గురువు అంబటి ధనుంజయ్ అకాల మరణానికి చింతిస్తూ గురువు దశదినకర్మ రోజున కూచిరాజ్ పల్లి లోని వారి స్వగృహంలో కుటుంబానికి జరిగిన కష్టానికి చెలించి వారికి సహాయం చేయాలనే సంకల్పంతో వందన ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు చేయి చేయి కలిపి వారు పోగేసిన దాదాపు 20వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేసి ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని కల్గించారు. స్ఫూర్తివంతమగు మానవత్వంతో కూడిన ఆర్థి చేయూత నిచ్చిన విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు.పూర్వ విద్యార్థులందరినీ ఒక తాటి పైకి తీసుకువచ్చి గురువు కుటుంబానికి ఆర్థిక సాయం చేయడానికి సహా సహకారాలు అందించిన మూడు లక్ష్మణ్ కు పూర్వపు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముడుసు లక్ష్మణ్,వందన స్కూల్ కరస్పాండెంట్ శంకర్, రాజేశం,రాజేందర్, రాజశేఖర్, విద్యార్థులు ముప్పిడి రాజు,ఏలువాక కుమార్,ముడుసు లక్ష్మణ్,పొట్ల కుమార్,గొర్రె ప్రకాష్,గుర్రం మధుకర్,ముడుసు రమేష్,సిరి శెట్టి అశోక్ గౌడ్,గొర్రె నాగరాజు,చిలక రమేష్, చిప్పరాజు,గాజు ఆనంద్,వడ్ల కొండ శ్రీనివాస్, ముప్పిడి సురేష్,లీలరాణి, వేముల స్వరూప,ఇతర విద్యార్థిని, విద్యార్థులు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు

### మధిర మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు- ఎంపీడీవో వెంకటేశ్వర్లు

మధిర జనవరి 13( ప్రజా కలం ప్రతినిధి)
రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందుతాయని మధిర ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. మధిర ఎంపీడీవో గా వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా వివిధ అంశాలపై గురువారం మాట్లాడారు.
మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ఏం చర్యలు తీసుకున్నారు.?
ఎంపీడీవో రైల్వే మూడో లైన్ పనులు కారణంగా మండలంలో దాదాపు 14 గ్రామాల్లో పది రోజులుగా మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందు రాకుండా స్థానికంగా చర్యలు తీసుకున్నాం. గ్రామాల్లో ఉన్న చేతి పంపులకు మరమ్మత్తులు చేశాం. పైప్ లైన్ లీకేజీ కాకుండా చర్యలు తీసుకున్నాం.
:గ్రామాల్లో పారిశుధ్యం ఎలా ఉంది. ఎంపీడీవో గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపడుతున్నాం. గ్రామ కార్యదర్శులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నాం.
సంక్షేమ పథకాలు అమలు ఎలా ఉంది.
ఎంపీడీవో: మండలంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాల కోసం గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసాం. ఇప్పటికే రైతుల ఖాతాలో రైతు భరోసా నగదు జమవుతున్నాయి. అదేవిధంగా మండలంలోని ఎంపిక చేసిన



చిలుకూరు గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు కూడా జమ చేశాం.
ఉపాధి పనులు ఎలా కొనసాగుతున్నాయి.
ఎంపీడీవో మండలంలో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఉపాధి హామీ కూలీలకు పని కల్పించి, చేసిన పనికి సకాలంలో డబ్బులు చెల్లిస్తున్నాం.
మండల ప్రజలకు మీరు ఇచ్చే సూచనలు ఏంటి?
ఎంపీడీవో మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలకు ఎటువంటి పనులు ఉన్నా నేరుగా తనను కలవచ్చు. కార్యాలయ పని వల్ల తాను అందుబాటులో ఉంటా. ప్రజలకు మెరుగైన సేవలందించే విషయంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సహకారం మరువలేనిదని ఆయన తెలిపారు.

## ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారా..అయితే తస్మాత్ జాగ్రత్త



మధిర ఫిబ్రవరి 13( ప్రజా కలం ప్రతినిధి)
వైరా లో సర్వే పేరుతో ఇంటి తలుపు కొట్టారు. ఆపై వివరాలు అడుగుతూ. ఒక్కసారిగా. మీరు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారా.అయితే అప్రమత్తంగా ఉండాల్సిందే. అపరిచిత వ్యక్తులు తలుపుకొడితే అస్సలు తీయకండి. సర్వే అంటూ ఇంటికొచ్చినా. లేదా మరో పేరు చెప్పినా అస్సలు డోర్లు ఓపెన్ చేయకండి. ఎందుకంటే వారు దొంగలు కావొచ్చు. మీ ఇల్లు కొల్లగొట్టొచ్చు. తాజాగా ఖమ్మం జిల్లా పరిధిలో అలాంటి ఘటనే వెలుగుచూసింది. సర్వే పేరుతో, ఇంకా ఏ ఇతర అవసరాల కోసమే తలుపు కొడితే ఒక్క క్షణం ఆలోచించండి. తలుపు తీశారో.మీ ఇల్లు గుల్లవుతుంది. ప్రతిఘటిస్తే.మీ ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. తాజాగా అలాంటి ఘటనే ఖమ్మం జిల్లాలో వెలుగుచూసింది. వైరా మున్సిపాలిటీ సుందరయ్య నగర్లో శీలం యుగంధర్ రెడ్డి ఇంటి వద్దకు పట్టపగలే కారులో నలుగురు దుండగులు వచ్చారు.సర్వేకి వచ్చామంటూ తలుపు కొట్టారు. ఆపై నలుగురు దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు.ఇంట్లోకి వచ్చారు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలు వెంకట రావమ్మ 65ను సర్వే పేరుతో వివరాలు అడుగసాగారు. బయట ఎవరూ లేరని నిర్ధారించుకున ఒక్కసారిగా దాడి చేసి కాళ్లు, చేతులు కట్టేసి.నోటికి ప్లాస్టర్ వేశారు. అనంతరం చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన 15 లక్షల రూపాయల విలువైన 18 తులాల బంగారు నగలు చోరీ చేసి కారులో పరారయ్యారని బాధితురాలు తెలిపింది. కుమారుడు శీలం యుగంధర్ రెడ్డి ఉద్యోగరీత్యా కొత్తగూడెం వెళ్లాడు. కోడలు ప్రైవేట్ స్కూల్లో టీచర్గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలని టార్గెట్ చేసిన దొంగలు సర్వే పేరుతో ఇంట్లోకి వచ్చి చోరీకి తెగబడ్డారు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చిన కోడలకు చోరీ సంఘటన తెలుసుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఏసిపి రహమాన్ సిఐ సాగర్ ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించిన దుండగులు. దొంగల కోసం గాలింపు చేపట్టారు.

## భద్రాది కొత్తగూడెం జిల్లాలో జనజీవన స్రవంతిలో కలిసిన 19 మంది మావోయిస్టులు

ప్రజాకలం భద్రాది జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13
మవోయిస్టులకు మరో భారీ దెబ్బ పడింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో పోలీసుల ఆపరేషన్ సక్సెస్ అయింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఎదుట 19 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా కమాండర్ గా వ్యవహరి స్తున్న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ మొదటి బెటాలియన్ కు చెందిన ముగ్గురు సభ్యులున్నారు. పోరాడలేక అలసిపోయా మని, సాధారణ జీవితం గడిపేందుకే లొంగిపోయి నట్లు మావోయిస్టులు చెబుతున్నారు. ఈ మేరకు జనజీవన స్రవంతిలో కలిసే మావోలకు ఆపరేషన్ చేయూత పేరిట ప్రత్యేక సరెండర్ పాలసీని కేంద్ర ప్రభుత్వం అమలుచే స్తోంది. ఇందులో భాగంగానే ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు కొంతమంది తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. వారిలో సౌత్ బస్తర్ డీవీసీఎం నరోటి మనీష్ అలియాస్ ఆకాష్ ఉండగా అతనిపై రూ. 8లక్షల రివార్డు ప్రకటించింది ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం. లొంగిపో యిన వారిలో పీఎల్జీఏ మొదటి బెటాలియన్ కు



చెందిన మడివి నంద, మడివి హండా , మడివి హడమ సహా పలువురు సెంట్రల్ కమిటీ మెంబర్లకు గార్డుగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. నందా, హండాపై 4లక్షల రివార్డు ప్రకటించింది ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం. ఇక పలు విధ్వంసకర ఘటనల్లో కీలకపాత్ర పోషించిన 19 మంది మావోయిస్టులు ఆ పార్టీ సభ్యుల సరెండర్ లో కీలకపాత్ర పోషిస్తున్నట్లు భద్రాద్రికొత్తగూడెం పోలీస్ యూనిట్ తెలిపింది. గత ఏడాది నుంచి ఇప్పటివరకు 78 మంది మావోయిస్టుల ను సరెండర్ చేసి 64 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమంలో ఓఎస్డి పరితోష్ పంకాజ్, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 14 వాలెంటెన్స్ డే కాదు... బ్లాక్ డే....

### - పుల్వామాలో మరణించిన భారతదేశ వీర జవానుల అమానుష మరణానికి నిదర్శనంగా బ్లాక్ డే....

### - వీర జవానుల దివస్ జరుపుకోవాలి

(నందిగామ ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి)
నందిగామ కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ వార్డ్ మెంబర్ చింతెట్టి



శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ పుల్వమలో జరిగిన దాడిలో దాదాపు 40 మంది మరణించిన మన దేశ వీర జవానుల కోసం ఫిబ్రవరి 14 న బ్లాక్ డేగా జరుపుకోవాలని ఆంగ్లేయులు పెట్టిన వాలెంటైన్స్ టైం డే భారతదేశ సంస్కృతికి విభిన్నమని నిజమైన ప్రేమని మన దేశ సైనికుల మీద చూపించాలని అన్నారు. నకిలీ ప్రేమను ప్రోత్సహించే ఫిబ్రవరి 14 ను వాలెంటెన్స్ డే గా రద్దు చేయాలని శివకుమార్ గౌడ్ పేర్కొన్నారు.విదేశీ సంస్కృతిని వీడనాడి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను అలవరచుకోవాలని ప్రేమ పేరుతో అశ్లీలతను పెంపొందించె విదేశీ సంస్కృతిని రుద్దుతున్న కార్పోరేట్ శక్తుల కుట్రలకు బలి కావద్దని యువతకు సూచించారు. పుల్వామ దాడిలో దాదాపు 40 మంది మన ఆర్మీ సోదరులు మరణించడం జరిగింది.వారిని స్మరించుకుంటూ వీర జవాన్ దివస్ జరుపుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## బెజవాడ రవిబాబు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మధిర జనవరి 13( ప్రజా కలం ప్రతినిధి ) మధిర మున్సిపాలిటీ పరిధిలోని సాయి నగర్ లో సిపిఐ నాయకులు లిబెజవాడ రవిబాబు నూతనంగా నిర్మించిన ఇంటిని గురువారం గృహప్రవేశ వేడుక జరిగింది. ఈ వేడుకకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దార బాలరాజు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఆదిమూలం శ్రీనివాసరావు లిరామారావు, ఓబుల లక్ష్మారెడ్డి, దూదేకుల జానీ మొదలవారు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు

## కిష్టంపేట పాఠశాలకు బీరువా, కుర్చీలు వితరణ



కాల్వ శ్రీరాంపూర్,ఫిబ్రవరి13:(ప్రజాకలం ప్రతినిధి)కిష్టంపేట ప్రాథమికోన్నత పాఠశాలకు కీర్తిశేషులు వేగోలపు కనకయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గురువారం ఒక బీరువా,8 ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు.పాఠశాల పిల్లల అవసరాల నిమిత్తం పాఠశాలకు బీరువా,కుర్చీలు అందజేసిన వేగోళపు కనకయ్య కుటుంబ సభ్యులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శైలజ,ఉపాధ్యాయులు పోగు శ్రీనివాన్, ఎం.సంపత్,షబానా,ఎ.నరేందర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమానికి హాజరైన పిల్లల తల్లిదండ్రులు,గ్రామస్తులు వారిని అభినందించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శైలజ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలే పల్లె ప్రగతికి పట్టుగొమ్మలని,ప్రభుత్వ పాఠశాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఆమె కోరారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ,ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు,కీర్తిశేషులు వేగోళపు కనకయ్య కుటుంబ సభ్యులు,వారి బంధువులు పిల్లల తల్లిదండ్రులు,విద్యార్థిని,విద్యార్థులు,గ్రామస్తులు, పలువురు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ప్రజాకలం ప్రతినిధి బూర్గంపహాడ్ ఫిబ్రవరి 13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం, సారపాక తాళ్లగుమ్మూరు లో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత సత్యనారాయణ స్వామి 29వ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో గురువారం ఉదయం 9 గంటలకు అంగరంగ వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను వేద పండితులిచే ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మొదటగా గణపతి పూజ ,నవగ్రహ పూజ నిర్వహించిన అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతమును దంపతులచే వేద పండితులు నిర్వహించారు, సత్యనారాయణ స్వామి వ్రతం యొక్క విశిష్టతను, సత్యనారాయణ స్వామి వ్రత కథలను భక్తులకు వేద పండితులు తెలియజేశారు అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులు అందజేశారు.బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంను ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు.సాయంత్రం నాలుగు గంటల నుంచి సత్యనారాయణ స్వామి వారు సతీ సమేతంగా ఊరేగింపు కార్యక్రమం భక్తుల కోలాహలంల మధ్య కన్నుల పండుగ జరుగుతుంది. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ఇలాంటి దైవ కార్యములలో పాల్గొనడం మా అదృష్టం పూర్వజన్మ సుప్రభాతంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు ,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వాట్సాప్‌తో ఇంద్రకీలాద్రి సేవలు

విజయవాడ : వాట్సాప్ ద్వారా ఇంద్రకీలాద్రి సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం పౌర సేవలు సులభముగా పొందడానికి '95523 00009 అనే వాట్సాప్ నెంబర్ ను ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా దేవాదాయ శాఖ ఏపీలో రెండో ప్రధాన దేవాలయంఅయిన విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దర్శనాలు, సేవలు బుక్ చేసుకోడానికి, విరాళము అందించడాన్ని సులభతరం చేసింది. ప్రతి ఒక్కరూ సులభంగా అర్థం చేసుకునేలా 9552300009 వాట్సాప్ నెంబర్ కు 'హై' అని వాట్సప్ లో మెసేజి చేయడం ద్వారా సేవలు అందుకోవచ్చునని ఆలయ ఈవో కె.రామచంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

**అందుబాటులోకి 150 సేవలు**

మన మిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభించింది. 150కిపైగా సేవలు ఇక్కడ నుంచి ప్రజలు పొందవచ్చని పేర్కొంది. బస్ టికెట్లు మొదలు కొని క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికేట్, దేవాలయాల దర్శనాలు ఇలా 161 సేవలు లభిస్తాయి. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్ద నుంచి ఒక్క క్లిక్‌తో చాలా సేవలు లభించనున్నాయి. .ఇక్కడ క్యాస్ట్ సర్టిఫికెట్ పొందాలనుకునే వాళ్లు రెండు విషయాలు తెలుసుకోవాలి. ఓ ఏడాదిలో ఒకసారైనా ఈ క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకున్న వాళ్లు మాత్రమే ఈ వాట్సాప్‌లో క్యాస్ట్ సర్టిఫికేట్ తీసుకోగలరు. అలా తీసుకోని వాళు మాత్రం ఒకసారి నేరుగా వెళ్లి క్యాస్ట్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాత మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు క్యాస్ట్ సర్టిఫికేట్ పొందగలుగుతారు. మీరు 9552300009 నెంబర్‌ను సేవ్ చేసి పెట్టుకోండి. ఆ తర్వాత వాట్సాప్‌లోకి వెళ్లి ఆ నెంబర్‌కు మెసేజ్ పంపించాల్సి ఉంటుంది. హాయ్ అని పంపించాలి. సర్వర్ బిజీని బట్టి మీకు రిప్లై వస్తుంది. సర్వర్ బిజీగా ఉంటే లేట్‌గా రిప్లై వస్తుంది. లేకుంటే త్వరగా రిప్లై వస్తుంది. రిప్లై వచ్చిన తర్వాత సేవలను అన్వేషించండి అని వస్తుంది. ఆ సేవలను అన్వేషించండి బటన్‌పై క్లిక్ చేస్తే మెయిన్ మెనూలోకి వెళ్తారు. అక్కడ మీరు ఏ కేటగిరిలో సేవలు కావాలనుకుంటున్నారో ఆ విభాగం పై క్లిక్ చేయాలి. మీకు కావాల్సింది క్యాస్ట్ సర్టిఫికేట్ కాబట్టి రెవెన్యూ విభాగంపై క్లిక్ చేయాలి. రెవెన్యూ విభాగంపై క్లిక్ చేస్తే అందులో లభించే సేవల జాబితా మీకు కనిపిస్తుంది. అందులో 13 రకాల సేవలు ఉంటాయి. ఆ సేవల విభాగంలో మీకు క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం ప్రత్యేకంగా ఏం కాలమ్ కనిపించదు. కానీ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ జారీ అనే విభాగం ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ జారీ విభాగంపై క్లిక్ చేస్తే ఆధార్ కార్డు ఎంట్రీ చేసేందుకు కాలమ్ కనిపిస్తుంది. మీ ఆధార్ కార్డు ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. మీరు ఎంట్రీ చేసిన ఆధార్ కార్డు మీదా కాదా అని చెక్ చేసేందుకు ఓటీపీ కూడా వస్తుంది. అలా వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై క్లిక్ చేయాలి. ఒకసారి ఆధార్ వెరిఫికేషన్ పూర్తి అయిన తర్వాత మీ తండ్రి, భర్త పేరు, మతం, విద్యార్హతలు, వైవాహిక స్థితి, మెయిల్ ఐడి అడుగుతుంది. ఇక్కడ మెయిల్ ఐడీ అనేది ఆప్షనల్. ఉంటే ఇవ్వొచ్చు లేకుంటే లేదు. ఈ వివరాలు నిర్ధారించుకోమని అడుగుతుంది. ప్రభుత్వం వద్ద ఉన్న వివరాలతో మ్యాచ్ అయితే మీరు తర్వాత దశకు తీసుకెళ్తుంది. ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులతో మీ వివరాలు మ్యాచ్ కాకుంటే మాత్రం అక్కడితో సేవలు ముగిసిపోతాయి. అంటే మీరు నేరుగా వెళ్లి సర్టిఫికెట్ తీసుకోవాలని సూచిస్తుంది. ఒకసారి వివరాలు పూర్తిగా ఇచ్చిన తర్వాత సమర్పించండి అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అలా క్లిక్ చేసిన తర్వాత వాట్సాప్ ద్వారా వాళ్లకు మెసేజ్ వెళ్తుంది. కాసేపు ఆగిన తర్వాత అక్కడి నుంచి రిప్లై వస్తుంది. అందులో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేస్తే మీ వివరాలతో ఓ పేజీ వస్తుంది. అందులో ప్రస్తుతం మీరు ఉన్న అడ్రెస్, పర్మినెంట్ అడ్రెస్ ఒకటై ఉంటే అక్కడ ఉండే ఓ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. లేదంటే ప్రజెంట్ అడ్రెస్ కింద క్లిక్ చేసి అడ్రెస్ రాయాల్సి ఉంటుంది. ఇన్ని వివరాలు ఇచ్చిన తర్వాత కొనసాగించండి అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే మీకు ఓ నెంబర్ కేటాయిస్తున్నట్లు వస్తుంది. గతంలో మీకు సర్టిఫికెట్ వచ్చి ఉంటే దాన్ని మీరు ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అలా ఎంటర్ చేసిన తర్వాత శాశ్వత చిరునామా లేకుంటే తాత్కాలిక చిరునామా అని అడుగుతుంది. అందులో ఏది కావాలంటే దాన్ని మీరు క్లిక్ చేస్తే మీ ఊరి పేరు ఇతర వివరాలు కనిపిస్తాయి. అక్కడ ముందుగా మీరు ఊరి పేరు సెలెక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత మీరు రెండోసారి ఎందుకు అప్లై చేస్తున్నారో చెప్పాల్సి ఉంటుంది. దీనికి రిలేటెడ్‌గా నాలుగు ఆప్షన్స్ ఉంటాయి. స్కూల్, కాలేజీలో అడ్మిషన్ కోసమా లేదా. ఉపాధి కోసమా, ఏవైనా స్కీమ్స్ కోసమా, రుణాల కోసమా, లేదా పేరు దిద్దుబాటు కోసమా అని చెప్పాల్సి ఉంటుంది. అలా క్లిక్ చేసిన తర్వాత ముందుకెళ్లండి అనే ఆప్షన్‌పై నొక్కితే అప్లికెంట్ పూర్తి వివరాలు వస్తాయి. అప్లై చేసిన వ్యక్తి ఎవరు, వయసు, తండ్రి పేరు, ఊరు, ఎప్పుడు అప్లై చేశారు. ఎప్పుడు అప్రూవ్ అయింది. ఇలా అన్ని వివరాలు వస్తాయి. ఆ తర్వాత చివరిగా ఉన్న రెండు ఆప్షన్స్‌పై క్లిక్ చేసి సమర్పించండి అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేయాలి. వెంటనే రెవెన్యూ అధికారులకు మీ రిక్వెస్ట్ వెళ్తుంది. ఇంతలో మీకు గతంలో ఇచ్చిన క్యాస్ట్ సర్టిఫికేట్, ఆధార్ కార్డును స్కాన్ చేసి పీడీఎఫ్ రెడీ చేసుకోవాలి. ఇది 1 ఎంబీ లోపు సైజు ఉండాలి. ఆ వివరాలు పంపాలని మెసేజ్ వచ్చిన వెంటనే ఈ రెండూ ఒకే ఫైల్‌లో వాట్సాప్ ద్వారానే పంపించాల్సి ఉంటుంది. ఆ వివరాలు కరెక్ట్ అయితే 40 రూపాయలు చెల్లించాలని చూపిస్తుంది. క్యాస్ట్ సర్టిఫికెట్ మరోసారి జారీ చేస్తున్నందుకు ఈ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ డబ్బులను కూడా అక్కడే చెల్లించవచ్చు. చెల్లించు అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి పేమెంట్ చేయాల్సి ఉంటుంది. పేమెంట్ విజయవంతమైనట్టు కూడా మెసేజ్ వస్తుంది. వచ్చిన వెంటనే సర్టిఫికెట్ వస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వాడుకోవచ్చు. అందులో ఉండే క్యూఆర్ కోడ్ ద్వారా కూడా మీరు వాడుకోవచ్చు. క్యాస్ట్ సర్టిఫికేట్‌తోపాటు రెసిడెన్స్, పుట్టిన తేదీ రిలేటెడ్ వివరాలు కూడా ఉంటాయి. అందుకే మూడు విషయాలు ఇంటిగ్రేట్ అయ్యి ఉంటాయి కాబట్టి దీన్ని ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ అంటారు. ఇదే క్యాస్ట్ సర్టిఫికేట్‌గా కూడా చెల్లుబాటు అవుతుంది.

# హైవోల్టేజ్‌కు ఏపీ పాలిటిక్స్

విజయవాడ : ఈ నెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ సెషన్ ప్రారంభం కానుంది. సభాసమరం స్టార్ట్ కాకముందే ఇంతలోపే ఏపీ పాలిటిక్స్ హైవోల్టేజ్‌కు చేరుకుంటున్నాయి. మాజీ సీఎం జగన్ చుట్టే వ్యవహారం తిరుగుతోంది. వైసీపీకి పదకొండు సీట్లే ఉన్నాయ్..ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని కూటమి సర్కార్ అంటోంది. తమకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తామని వైసీపీ డిమాండ్ చేస్తోంది.ఈ పరిస్థితుల్లో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మీడియా ముందుకు వచ్చి..పెద్ద బాంబే పేల్చారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని చెప్తూనే..సభకు రాకపోతే వేటేనని కరాఖండిగా చెప్పేశారు. 60 రోజులు సభకు రాకపోతే ఆటోమేటిక్‌గా సభ్యత్వం రద్దు అవుతుందని..అది రూల్స్ బుక్‌లోనే ఉందని గుర్తు చేస్తున్నారు. దీంతో మరోసారి హీటెక్కాయి ఏపీ పాలిటిక్స్.గత ఏడాది జూన్ తర్వాత జరిగిన ఏపీ అసెంబ్లీలో అధికార పక్షమే ఉంది. విపక్ష వైసీపీ అయితే సభకు వెళ్లడం లేదు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరుతోంది. కానీ అది అయ్యే పని కాదని రూల్స్‌ను ప్రస్తావిస్తోంది కూటమి ప్రభుత్వం. ఈ నేపథ్యంలో ఏకంగా 15రోజుల పాటు జరగబోతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ హాజరు అవుతుందా అన్నది ఆసక్తిని పెంచుతోంది.అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు అని ఒక పక్కన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. దాంతో వైసీపీ సభకు అటెండ్ కాక తప్పదా అన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీలో కూటమి పార్టీలకే 164 సీట్లు ఉన్నాయి. వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. దాంతో పాటు విపక్ష హోదా ఇవ్వరు కాబట్టి జగన్‌తో పాటు అంతా సాధారణ ఎమ్మెల్యేలుగానే ఉంటారు.సాధారణ ఎమ్మెల్యేగా ఉంటే తనకు ఇచ్చే సమయం కూడా తక్కువగా ఉంటుందని అంటున్నారు జగన్. విపక్ష నేతగా ఉంటే కచ్చితంగా మైక్ దక్కుతుందని భావిస్తున్నారు. అపోజిషన్ హోదా ఉంటే సీఎం కానీ మంత్రులు కానీ మాట్లాడిన తర్వాత కౌంటర్ చేయడానికి వీలు ఉంటుంది. కానీ ఈసారి జగన్ సభకు వస్తే ఒక సాధారణ సభ్యుడికి ఇచ్చినట్లే అతి తక్కువ సమయం దక్కనుంది.ప్రతిపక్ష హోదా లేకపోతే మాట్లాడేందుకు ఎక్కువ టైమ్ ఇవ్వరని..సభకు రాకుండా ఉంటే అనర్హత వేటు వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం పెద్ద వ్యూహంతోనే ఈ బడ్జెట్ సమావేశాలకు వెళ్తుందనే ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్న సాకు చూపి వైసీపీ సభకు అటెండ్ కాకపోతే..11 మంది ఎమ్మెల్యేల మీద వేటు వేసే అంశాన్ని పరిశీలిస్తుందట. అందులో భాగంగానే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మీడియా ముందుకు వచ్చి మరీ చెప్పేశారని అంటున్నారు. ఒకవేళ చర్యలు తీసుకుంటే కూడా స్పీకర్ నిర్ణయాన్ని కోర్టులు కూడా తప్పు పట్టే అవకాశాలు ఉండవని లెక్కలు వేసుకుంటున్నారట.సిచ్యువేషన్ చూస్తుంటే బాల్ ఇప్పుడు వైసీపీ కోర్టులోనే ఉన్నట్లు కనిపిస్తోంది. వైసీపీ సభ్యులు సభకు అటెండ్ కాకపోతే ఏదో ఒక డెసిషన్ తీసుకోవాలని కూటమి సర్కార్ భావిస్తోందట. ఆ విషయం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మాటల్లో స్పష్టంగా అర్థమవుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్లబోనని ఇప్పటికే చెప్పేశారు వైసీపీ అధినేత జగన్. ఈ నెల 12న పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అవుతారని..ఆ మీటింగ్‌లో అసెంబ్లీకి హాజరు కావాలా వద్ద అన్న దానిపై ఫైనల్ డెసిషన్ తీసుకుంటారని అంటున్నారు.అయితే చాలామంది వైసీపీ నేతలు మాత్రం శాసనసభా సమావేశాలకు వెళ్లడమే బెటరనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారట. ఇచ్చిన టైమ్‌లోనే అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టేలా సబ్జెక్ట్ ప్రిపేర్ చేసుకుని వెళ్లాలని సూచిస్తున్నారట. ఒకవేళ సభలో మాట్లాడే టైమ్ ఇవ్వకపోతే వాకౌట్ చేసి ప్రెస్‌మీట్ పెట్టే అవకాశం ఉండనే ఉందని గుర్తు చేస్తున్నారట. జగన్ అసెంబ్లీకి హాజరవుతారా లేదా అనే ఉత్కంఠ కంటిన్యూ అవుతోంది. అయితే 11మందిలో ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేలు అయిన కొందరు వైసీపీ సభ్యులు..తమ నియోజకవర్గ సమస్యలను చెప్పుకోవాలని ఆశ పడుతున్నారు. అధ్యక్షా అని సభలో తన గళం వినిపించాలని అనుకుంటున్నారట. దాంతో జగన్ మనసు మార్చుకుని అసెంబ్లీ హాజరవుతారా.? లేక ఏమైనా చేసుకోనీ అని ప్రతిపక్ష హోదా డిమాండ్‌కే కట్టుబడి ఉంటారా అన్నదే చర్చగా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# వంశీ గాయబ్

విజయవాడ : కృష్ణ జిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ.. నోటి దూకుడుతో అత్యంత వివాదాస్పదమైన నేతగా పాపులార్టీ సొంతం చేసుకున్న మాజీ ఎమ్మెల్యే. టీడీపీ నుంచి పొలిటికల్ ఎంట్రి ఇచ్చి విజయవాడ ఎంపీగా పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. తర్వాత గన్నవరం టీడీపీ ఎమ్మెల్యేగా వరుసగా రెండు సార్లు విజయం సాధించారు. 2019లో రెండో సారి గెలిచాక టీడీపీ అధికారంలోకి రాకపోవడంతో? తన దారి తాను చూసుకుని వైసీపీ పంచకు చేరారు. మళ్లీ వైసీపీనే అధికారంలోకి వస్తుందన్న ధీమాతో టీడీపీ ముఖ్య నేతలపై ఇష్టానుసారం నోరు పారేసుకుంటూ చెలరేగిపోయారు.గత ఎన్నికల ఓట్ల కౌంటింగ్ రోజు పోలింగ్ సరళిని గమనించి కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే మాయమయ్యారు. అటు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ కూడా ఘోర పరాజయం పాలవ్వడంతో నియోజకవర్గానికి దూరంగా, కేడర్ కే అందుబాటులోకి లేకుండా పోయారు. ఎంతలా అంటే ఆయన ఎక్కడున్నారా? అని అధికార పార్టీ నేతలు ఆరా తీసినా కూడా ఆచూకీ దొరకలేదంట. మధ్యలో ఒకసారి తాడేపల్లిలో జిల్లా వైసీపీ సమీక్షా సమావేశానికి హాజరైన ఆ మాజీ ఎమ్మెల్యే.. మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నానిలతో కలిసి మీడియా ముందుకు వచ్చినప్పటికీ.. మాట్లాడకుండానే గాయబ్ అయిపోయారు.వల్లభనేని వంశీ కోసం 7 నెలలుగా ఇటు సొంత పార్టీ నేతలు, అటు అధికార పార్టీ నేతలు ఎంత అచూకీ తీసినా ఎక్కడ ఉన్నారో కూడా కనిపెట్టలేకపోయారు. టీడీపీ ముఖ్య నేతలతో పాటు, చంద్రబాబు ఫ్యామిలీపై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకున్న వల్లభనేని వంశీపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే విజయవాడలోని ఆయన ఇంటిపై దాడికి కూడా ప్రయత్నించడంతో పోలీసులు ఎంటరై పరిస్థితి చక్కదిద్దాల్సి వచ్చింది. గన్నవరం టిడిపి కార్యాలయం పై దాడి కేసులో ఏ 71 గా వంశీని ఎలాగైనా అరెస్టు చేయాలని పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేసినా ఆయన దొరకలేదు. ఆ కేసులో వంశీ మినహా అందరిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అయితే వంశీ మాత్రం ఎక్కడ ఉన్నారో అటు పోలీసులకు ఇటు టీడీపీ నేతలకు అంతు చిక్కలేదు.ఆ క్రమంలో వంశీ రాష్ట్రాన్ని దాటి విదేశాలకు వెళ్లారని ప్రచారం జరిగితే మరి కొంత మంది మాత్రం పక్క రాష్ట్రాల్లో తలదాచుకున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.అటు చూస్తే 2019 ఎన్నికల్లో వంశీపై వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన యార్లగడ్డ వెంకట్రావు గత ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి ఘన విజయం సొంతం చేసుకున్నారు. ఇటు వంశీ కనిపించకుండా పోవడంతో గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ అనాధలా తయారైంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలు, దౌర్జన్యాలకు సంబంధించి వంశీ అనుచరులు అరెస్ట్ అవుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.ఆ ఎఫెక్ట్‌తో సొంత పార్టీ శ్రేణుల నుంచి వస్తున్న విమర్శలకు ఇప్పుడు తెర వెనక ఉండే సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తున్నారంట వంశీ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గన్నవరం నియోజకవర్గంలో పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. వరుస అరెస్టులతో వైసీపీ శ్రేణులు బెంబేలెత్తిపోతున్నాయి. వంశీ కూడా అరెస్ట్ భయంతోనే పలాయనం చిత్తగించారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పుడు ఆ ప్రచారానికి సైలెంట్ గా చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్న వంశీ.. గన్నవరం నియోజకవర్గం వైసీపీలో జరుగుతున్న, మారుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని ఆయన అనచరులు అంటున్నారు.ముఖ్యంగా గన్నవరం నియోజకవర్గంలో వైసిపి ముఖ్య నేతలే టార్గెట్‌గా గత 7 నెలల వ్యవధిలో నమోదైన కేసులు, అరెస్టులు, దాడులు లాంటి అంశాల విషయంలో వంశీ పార్టీ వారికి నేనున్నాను అనే భరోసాను ఇస్తున్నారట. గన్నవరం టీడీపీ కార్యాలయం పై దాడి కేసులో 89మంది నిందితులను చేర్చగా.. తాను కూడా ఒక నిందితుడైన వంశీ మిగిలిన వారికి ఏ రకమైన సహాయసహకారాలు అందించలేదని వైసీపీ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత కేసులు మొత్తం తిరగదోడుతుండటంతో గన్నవరం నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలు, నేతలపై నమోదైన కేసులను మాజీ ఎమ్మెల్యే సీరియస్‌గా తీసుకున్నారంట.అందులో భాగంగా కేసులకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారంట. జిల్లా స్థాయిలో స్పెషల్ కోర్టులో బెయిల్ వ్యవహారాలు చూడటానికి ఒక టీమ్‌ని.. అవసరమైతే సుప్రీంకోర్టు, హై కోర్టు మెట్లు ఎక్కడానికి ఒక టీమ్‌ని ప్రత్యేకంగా నియమించి కేసుల బాధ్యతను భుజానికెత్తుకున్నారంట. అనేక కేసుల్లో ఇటీవల వంశీ ప్రధాన అనుచరులతో పాటు కీలక నేతల అందరి పైన కేసు నమోదు అయ్యాయి. పలువుర్ని అరెస్టు చేశారు. దాంతో వారికి భరోసా కల్పించడానికి.. వారి కుటుంబాలకు ఆర్థికంగా సహాయం అందించడంతో పాటు.. న్యాయపరమైన వ్యవహారాలను తెర వెనుక ఉండి సూపర్‌వైజ్ చేస్తున్నారంటనోరు జారి వంశీ చేసిన విమర్శలు అప్పట్లో పెద్ద కలకలమే రేపాయి. వంశీ ప్రోద్భలంతో గన్నవరం నియోజకవర్గంలో జరిగిన దాడులకు ప్రస్తుతం వైసీపీ శ్రేణులు మూల్యం చెల్లించుకుంటున్నాయి. వంశీ సైతం కేసులు చట్రంలో ఇరుక్కున్నారు. దాంతో ఆయన నియోజక వర్గానికి ముఖం చాటేస్తున్నారు. అయితే దీర్ఘ కాలం కేడర్‌కు అందుబాటులో లేకుండా పోతే.. రాజకీయంగా అసలుకే ఎసరు వస్తుందనుకున్నారో ఏమో? వంశీ తిరిగి యాక్టివ్ అవ్వడానికి గ్రౌండ్ ప్రిపేర్చేసుకుంటున్నారంట. తనతో పాటు వైసీపీ వారిపై పెట్టిన కేసులకు సంబంధించి న్యాయ నిపుణులతో చర్చిస్తూ వాటి నుంచి బయట పడే పనిలో ఉన్నారంటున్నారు.వైసీపీ వారికి ఆర్థికంగా అండగా నిలబడుతూ.. కేసుల చిక్కులు తొలగిపోగానే నియోజకవర్గానికి వచ్చి అందర్నీ కలుస్తానని తన వారితో చెప్పిస్తున్నారంట. తాను ఎక్కడున్నాననేది ఇప్పుడు అప్రస్తుతమని, ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల నుంచి అందరూ బయట పడ్డాక పార్టీ యాక్టివిటీస్ మొదలుపెడతామని సూచిస్తున్నారంట.

# తిరుమలలో రెడీ అవుతున్న ఫైవ్ స్టార్ హోటల్

తిరుమల : ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో త్వరలోనే స్టార్ హోటల్ కొలువు దీరనుంది. తిరుపతిలోని ఎస్వీ జూ పార్క్ సమీపంలో ఒబెరాయ్ గ్రూప్ సెవెన్ స్టార్ లగ్జరీ రిసార్ట్ నిర్మించనుంది. తిరుపతిలో ఒబెరాయ్ గ్రూప్ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణానికి మూడేళ్ల క్రితం అడుగులు పడ్డాయి. అయితే వివిధ కారణాలతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. అయితే ఎట్టకేలకు మూడేళ్ల తర్వాత ఒబెరాయ్ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణానికి అడ్డంకులు తొలిగిపోయాయి. త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. తిరుపతిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటుగా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 2021లో అప్పటి వైసీపీ సర్కారు హయాంలో ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఆ నిర్ణయం ప్రకారం.. ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన మెస్సర్స్ ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్.. తిరుపతిలో లగ్జరీ రిసార్ట్ నిర్మించనుంది. ఇది పూర్తి అయితే రాయలసీమలోనే తొలి సెవెన్ స్టార్ హోటల్‌గా నిలవనుంది. మూడేళ్ల క్రితం ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటికీ అనేక కారణాలతో ఆగిపోయింది. అయితే ఏపీ ప్రభుత్వం చొరవతో తిరిగి పనులు మొదలయ్యాయి. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ అనుమతులు కూడా తాజాగా మంజూరయ్యాయి. ఏడాదిన్నర కాలంలో నిర్మాణాలు పూర్తిచేసేలా పనులు ప్రారంభించారు.ఒబెరాయ్ గ్రూప్ హోటల్ నిర్మాణానికి తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలో 20 ఎకరాలను వైసీపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలాన్ని 66 ఏళ్ల లీజుకు కేటాయిస్తూ 2022లో జీవో జారీ అయ్యింది. 2023 జులైలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. అయితే రిసార్ట్ నిర్మాణ పనులు మాత్రం మొదలెట్టలేదు.మరోవైపు తిరుమల కొండ కింద ఇలాంటి రిసార్ట్ వద్దంటూ హిందూ సంఘాలు ఆందోళనలు కూడా చేపట్టాయి. అలాగే పేరుపైనా అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ఒబెరాయ్ సంస్థ ముంతాజ్ పేరుతో ఉన్న బోర్డు తొలగించి ట్రైడెంట్ గ్రూప్ అనే బోర్డు పెట్టింది. తాజాగా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నుంచి అనుమతులు కూడా రావటంతో.. ఒబెరాయ్ గ్రూప్ రిసార్ట్ నిర్మాణ పనులు మొదలెట్టింది. ఏడాదిన్నర కాలంలో నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో పనులు జరుపుతున్నారు

# కోళ్ల మరణానికి బర్డ్ ఫ్లూయే కారణం

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ కోళ్ల ఆకస్మిక మరణాలకు కారణం తెలిసింది. గోదావరి జిల్లాల్లో గత కొద్ది వారాలుగా లక్షల సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో కలకలం రేగింది. ఏపీ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వైరస్ ప్రభావంతో భారీగా కోళ్లు చనిపోయాయి. ఖమ్మం, సత్తుపల్లితో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోయాయి.ఈ క్రమంలో చనిపోయిన కోళ్ల నమూనాలను పశు సంవర్ధక శాఖ అధికారులు వ్యాధి నిర్ధారణ కోసం భోపాల్‌కు పంపించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో కోళ్ల మరణాలకు ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (హెచ్‌ఎన్1 –బర్డ్ ఫ్లూ వైరస్‌ను గుర్తించారు. ఏపీలోని పలు ప్రాంతాల్లో చనిపోయిన కోళ్ల నుంచి తీసిన నమూనాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూ రిటీ యానిమల్ డిసీజెస్ పరీక్షలకు పంపారు.పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని కోళ్ల ఫారంల నుంచి పంపిన నమూనాలు పాజిటివ్ గుర్తించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు రెండు జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లో కోళ్లను పూడ్చి పెట్టారు.కోళ్ల ఫారంలకు కిలోమీటరు దూరం వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. పరిసర ప్రాంతా ల్లో వైరస్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రెడ్ జోన్‌లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేవారు. కోళ్ల ఫారాల్లో పనిచే స్తున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తున్నారు. కోళ్లకు సంక్రమిస్తున్న వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వ హిస్తున్నారు.ఏటా కొల్లేరు ప్రాంతానికి వివిధ దేశాల నుంచి వచ్చే వలస పక్షుల్లో ఉండే వైరస్ ద్వారా బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందినట్టు భావిస్తున్నారు. కొల్లేరుకు వచ్చిన పక్షులు నీటిలో రెట్టలు వేసే సమయంలో ఆ వైరస్ జలాశయాల్లోకి చేరు తోంది. నీటి ప్రవాహంతో కోళ్లకు సంక్రమిస్తున్నట్టు అంచనా వేశారు.నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో వైరస్ వేగంగా వ్యాప్తి చెందిందని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. మొదట్లో చనిపోయిన వాటిని పూడ్చి పెట్టకుండా బయట పడేయడంతో వైరస్ వ్యాప్తి చెందినట్టు గుర్తించారు. ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల మధ్య ఉంటే బర్డ్ ఫ్లూ వైరస్ జీవించలేదని ప్రస్తుతం రాష్ట్రంలోని అధిక శాతం ప్రాంతాల్లో 34 డిగ్రీల పైనే నమోదవుతున్నందున వైరస్ వ్యాప్తి చెందలేదని భావిస్తున్నారు.బర్డ్ ఫ్లూగా గుర్తించిన రెండు ఫారాల్లోని కోళ్లు, గుడ్లను పూడ్చి పెట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చినట్టు ఏపీ పశు సంవర్ధక శాఖ ప్రకటించింది. పూడ్చి పెట్టే ఒక్కో కోడికి రూ.90 చొప్పున పరిహారం అందిస్తామని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెండు కోళ్ల ఫారాల చుట్టూ కిలోమీటరు పరిధిలో రెడ్ అలర్ట్ ప్రక టించారని అక్కడ మాత్రమే చికెన్ దుకాణాలు మూసివేయాలని మిగిలిన చోట్ల ఆంక్షలు లేవని స్పష్టత ఇచ్చారు.వైరస్ వ్యాపించిన 10 కిలోమీటర్ల పరిధి లోనూ నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు తెలిపారు. . రాష్ట్రంలోని మిగి లిన ప్రాంతాల్లో కోళ్లకు ఇబ్బంది లేదన్నారు. కోడి మాంసాన్ని అధిక ఉష్ణోగ్రతల వద్ద ఉడికిస్తున్నందున ఎలాంటి భయం లేకుండా తినొచ్చని చెబుతున్నారు.

# వీఐపీ వాహనాల కోసం 10 కోట్లు..

విజయవాడ : ఏపీలో పర్యటించే విఐపిల కోసం ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పర్యాటక ప్రాంతాలు, తిరుమల వంటి పుణ్యక్షేత్రాల సందర్శనతో పాటుగా వ్యాపార, రాజకీయ కారణాలతో పలువురు వీఐపీలు రాష్ట్రానికి వస్తుంటారు.అసలే ఖాళీ ఖజానా అంటున్నారు చంద్రబాబు. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి అక్కడ డబ్బులు లేవని చెబుతున్నారు. కానీ ప్రముఖ భద్రత కోసం 10 బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకుగాను 10 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాల కొనుగోలు కోసం ఏపీ హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. పది టయోటా ఫార్చునర్ వాహనాలు కొనుగోలు చేసి.. వాటిని బుల్లెట్ ప్రూఫ్ వాహనాలుగా మార్చాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ వాహనాలు రాష్ట్రంలోని ముఖ్యులతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వీఐపీల కోసం ఉపయోగించనుంది. ఈ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలకు కొనుగోలు కోసం ఏపీ సర్కార్ రూ. 9.20 కోట్లు ఖర్చు చేయనుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత వాహనాలనే వినియోగిస్తూ వస్తోంది. ఇప్పుడు కొత్తగా వాహనాలను సమకూర్చుకోనుండడం విశేషం.ఏపీలో పర్యటించే విఐపిల కోసం ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పర్యాటక ప్రాంతాలు, తిరుమల వంటి పుణ్యక్షేత్రాల సందర్శనతో పాటుగా వ్యాపార, రాజకీయ కారణాలతో పలువురు వీఐపీలు రాష్ట్రానికి వస్తుంటారు. అలాగే ఏపీ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ మీద ఫోకస్ పెట్టిన తరుణంలో వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు తరచూ పర్యటిస్తుంటారు. అందుకే ఏపీలోని ప్రముఖులతో పాటు రాష్ట్రానికి వచ్చే ముఖ్యులకు రక్షణగా ఉంటాయనే ఉద్దేశంతో కొత్తగా బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను ఏపీ ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఇప్పటికే ఉన్న వాహనాలకు అదనంగా ఇవి అందుబాటులోకి రానున్నాయి. కొత్త వాహనాలు కాబట్టి.. సరికొత్త హంగులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టుగా తెలుస్తోంది.అయితే గతంలో వైసీపీ సర్కార్ వాహనాలను ఇదే మాదిరిగా కొనుగోలు చేసింది ఆ సమయంలో టిడిపి చేసిన విమర్శలు అన్ని ఇన్ని కావు. రాష్ట్రంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అప్పట్లో ఆరోపణలు చేసింది టిడిపి. అయితే ఇప్పుడు సెక్యూరిటీ వాహనాలు ఉన్నా.. అదనంగా కొనుగోలు చేస్తుండడం విశేషం. అయితే 8 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్భాటాలకు దూరంగా ఉండాలని భావించింది.

ఇదే నిర్ణయాన్ని కూటమి పార్టీల ప్రజాప్రతినిధులకు వర్తింపజేసింది. కానీ ఇప్పుడు ఏకంగా ప్రముఖుల పేరుతో దాదాపు పది కోట్ల రూపాయలు కేవలం వాహనాలకే ఖర్చు చేస్తుండడం విశేషం.చాలావరకు ఆర్భాటాలకు దూరంగా ఉన్నట్లు కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు వీరిద్దరికీ ప్రత్యేక ప్రోటోకాల్ ప్రకారం సెక్యూరిటీ కల్పిస్తున్నారు. మిగతా 23 మంది మంత్రులకు సైతం హై సెక్యూరిటీ ఉంది. అయితే ఇప్పుడు ప్రముఖుల పేరుతో ఈ కొత్తగా వాహనాలను సమకూర్చుకుంటున్నారు. అయితే ప్రభుత్వ అవసరాల కోసం అని చెబుతున్నారు. అయితే ఇవి రాష్ట్రానికి వచ్చే ప్రముఖుల కోసం అని చెప్పుకొస్తున్నారు. దీనిపై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. అప్పట్లో వైసీపీ సర్కార్ వాహనాలను కొనుగోలు చేస్తే సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థులు ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా అదే మాదిరిగా ప్రత్యర్థులు ప్రచార అస్త్రంగా మార్చుకునే అవకాశం కనిపిస్తోంది

# స్త్రీల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయురాలు సరోజిని నాయుడు

హైదరాబాద్ లోని బెంగాలీ బ్రాహ్మణ కుంటుంబంలో ఫిబ్రవరి 13, 1897న సరోజిని నాయుడు జన్మించారు. తల్లిదండ్రులు అఘోరనాథ చటోపాధ్యాయ, వరద సుందరీ దేవి. శాస్త్రవేత్త,తత్వవేత్త అయిన అఘోరనాథ చటోపాధ్యాయ హైదరాబాద్‌లో నిజాం కాలేజీ ని స్థాపించి, ప్రిన్స్‌పాల్‌గా చాలా కాలం పనిచేశారు. తల్లి వరద సుందరీ దేవి కవయిత్రి.స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహిళల కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేసిన వారిలో సరోజినీనాయుడు ప్రముఖు రాలు. కవిత్వంతో మాధుర్యాన్ని కురిపించి నైటింగేల్ ఆఫ్ ఇండియా (భారత కోకిల) గా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచారు. ఆమె భారత జాతీయవాద ఉద్యమంలో భాగమైంది. మహాత్మా గాంధీ ఆయన స్వరాజ్య భావనకు అనుచరురాలిగా మారింది. 1930 ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మరియు మదన్ మోహన్ మాలవ్య వంటి ఇతర కాంగ్రెస్ నాయకులతో పాటు ఆమెను అరెస్టు చేశారు. శాసనోల్లంఘన ఉద్యమం మరియు క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రధాన వ్యక్తులలో సరోజిని ఒకరు. ఆ సమయంలో బ్రిటిష్ అధికారులచే ఆమె పదే పదే అరెస్టులను ఎదుర్కొంది మరియు 21 నెలలకు పైగా (1 సంవత్సరం 9 నెలలు) జైలులో గడిపింది. ఆమె 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు మరియు తరువాత 1947లో యునైటెడ్ ప్రావిన్సెస్ గవర్నర్ అయ్యారు, భారతదేశంలో గవర్నర్ పదవిని నిర్వహించిన మొదటి మహిళగా నిలిచారు.

ఆమె అనిబెసెంట్ తర్వాత జాతీయ కాంగ్రెస్ పార్టీకి రెండవ మహిళా అధ్యక్షురాలిగా 1925లో ఎన్నికయ్యారు. ఆమె 1928లో దేశంలో ప్లేగ్ వ్యాధి ప్రబలిన కాలంలో చేసిన పనులకు గుర్తింపుగా బ్రిటిష్ ప్రభుత్వం ఖైసర్ ఏ హింద్ బిరుదును అందించింది. ఆమె 1947 నుండి 1949 వరకు ఆగ్రా మరియు ఔద్ సమైక్య ప్రావిన్సుకు తొలి గవర్నరుగా నియమించబడి, దేశంలో తొలి మహిళాగవర్నర్ గా చరిత్రకెక్కారు.తనే దేశం, దేశమే తనుగా భావించి దేశ సేవ చేసిన అభేద భావాల మూర్తి రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో రకరకాలుగా సేవలు చేసి మానవ సేవ చేయదలుచుకున్న వారికి మార్గాలనేకం అని నిరూపించిన మహితాన్వితురాలు. జీవితమంతా మానవ సేవకు, దేశసేవకూ అంకితము చేసి తన డబ్బై వ యేట 1949 మార్చి 2 వ తేదీన లక్నోలో ప్రశాంతంగా కన్ను మూసింది.సరోజిని నాయుడు కొన్నిరచనలు:

?గోల్డెన్ త్రెషోల్డ్ అనే మొదటి కావ్య సంకలనాన్ని ఆమె 1905లో ప్రచురించారు.

?ది బర్డ్ ఆఫ్ టైం: సాంగ్స్ ఆఫ్ లైఫ్ డెత్ అండ్ ది స్ప్రింగ్,?ది ఇండియన్ వీవర్స్,ది బాంగిల్ సెల్లెర్స్..అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు.

# మావోలపై ముప్పేట దాడి..



హైదరాబాద్ : వరుస ఎన్ కౌంటర్లు మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగులుతోంది. మావోయిస్టులకు పట్టున్న ఛత్తీస్ ఘడ్ కేంద్రంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతుంది. ఏరివేత లో భాగంగా ఎన్ కౌంటర్ లు నిత్యకృతయమయ్యాయి. ఒక ఎన్ కౌంటర్ మరువక ముందే మరో ఎన్ కౌంటర్ జరుగుతుంది. ఎన్ కౌంటర్ జరిగిన ప్రతిసారి పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందుతున్నారు. నిన్న ఆదివారం ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో కాల్పుల మోత మోగింది. పోలీస్ బలగాలు, మావోయిస్టుల తూటాలకు 31 మంది మావోయిస్టులు మృతి చెందగా. మృతుల్లో 11 మంది మహిళలు, 20 మంది పురుషులు ఉన్నట్లు తెలిపారు. ఎదురు కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ప్రకటనలో తెలిపారు. పక్కా సంచారంతో పోలీస్ బలగాలు నేషనల్ పార్క్ అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున మావోయిస్టులకు, పోలీస్ బలగాలకు మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి. మావోయిస్టుల ఏరివేత లో భాగంగా ఆఖీఉ, ూఈ తో పాటు కేంద్ర బలగాలు నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురు పడడంతో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్టు బస్తర్ ఐజీ తెలిపారు. ఈ ఎన్ ఎన్ కౌంటర్ లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారని, ఎన్ కౌంటర్ స్థలం నుండి ంఐ 47, ూఒఖీ, ఎఔూయా రైఫిల్, 303 ఆయుధాలతో పాటు మావోయిస్టులు తయారు చేసిన రాకెట్ లాంచర్, బిజిఎల్ లాంచర్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ ఐజీ తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీన ఛత్తీస్ ఘఢ్ బీజాపూర్ జిల్లాలోని గంగలూరు అటవీ ప్రాంతంలో పోలీస్ బలగాలకు, మావోయిస్టులకు జరిగిన జరిగిన ఎదురు కాల్పుల్లో ఎనమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. మరో ఒకటి నిన్న ఫిబ్రవరి 9వ తేదీన ఛత్తీస్ ఘడ్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ భారీ సంఖ్యలో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు.

**జనవరి నెలలో ఆరు ఎన్ కౌంటర్లు..**

– జనవరి 29 న జార్ఖండ్ రాష్ట్రంలోని చైబాసా, సోమావా పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటన స్థలం నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ లు తెలిపారు.

– జనవరి 19 వ తేదీన ఒడిశా రాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ బలగాలకు, మావోయిస్టుల మధ్య మొదలైన ఎదురుకాల్పులు నాలుగు రోజుల పాటు కొనసాగాయి. ఈ ఎన్ ఎన్ కౌంటర్ లో 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ లో మావోయిస్టు పార్టీ కీలక నేతను కోల్పోయింది. కేంద్రకమిటీ సభ్యులు, ఒడిశా రాష్ట్ర కార్యదర్శి చలపతి మృతి చెందారు.

– జనవరి 16 వ తేదీన ఛత్తీస్ ఘడ్, తెలంగాణ సరిహద్దుల్లోని పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో పోలీస్ లకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీస్ లు వెల్లడించారు. 16 వ తేదీన నుండి 17 వ తేది రెండు రోజుల పాటు జరిగిన ఎన్ కౌంటర్ లో మోస్ట్ వాంటెడ్ గా ఉన్న తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ తప్పించుకున్నారు. ఈ ఎన్ ఎన్ కౌంటర్ రెండు రోజులకు మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. పూజారి కంకేర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు లేఖ లో పేర్కొన్నారు.

– జనవరి 12 వ తేదీన ఆదివారం ఉదయం బీజాపూర్ జిల్లా నేపనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రత దళాలకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ఇద్దరు మహిళలు ఉన్నట్లు పోలీస్ తెలిపారు. ఘటన స్థలం నుండి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ లు వెల్లడించారు.

– జనవరి 5 వ తేదీన నారాయణపూర్, దంతెవాడ జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన లో ఒక జవాన్ మృతి చెందినట్లు పోలీస్ లు ప్రకటించారు.

2025 కొత్త సంవత్సరం ప్రారంభమైన మూడు రోజులకే 3 వ తేదీన ఒడిశా సరిహద్దుల్లో బలగాలకు, మావోల కు జరిగిన ఎన్ కౌంటర్ లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు గారియాబాద్ పోలీస్ లు వెల్లడించారు.

**వరుస ఎన్ కౌంటర్లతో మావోయిస్టుల ఏరివేత..**

మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్ర బలగాలు, ఆయా రాష్ట్ర పోలీసులు, మావోయిస్టుల ఏరివేతకు ఏర్పాటు చేసిన బలగాలు సెర్చ్ ఆపరేషన్ ను కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా ఛత్తీస్ ఘడ్ అటవీ ప్రాంతాన్ని పోలీస్ బలగాలు దండకారణ్యాన్ని జల్లడ పడుతున్నాయి. దీంతో మావోయిస్టు దళాలు ఎదురు పడడం లేదా పక్క సమాచారంతో బలగాలు మావోయిస్టులను మట్టుపెడుతున్నారు. ఈ సంవత్సరం 2025 జనవరి 3 తేదీన నుండి మొదలైన ఎన్ కౌంటర్లు వరుసగా కొనసాగుతున్నాయి.

# గ్రేటర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ ములాఖత్




హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పాలకమండలి పదవికాలం నాలుగేళ్లు పూర్తయింది. దీంతో మేయర్, డిప్యూటీ మేయర్ మీద అవిశ్వాస తీర్మానం తెరమీదకు వచ్చింది. దీంతో జీహెచ్ఎంసీ రాజకీయాలు వేడెక్కాయి. ఒకవైపు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు, మరోవైపు అవిశ్వాస తీర్మానం వ్యవహారంతో రాజకీయపార్టీల వ్యవహారం కొత్త చర్చకు దారితీసింది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి విజయ సాధించి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతలపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ ప్లాన్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆ రెండు పార్టీలు తమ కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఇటీవల కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవిశ్వాసంపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చించారు. మరోవైపు బుధవారం నగర కార్పొరేట్లతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ సమావేశం కానున్నారు. స్టాడింగ్ కమిటీలో పోటీ, మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాసం పై బీఆర్ఎస్ కార్పొరేటర్లతో తలసాని చర్చించనున్నట్లు తెలుస్తోంది. కాగా మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతామని తలసాని గతంలోనే ప్రకటించారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక బీజేపీ కార్పొరేటర్లతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీలో పోటీ చేసే అంశంతో పాటు అవిశ్వాసంపై చర్చించారు. అయితే బీఆర్ఎస్ అవిశ్వాసం పెడితే తాము తీర్మానం పెట్టి తీరుతామని బీజేపీ కార్పొరేటర్లు అంటున్నారు. దీంతో ఈ రెండు పార్టీలు అవిశ్వాసం విషయంలో చేతులు కలిపే అవకాశం లేకపోలేదన్న చర్చ సాగుతోంది. మరోవైపు అవిశ్వాసాన్ని ఎదుర్కొడానికి కాంగ్రెస్ సిద్ధమవుతోంది. గురువారం రోజు నగర్ ఇన్‌చార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు సమావేశమై అవిశ్వాసాన్ని ఎదుర్కోనే అంశాన్ని చర్చించనున్నారు. ఇదిలా ఉంటే, స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నలుగురు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ నుంచి కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ నుంచి హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్, రామచంద్రాపురం కాంగ్రెస్ కార్పొరేటర్ పుష్ప నామినేషన్లు దాఖలు చేశారు. జీహెచ్ఎంసీ రిటర్నింగ్ అధికారికి కార్పొరేటర్లు తమ నామినేషన్ పత్రాలను అందించారు. ఈ నెల 17 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. నాలుగేళ్లుగా తమకు స్టాండింగ్ కమిటీలో చోటు లేదని.. ఈసారి తప్పకుండా గెలుస్తామని కాంగ్రెస్ కార్పొరేటర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీజేపీ కార్పొరేటర్లు కూడా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. అయితే, పార్టీలకు అతీతంగా బీజేపీ కార్పొరేటర్లు కూడా మాకు ఓటేస్తారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు దీమా వ్యక్తం చేస్తున్నారు.

# కోతులే అజెండాగా ఎలక్షన్స్

హైదరాబాద్ : తెలంగాణలో మరికొద్ది నెలల్లో పంచాయతీ ఎన్నికల ఢంకా మోగనుంది. దీంతో ఆశావహులు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేవారు కోతుల సమస్యే ప్రధానంగా ప్రచారంలో దిగనున్నారు. కోతుల బెడదను తీర్చేవారినే సర్పంచ్‌గా కానీ ఎంపీటీసీగా కానీ గెలిపిస్తామంటూ ఓటర్లు కూడా తెగేసి చెబుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావహులు కూడా ఇప్పటి నుంచే కోతులను పట్టించే పనిలో బిజీ అయ్యారు. కొన్ని గ్రామాల్లో అయితే ముందుగానే తీర్మానాలూ చేసుకున్నారు. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కోతుల బెడద తీర్చినందుకు హనుమకొండ జిల్లాలో ఒకరిని సర్పంచ్‌గా గెలిపించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ దూడల సంపత్ రోజుకో వేషం వేసుకుని కోతులను గ్రామం నుంచి తరిమేశాడు. అందరి సహకారంతో రూ.లక్ష వరకు విరాళాలు సేకరించి ఆంధ్రప్రదేశ్ నుంచి మంకీ క్యాచర్‌లను పిలిపించి కోతులను అటవీ ప్రాంతంలో వదిలేలా చేశాడు. దాంతో 2019 ఎన్నికల్లో ఆయన భార్య ప్రమీలను గ్రామస్తులు సర్పంచ్‌గా గెలిపించారు. గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా రాష్ట్రంలో ఏ మూలన చూసినా కోతుల బెడద ఎక్కువైంది. రాష్ట్రంలో ఏకంగా 35 లక్షలకు పైగా కోతులు ఉన్నాయంట. చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా కోతులు దాడులు చేస్తున్నాయి. కోతుల దాడిలో గాయపడటంతో పాటు గుంపుగా దాడి చేయడంతో ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. రాష్ట్రంలో సంవత్సరానికి వెయ్యి మందికి పైగా గాయపడుతుండగా, పదుల సంఖ్యలో చనిపోతున్నారని అధికారులు చెబుతున్నారు. పంట పొలాల్లో ఇష్టారీతిన నాశనం చేసి రైతులకు నష్టాన్ని కూడా కలిగిస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న కోతుల సంఖ్యని తగ్గించేందుకు అధికారులు కొత్త మార్గాలను వెతుకుతున్నారు. కోతుల ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ కోసం 2020 డిసెంబర్‌లో నిర్మల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో మంకీ రెస్క్యూ, రిహాబిలిటేషన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఒక డాక్టర్, ఫార్మాసిస్టు, నలుగురు సిబ్బందిని ఈ సెంటర్‌లో నియమించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు కోతులను పట్టుకొని నిర్మల్‌కి తీసుకొస్తే అక్కడ వాటికి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేస్తారు. కోతులను పట్టుకోవడానికి మంకీ క్యాచర్లు ఒక్కో కోతికి వెయ్యి రూపాయల వరకూ డిమాండ్ చేస్తున్నారు. అంటే సుమారు వంద కోతులకు రూ.లక్ష చెల్లించాలనమాట. అసలే నిధుల కొరత ఉండటంతో చేసేదేమిలేక అధికారులు చేతులెత్తేశారు.


# తిరుపతిలో సాధువుల దీక్షలు

తిరుపతి : తిరుపతిలో సాధువులు ఆమరణ దీక్షకు దిగారు. టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరసన చేపట్టారు. అలిపిరి శ్రీవారి పాదాల వద్ద ముంతాజ్ పేరుతో హోటల్ నిర్మాణం జరుగుతోంది. హోటల్‌కు సంబంధించిన నిర్మాణాలను ఆపాలంటూ కొంత కాలంగా శ్రీనివాసనంద స్వామి పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసానంద స్వామి ఆధ్వర్యంలో 150 మంది సాదువులు దీక్షకు దిగారు. ప్రభుత్వం హోటల్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందంటూ వార్తలు రావడంతో మరోసారి ఆందోళనకు దిగారు. గతంలో వ్యతిరేకించిన కూటమి.. ఇప్పుడెలా అనుమతిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు స్వామిజీలు. టూరిజం శాఖ అత్యుత్సాహంతో నిర్మాణాలు జరుగుతున్నాయని అంటున్నారు. వారాహీ డిక్లరేషన్ అంటే ఇదేనా అంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నిస్తున్నారు. సనాతన ధర్మ పరిరక్షణ అంటున్న ఆయన, ఈ విషయంలో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. తిరుమల ప్రక్షాళన అన్న సీఎం చంద్రబాబు, దీనికి సమాధానం చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ని స్వామిజీలు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం ఫోటోలతో సీజ్ ద ముంతాజ్ హోటల్ అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. భక్తులను అవి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ వ్యవహారంపై శ్రీనివాసానంద స్వామి నోరు విప్పారు. ముంతాజ్ హోటల ఆపాలంటూ ప్రభుత్వానికి సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతి పత్రాలు అందజేశామన్నారు. మూడు నెలలుగా శాంతియుతంగా పోరాటాలు చేశామన్నారు. హిందువులకు న్యాయం జరుగుతుందని భావించామని, చివరకు ఆమరణ దీక్షకు దిగాల్సి వచ్చిందన్నారు. ఏడు కొండల చుట్టూ రుషులు తపస్సు చేసిన ప్రాంతమన్నారు. అలాంటి ప్రాంతాల్లో ఇలాంటి హోటల్ నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. ఇంటి ముందు ఇలాంటివి చేస్తే అంగీకరిస్తారా? అంటూ ప్రశ్నించారు శ్రీనివాసానంద స్వామి. తాము హోటల్ వద్దని అనడం లేదని, వేరు ప్రాంతాలు ఉన్నాయన్నారు. బ్రిటీషర్స్ కూడా ఇలాంటి పనులు చేయలేదన్నారు స్వామి. ఏడు కొండల చుట్టూ సెవెన్ స్టార్ హోటల్ పెడతారా? ఇదేనా మీరు హిందువులకు ఇచ్చే కానుక అంటూ ప్రశ్నలు రైజ్ చేశారు. వెంకటేశ్వర పవిత్ర అంటే ఇదేనా? సనాతన ధర్మమంటూ దక్షిణాది రాష్ట్రాల పర్యటనకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారని అన్నారు. ఆయన చేసిన మంచి పనికి మా ఆశీస్సులు ఉంటాయన్నారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ఒక్కసారి వెనక్కి వెళ్తే.. 2014–19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం అలిపిరి సమీపంలో దేవలోకం పేరుతో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దీనికోసం 60 ఎకరాలు కేటాయించింది. 2019 అధికారం మారిన తర్వాత వైసీపీ సర్కార్.. దేవలోకం ప్రాజెక్ట్‌కు కేటాయించిన 60 ఎకరాల్లో 20 ఎకరాలను ముంతాజ్ హోటల్స్ నిర్మాణానికి మంజూరు చేసింది. స్థలం ఇస్తామని చెప్పిన విషయం తెల్సిందే.

# టాలీవుడ్‌పై పైరసి భూతం




హైదరాబాద్ : టాలీవుడ్ ను పైరసీ భూతం వెంటాడుతోంది. ఏ సినిమా అయినా...థియేటర్లలో విడుదలైన గంటల వ్యవధిలో ఆన్ లైన్ లో దర్శనం ఇస్తుంది. పవన్ కల్యాణ్ అత్తారింటిది దారేది చిత్రం నుంచి తాజాగా విడుదలైన తండేల్ వరకు ఎన్నో చిత్రాలు పైరసీ బారిన పడినవే. వందల కోట్లు పెట్టుబడిగా పెట్టి వందల వంది టెక్నీషియన్లతో నెలల పాటు తీసిన చిత్ర బృందం కష్టాన్ని గంటల వ్యవధిలో బూడిదపాలు చేస్తున్నారు. పైరసీ వెబ్ సైట్స్, ఫ్యాన్స్ వార్...ఇలా కారణాలు ఏమైనా చివరికి నష్టపోయేది సినిమా నిర్మాతలే. పైరసీ భూతాన్ని అరికట్టేందుకు కఠిన చట్టాలు ఉన్నా...ఎంత వరకూ ఆచరణలో ఉన్నాయన్నదే పెద్ద ప్రశ్న. ఎంత మంది నిందితులను చట్టం ముందు నిలబెట్టారనే ప్రశ్నలు తలెత్తు?తున్నాయి. టెక్నాలజీ సాయంతో రెచ్చిపోతున్న పైరసీ కేటుగాళ్లకు అడ్డుకట్ట వేయలేమా? అనే సందేహాలు మరోసారి చర్చనీయాంశం అవుతున్నాయిహీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ ‘తండేల్’ సినిమాను పైరసీ భూతం వెంటాడుతోంది. ఈ సినిమా విడుదలైన రెండు రోజుల్లోనే ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ప్రదర్శించడం తీవ్ర చర్చనీయాంశమైంది. చిత్ర నిర్మాత బన్నివాసు స్పందిస్తూ... ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఛైర్మన్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ఘటనపై ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు విచారణకు ఆదేశించారు. ఏపీఎస్ఆర్టీసీ బస్సులో తండేల్ సినిమ పైరసీ ప్రింట్ ప్రదర్శించడం దారుణమని నిర్మాత బన్నీవాసు ఆవేదన చెందారు. చిత్ర విజయానికి పైరసీ ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తెలిసి, మరికొందరు తెలియక ఇలాంటి తప్పులు చేస్తున్నారన్నారు. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూప్స్‌లో పైరసీ లింక్స్‌ను ఫార్వర్డ్ చేస్తున్నారని అన్నారు. పైరసీ చేస్తున్న వారిని, దాన్ని ప్రోత్సహిస్తున్న వారిని గుర్తించి కేసులు పెడుతున్నామని, వాళ్లంతా జైలుకు వెళ్లే అవకాశముందని నిర్మాత బన్నీ వాసు హెచ్చరించారు. ఫిల్మ్ ఛాంబర్ చర్యలతో కొన్ని ఏళ్లుగా సినిమా పైరసీ జరగడం లేదని, ఇటీవల కాలంలో మళ్లీ ఈ రాక్షసి విరుచుకుపడుతోందని నిర్మాత బన్నీ వాసు ఆవేదన వ్యక్తం చేశారు. గేమ్‌ఛేంజర్ సినిమా కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేశారన్నారు. చాలా ప్రయత్నాలు చేసి ఆన్ లైన్ లింకులు తొలగించినట్లుగా చెప్పారు. పైరసీపై పోరాటం చేసేందుకు ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రత్యేకమైన సెల్ ఏర్పాటు చేశామన్నారు. వాళ్లు పగలూ రాత్రి పైరసీపై నియంత్రణకు పని చేస్తుంటారన్నారు. హీరో రామ్ చరణ్ నటించిన ‘గేమ్ ఛేంజర్’ సినిమాను ఏపీలోని కొన్ని కేబుల్ టీవీ ఛానెల్స్‌లో పైరసీగా ప్రసారం చేశారు. సినిమా నిర్మాతలకు తీవ్ర నష్టం కలిగేలా లోకల్ టీవీ ఛానెల్స్‌లో హెచ్‌డీ ప్రింట్‌ను ప్రసారం చేశారు. ఈ సినిమా పైరసీ కాపీ ప్రసారం చేసిన కేబుల్ ఆపరేటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సినిమా వెనక కొన్ని వేల మంది శ్రమ దాగి ఉంటుందని నిర్మాతలు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా విచ్చలవిడితనంలో ఫ్యాన్స్ వార్ పేరిట ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. ఎవరో ఒక హీరో పేరు, ఫోటోతో సోషల్ మీడియా ఖాతా తెరిచి నిత్యం వివాదాస్పదత వ్యాఖ్యలు, వీడియోలు పోస్టు చేస్తున్నారు. దీంతో పాటు కొత్త సినిమాలు విడుదల సమయంలో సినిమాల్లోని కీలక అంశాల వీడియోలు సోషల్ మీడియాలో పెడుతున్నారు. ఫ్యాన్స్ వార్ పేరిట పైరసీ కాపీలను ప్రోత్సహిస్తు?న్నారు. థియేటర్లలోనే నేరుగా సెల్ ఫోన్లలో వీడియోలు రికార్డు చేస్తూ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేస్తున్నారు. ఫ్యాన్ వార్ లో హెచ్డీ ప్రింట్ లు సోషల్ మీడియాలో లీక్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయి. పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లుతోందని 2023లో ఓ నివేదిక తెలిపింది. సినిమా నిర్మాణానికి పడిన కష్టం పైరసీ వల్ల వృథాగా పోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించారు. అలాగే ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం 1952లో సవరణలు చేసి, కొత్త బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ముంబయిలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరిస్తారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరసీ కంటెంట్‌పై నోడల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే 48 గంటల్లో ఆ కంటెంట్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా సీబీఎఫ్సీ అధికారులు చర్యలు చేపడతారు. సినిమాలను అనధికారికంగా రికార్డ్ చేయడం, అనుమతి లేకుండా బహిరంగంగా ప్రదర్శించడం, ఆన్‌లైన్‌లో, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం తీవ్రమైన నేరంగా సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం పరిగణిస్తారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారికి మూడు నెలల నుంచి మూడేండ్ల పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు సినిమా నిర్మాణ వ్యయంలో 5 శాతాన్ని నిందితులు జరిమానాగా కట్టాల్సి ఉంటుంది. సినిమాకు సంబంధించిన కొద్ది భాగాన్ని కూడా పైరసీ చేయడం శిక్షార్హమే. అయితే కేంద్ర ప్రభుత్వం పాటు రాష్ట్ర ప్రభుత్వాలు పైరసీపై కఠిన చర్యలు తీసుకోవాలని టాలీవుడ్ వర్గాలు కోరుతున్నాయి. పైరసీపై చట్టాలను మరింత కఠినం చేసి బాధ్యులకు త్వరగా శిక్షలు పడేలా చేస్తే...భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు.



("ప్రపంచంలో ప్రియురాళ్లపై ఎవరి ప్రేమ ఎంత..!?")

ఫిబ్రవరి 14 ప్రేమికుల రోజు సందర్భంగా

## రెప్ప చాటు కన్నీటి ప్రేమ



ఓ నా దేవత సుందరి..!
కన్నెత్తి చూడవు
పన్నెత్తి పలకరించవు
లోపలి మనిషిని దాచి
పై మనిషితో మాట్లాడి
ఏదో..నాకు అసహనం
కలుగకుండా ఉండేందుకు ప్రయత్నిస్తావు...
నీపై నాకు బోలెడంత ప్రేమ ఉన్నా..!
సున్నితంగానే తిరస్కరిస్తున్నావు...
నాకు తెలుసులే నీ నిగూడ బుద్ధి.!!
ఇలా ఎన్నాళ్లని అరికట్టగలవు
నన్ను అరికట్టగలవు నిజమే కానీ.!
నా కన్నీళ్లను అరికట్టగలవా..?
అవి ఇప్పటికే రెప్పఒడ్డును ఒరుసుకుంటూ నిండుగా ఉన్నాయి
అరికట్టాలని ప్రయత్నించకు
నీ పాదాలను కడిగి మరీ వేడుకొంటాయి...!
కవిరాజాను ప్రేమించుమని
నువ్వంటే అతనికి ప్రాణం కాబట్టి.!!
తనను కలలో కూడా ఇంతలా ఏడిపించాలా!?
మెలుకువ వచ్చేసరికి అదృశ్యం అయినావు....

**కవి రాజా :8309448190**



## 431 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టివేత

సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి ఫిబ్రవరి 13.

రాయపోల్. ప్రభుత్వం నిరుపేదలకు అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమ దారులు కొనుగోలు చేసి రీసైకిలింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికి అందిస్తున్నారని, ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలంగాణ చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, సివిల్ సప్లై కార్పొరేషన్ ఆఫీసర్ శశిధర్ రాజు అన్నారు. సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు రాయపోల్ మండలం రామారం గ్రామ శివారులో గల సాయి మహాదేవ్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్, ట్రాన్స్పోర్ట్ స్థానిక పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. సుమారు 863 బ్యాగుల బియ్యం 431 క్వింటాళ్లు రూ.15,51 600 విలువగల బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని మిల్లులో రీసైకిలింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికే అంద చేస్తున్నారన్నారు. ఈ మిల్లు ప్రభుత్వానికి 1660 టన్నుల బియ్యం బాకీ ఉండడంతో దాదాపు రెండు సీజన్ల ప్రభుత్వం సాయి మహదేవ్ మిల్లుకు సీఎంఆర్ ఇవ్వలేదు . గుట్టుగా ఇతర వాహనాల నుంచి రేషన్ బియ్యం తీసుకొచ్చి మళ్ళీ వాటిని రీసైకిలింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వమును రెండు రకాలుగా మోసం చేస్తున్నారన్నారు. రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని వివిధ జిల్లాలు కామారెడ్డి హన్మకొండ సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యాన్ని అమ్మిన కొన్న నాన్బెలబుల్ క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామన్నారు. మిల్లు లీజుకు తీసుకొని నడిపిస్తున్న సాయి కుమార్ రెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. బియ్యాన్ని దౌల్తాబాద్ పౌర సరఫరాల గోదాంకు తరలించారు. కార్యక్రమంలో సిహెచ్ శశిధర్ రాజు, వెంకటేశం డిఎస్పి, బండారి సీఐ, వెంకటేశ్వర్లు ఎస్సై, సాంబశివరావు ఎస్సై, అనిల్ కుమార్ ఏ సి ఎస్ ఓ, రాఘవేందర్ డి హెచ్ ఎం, ప్రవీణ్ డిస్టిక్ మేనేజర్, డీఎస్ఓ తనుజ, డిటి రాజిరెడ్డి, రాయపోల్ ఆర్ఐ భాను ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో ఏపీ కోళ్లు బ్యాన్

హైదరాబాద్ : తెలుగురాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ టెన్షన్ నెలకొంది. ఏపీలోని పలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్తో కోళ్లు మృత్యువాత పడతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమోలులంకలోని ఓ ఫౌల్ట్రీ ఫామ్లో భారీగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. 24 గంటల్లో 10 వేల కోళ్లు మృతి చెందినట్లు లెక్కలు వేశారు. చనిపోయిన కోళ్లను జనావాసాలకు దూరంగా డిస్పోజ్ చేయాలని వెటర్నరీ అధికారులు సూచించారు. దీంతో చనిపోయిన కోళ్లను భూమిలో పూడ్చిపెట్టారు ఫౌల్ట్రీ యజమాని. మరోవైపు.. గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. గోదావరి జిల్లాల్లో వైరస్తో చనిపోతున్న కోళ్లకు బర్డ్ ఫ్లూగా నిర్ధారణ అయింది. పెరవలి మండలం కానూరు గ్రామ పౌల్ట్రీలలో తీసుకున్న శాంపిల్స్ పాజిటివ్గా వచ్చింది. దీంతో మరోసారి రెడ్ జోన్, సర్వే లెన్స్ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. బర్డ్స్ ఎక్కడ చనిపోతున్నా పశు సంవర్ధక శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేశారు.పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, ఉంగుటూరు పరిసర ప్రాంతాల్లో సుమారు రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి. బర్డ్ ఫ్లూ కలకలం నేపథ్యంలో కోళ్ల ఫారాల వద్ద పనిచేస్తున్న వారికి ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షలు నిర్వహించారు. ఆయా ప్రదేశాల్లో జాగ్రత్తలు వహించాలని కోళ్లఫారాల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు.. బర్డ్ ఫ్లూ పెరుగుదల నేపథ్యంలో ఏపీ సర్కారు ముందస్తు చర్యలు చేపట్టింది.ఏపీలో బర్డ్ ఫ్లూ కలకలంతో తెలంగాణ సర్కారు అప్రమత్తం అయ్యింది. తెలంగాణ సరిహద్దు అయిన కృష్ణాజిల్లాలోనూ బర్డ్ ఫ్లూతో కోళ్లు చనిపోవటంతో.. అక్కడ నుంచి సరఫరాలను నిలిపివేశారు. తెలంగాణ సరిహద్దుల్లో 24 చెక్పోస్టులు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మూడు చెక్పోస్టులు పెట్టి.. ఏపీ నుంచి కోళ్లు రాకుండా చూస్తున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వస్తున్న కోళ్ల వాహనాలను.. అధికారులు వెనక్కి పంపుతున్నారు.బాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ కారణంగా ఆంధ్రా– తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన రామాపురంలోని చెక్పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఏపీ నుంచి తెలంగాణకు సరఫరా అయ్యే కోళ్లకు సంబంధించి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వాటిని తెలంగాణలోకి రాకుండా వెనక్కి పంపుతున్నారు. బర్డ్ ఫ్లూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో.. వారం రోజులుగా తనిఖీలను ముమ్మరం చేశారు. ఏపీకి చెందిన ప్రతి వాహనాన్నీ.. తనిఖీ చేస్తున్నారు.సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు దగ్గర వెటర్నరీ అధికారులు, పోలీసులు చెకింగ్స్ చేస్తున్నారు. ఆంధ్ర నుంచి వస్తున్న కోళ్లను బ్యాన్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ నెల ఏడు నుంచి ఇంతవరకు ఏపీ నుంచి కోళ్ల వాహనాలు తెలంగాణలోకి రాలేదని చెప్పారు. తెలంగాణలో బర్డ్ ఫ్లూ లేనప్పటికీ.. జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.ఇదిలా ఉంటే.. ఆంధ్రలో బర్డ్ఫ్లూ వ్యాప్తితో తెలంగాణలోని గద్వాల జిల్లా వెటర్నరీ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి వస్తున్న కోళ్లు, కోడి పిల్లలు, బాతుల వాహనాలను అడ్డుకొని తిరిగి వెనక్కి పంపుతున్నారు.

# హైకమాండ్కు రేవంత్కు మధ్య దూరం?



హైదరాబాద్ : రాహుల్ గాంధీని కలిసేందుకు రేవంత్ చేసే ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. తమ మధ్య గ్యాప్ లేదని రేవంత్ అంటున్నారు. కానీ మంత్రివర్గ విస్తరణకూ అనుమతి రాకపోవడంతో అనుమానాలు పెరుగుతున్నాయి. కాంగ్రెస్ ముఖ్య నేత, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వరంగల్ టూర్ పెట్టుకున్నారు. అక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఆయన రైల్లో చెన్నై వెళ్లాల్సి ఉంది. అయితే ఈ పర్యటనకు రాహుల్ బయలుదేరక ముందే క్యాన్సిల్ అయింది. అసలు ఖరారు అయినట్లుగా ఎవరికీ సమాచారం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా తెలియదు. అందరికీ క్యాన్సిల్ అయిన సమాచారమే తెలిసింది. రాహుల్ వస్తూంటే.. తమ పార్టీ ప్రభుత్వం ఉన్న రాష్ట్ర సీఎంకు సమాచారం ఇవ్వరా ? అన్న చర్చ జరుగుతోంది. రాహుల్ కు.. రేవంత్ కు మధ్య గ్యాప్ ఉందని జరుగుతున్న ప్రచారానికి ఇది మరింత బలం చేకూరుస్తోంది. రాహుల్ గాంధీతో నాకు గ్యాప్ లేదు.. నేనే ఆయన అపాయింట్ మెంట్ అడగలేదు అని ఇటీవల ఢిల్లీలో రేవంత్ రెడ్డి మీడియాకు చెప్పుకున్నారు. ఇలా చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చిందంటేనే సమస్య ప్రారంభమయిందని రాజకీయాలపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ ఓ స్పష్టత వస్తుంది. చాలా కాలంగా రాహుల్ గాంధీ.. రేవంత్ రెడ్డిని కలవడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణల్లో మాత్రమే అధికారంలో ఉంది. ఏ పార్టీకి అయినా ముఖ్యమంత్రులు కీలకం. అందుకే కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలకు..త కార్యక్రమాలకు రేవంత్ రెడ్డిని పిలుస్తున్నారు. స్టార్ క్యాంపెయినర్లుగా జాబితాలో చేరుస్తున్నారు. కానీ రాహుల్ గాంధీ ఆయనకు ప్రత్యేకంగా సమయం ఇవ్వడం లేదు. తెలంగాణ మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉన్నాయి. వాటిని భర్తీ చేసేందుకు ఏడాదిగా చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. తాను సమర్పించిన జాబితా విషయంలో అభ్యంతరాలు ఉన్నందునే పర్మిషన్ ఇవ్వడం లేదనుకున్న రేవంత్ రెడ్డి తన జాబితా ఏమీ లేదని అంతా హైకమాండ్ కష్టమేనని వారు ఎవరితో ప్రమాణం చేయించమంటే వారితో చేయిస్తానని ఢిల్లీల ప్రకటించారు. అదే సమయంలో రేవంత్ రెడ్డికి పార్టీపై పట్టు తగ్గించేందుకు హైకమాండ్ ప్లాన్ చేస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించబోతున్నట్లుగా హైకమాండ్ లీకులు ఇచ్చింది. ఎప్పుడూ లేని విధంగా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించాలని నిర్ణయించారు. ఎస్సీ,ఎస్టీ, రెడ్డి, ముస్లిం సామాజికవర్గాల నేతలకు అవకాశం ఇవ్వనున్నారు. అలాగే పార్టీలోని ఇతర పదవుల భర్తీపైనా ప్రకటన చేయనున్నారు. కానీ మంత్రి వర్గ విస్తరణకు మాత్రం హైమాండ్ ఇంకా ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. ఢిల్లీ వెళ్తున్నారు..కాంగ్రెస్ పెద్దల్ని కలుస్తురు కానీ రాహుల్ ను మాత్రం రేవంత్ కలవలేకపోతున్నారు. దీంతో ఆయనకు రాహుల్ కు మధ్య గ్యాప్ ఉందన్న ప్రచారం జరుగుతోంది. దాన్ని పూడ్చడానికి అయినా ఓ సారి రాహుల్ తో భేటీ కావాలని రేవంత్ అనుకుంటున్నారు. కానీ అవకాశం మాత్రం రావడం లేదు. మంత్రివర్గాన్ని విస్తరించకపోవడం వల్ల పాలనపై ప్రభావం పడుతోందన్న అసంతృప్తి వ్యక్తమవుతున్నా.. హైకమాండ్ ఇదే పద్దతిలో ఉంది. రేవంత్ రెడ్డికి ఇచ్చే ప్రాధాన్యతను తగ్గించే క్రమంలోనే ఇదంతా చేస్తున్నారని రాజకీయవర్గాలు అంటున్నాయి. ఈ ప్రచారాన్ని తగ్గించుకోవడానికి రేవంత్ అర్జంట్ గా రాహుల్ తో సమావేశం కావాల్సి ఉంది. మరి సాధ్యమవుతుందా ?

## ఏప్రిల్లో తెలంగాణ సీఎస్ శాంతికుమారి రిటైర్మెంట్



హైదరాబాద్ : అతిపెద్ద పోస్ట్లో ఉన్న లేడీ ఆఫీసర్ తీరుతో అధికారులంతా విసిగిపోయారట. తమను పట్టించుకోకపోవడంతో ఇన్నాళ్లు ఆవేదన పడ్డారట. సమస్యలపై స్పందించకపోయినా సర్దుకుపోయారట. ఉన్నతాధికారులు రిక్వెస్ట్ చేస్తే కూడా ఆ అధికారి అపాయింట్మెంట్ ఇవ్వలేదట. ఇవన్నీ మనసులో పెట్టుకుని బాధ పడుతున్న అధికారులంతా..ఇప్పుడు ఒక్కసారిగా రిలాక్స్ అవుతున్నారట. కారణం త్వరలోనే ఆ పెద్ద ఆఫీసర్ రిటైర్ కాబోతున్నారట. ఇంతకీ ఎవరా ఆఫీసర్ అంటే సీఎస్ శాంతికుమారి అంటున్నారు. తెలంగాణ మొట్టమొదటి మహిళా సీఎస్గా 2023 జనవరిలో పదవీ బాధ్యతలు చేపట్టారు శాంతికుమారి. పాలనాపరంగా బయట పెద్దగా వివాదాలు, విమర్శలు లేకపోయినా..సహచర అధికారుల్లో మాత్రం శాంతికుమారి తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఎం తర్వాత ప్రభుత్వ పెద్దగా, మిగతా ఎయాల నుంచి మొదలు ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులందరికీ బాస్ స్థానంలో ఉన్న శాంతికుమారి అందుకు తగ్గట్టుగా వ్యవహరించడం లేదని చాలాకాలంగా విమర్శలు ఉన్నాయి. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు, జిల్లా కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఏ మాత్రం పట్టించుకునేవారు కాదని టాక్సెక్రటేరియట్లో వివిధ శాఖలకు అధిపతులుగా పని చేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులతోనూ సీఎస్ శాంతికుమారి సఖ్యతగా ఉండేవారు కాదని తెలుస్తోంది. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు కూడా సమయం ఇచ్చేవారు కాదని అధికారులు వాపోతున్నారట. కలెక్టర్లు తమ జిల్లాలకు సంబంధించిన అంశాలపై అపాయింట్మెంట్ అడిగినా శాంతి కుమారి స్పందించేవారు కాదని అంటున్నారు. ఇక ఐఏఎస్ అధికారులందరికి పెద్దగా ఉన్న శాంతికుమారి వారి సమస్యలు, ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకునేవారు కాదని, దీంతో అధికారులంతా అమె తీరుపై విసిగిపోయారన్న చర్చ జరుగుతోంది.ఇక అధికారులతోనే కాదు మంత్రులతోనూ సీఎం శాంతికుమారి ఇలానే వ్యవహరించేవారన్న టాక్ వినిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డిని మినహా మంత్రులను కూడా పెద్దగా పట్టించుకోరట. మంత్రులు, ఐఏఎస్ అధికారుల పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వివిధ సమస్యలపై సెక్రటేరియట్కు వచ్చే విజిటర్స్ను సీఎస్ శాంతి కుమారి అస్సలు కలిసేవారు కాదట. గతేడాది నవంబర్లో సడెన్గా పది రోజుల పాటు అమెరికా పర్యటనకు వెళ్లారు శాంతి కుమారి.అయినా ఎవ్వరికి ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించలేదు. దీంతో అప్పుడు ఆమె స్థాయిలో క్లియర్ చేయాల్సిన ఫైళ్లన్నీ పెండింగ్లో పడిపోయి పాలనపై ప్రభావం పడిందట. ఇలా ప్రభుత్వ అధికారుల్లో ఆమె తీరుపై చాలా అసంతృప్తి వ్యక్తం అవుతుందట. కానీ కక్కలేక మింగలేక అన్నట్లు ఉన్నతాధికారి కాబట్టి లోలోన బాధపడుతూ వస్తున్నారట. అయితే త్వరలోనే ఆమె రిటైర్ కాబోతుండటంతో ఐఏఎస్ అధికారులంతా బిగ్ రిలీఫ్గా ఫీల్ అవుతున్నారట. కొత్తగా వచ్చే సీఎస్ అయినా తమకు తగిన ప్రాధాన్యత ఇచ్చి, సమస్యలను పట్టించుకోవాలని కోరుకుంటున్నారట సెక్రటేరియట్ ఉద్యోగులు.

## భార్య అనుమతి లేకుండా ఆమెతో భర్త అసహజ శృంగారం నేరం కిందికి రాదు

రాయ్పూర్ఫి : భార్య అనుమతి లేకుండా ఆమెతో భర్త అసహజ శృంగారం చేయడం నేరం కిందికి రాదు అని ఛత్తీస్గఢ్ హైకోర్టు వివరించింది. భార్యతో అసహజ శృంగారం చేయడం, ఆ తరువాత ఆమె చనిపోవడంతో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. భార్య ఇచ్చిన మరణ వాంగ్మూలం ఆధారంగా జగదల్పూర్లోని అదనపు సెషన్స్ న్యాయమూర్తి భర్తకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. భర్త ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ నరేంద్రకుమార్ వ్యాస్ ధర్మాసనం విచారించి తీర్పును వెల్లడించింది. 2013లో ఐపిసి సెక్షన్ 375 సవరణ ప్రకారం నిందితుడి చేసిన పనిని నేరంగా పరిగణించలేమని తీర్పులో పేర్కొంది. భార్య వయసు 15 దాటిని తరువాత భర్త చేసే ఎలాంటి లైంగిక చర్య అత్యాచారం కిందికి రాదని కోర్టు తెలిపింది. సమ్మతి అనే పదానికి ప్రాదాన్యం లేదని, వెంటనే భర్తను జైలు నుంచి విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది.

## విద్యార్థుల్లో కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలి

కరీంనగర్ : విద్యార్థులు దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని ఉపాధ్యాయుల గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన హస్తకళ మేళ, సైన్స్ ఎగ్జిబిషన్ ను కలెక్టర్ బుధవారం సందర్శించారు. కస్తూరిబా బాలికల పాఠశాల, వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు తయారుచేసిన వివిధ కళాకృతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు అందమైన వస్తువులను స్వతహాగా తయారు చేస్తున్నారని, ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ మేళాను సందర్శించాలని సూచించారు. విద్యార్థుల్లో ఎంతో కళా నైపుణ్యం బాగుందని, దాన్ని వెలికి తీయాలని అన్నారు. ప్రజలు ఈ మేళాను సందర్శించి అందమైన ఆకట్టుకునే కళాకృతులను కొనుగోలు చేయవచ్చని సూచించారు. ఈ మేళాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి,బాలికలఅభివృద్ధి అధికారికృపారాణి పాల్గొన్నారు.

# సమ్మర్ లోనే లోకల్ ఎలక్షన్స్




హైదరాబాద్ : తెలంగాణలో స్థానిక సంస్థల కాలపరిమితి ముగిసి ఏడాది కావస్తోంది.అయినా ఎన్నికల నిర్వహణపై క్లారిటీ రాలేదు. అప్పుడు ఇప్పుడు అంటూ చెప్పడం తప్ప ఒక తేదిని మాత్రం ప్రకటించలేదు. అయితే ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదే సమయంలో అవసరమైన అధికారులకు శిక్షణ కూడా ఇస్తోంది. అయితే ప్రస్తుతం పదవతరగతి పరీక్షల సమయంలో ఎన్నికలు నిర్వహించడం సరికాదని రాష్ట్ర సర్పంచ్ల సంఘం అంటోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం సంయుక్త కార్యదర్శి జయసింహ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్కు ప్రధానమైన పదవ తరగతి, ఇంటర్ పరీక్షల సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు విద్యాభ్యాసంపై ప్రభావం పడుతుందని, దీంతో వారు ఏకాగ్రత కోల్పోయి తీవ్ర ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉన్నదని సంఘం నాయకులు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ముగిశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అలాగే గత ఐదేండ్లలో గ్రామపంచాయతీలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి, వాటి తాలూకు బిల్లులు అందక సర్పంచ్లు ఆర్థికంగా కుదేలైపోయారని అన్నారు. వెంటనే సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించి, ఎన్నికలు నిర్వహించాలని ఈసీని కోరుతూ వినతి పత్రం అందించారుఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్లు ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించకుండా వారిపై రేవంత్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సర్పంచులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన రేవంత్ సర్కార్ ఎన్నికలయ్యాక మాట మార్చడం సరికాదన్నారు. ఖచ్చితంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి, ఎస్సీ వర్గీకరణలో తగు న్యాయం చేసి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ప్రయత్నాలు చేస్తున్న పార్టీలు**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైందా? రేవంత్ సర్కార్ నిర్ణయంతో విపక్షాలు మల్లగుల్లాలు పడుతున్నాయా? సీఎం రేవంత్రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ప్రకటనతో ఎలా చెయ్యాలనే ఆలోచనలో మిగతా పార్టీలు పడ్డాయా? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా అన్న ప్రశ్న బీఆర్ఎస్, బీజేపీలను వెంటాడుతోందా? తాము సిద్ధమేనని బీఆర్ఎస్ పైకి చెబుతోందా? దీనిపై ఇంకా నిర్ణయం వెల్లడించకుండా బీజేపీ ఎందుకు తాత్సారం చేస్తోంది?రేపో మాపో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకానుంది. దీనికి సంబంధించి ఒకొక్కటి క్లియర్ చేస్తూ వస్తోంది రేవంత్ సర్కార్. ఇందులో భాగంగా బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో బీసీ డెడికేటెడ్ కమిషన్ రిపోర్టుపై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పంచాయితీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు, ఎన్నికల ఏర్పాట్లపై చర్చించనున్నారు. దీని తర్వాత సర్పంచ్, ఎంపీటీపీ, జెడ్పీటీసీలు ఎన్ని విడతలుగా ఎన్నికలు నిర్వహించాలనే దానిపై ప్రభుత్వం ఓ అంచనాకు రానుంది.ఇక రాజకీయాల విషయానికొద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నారు సీఎం రేవంత్రెడ్డి. కులగణన సర్వే అసెంబ్లీ చర్చ సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. చట్టపరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాకుంటే పార్టీ పరంగా ఎన్నికల్లో 42 శాతం అమలు చేస్తామని కుండబద్దలు కొట్టేశారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 22 నుంచి 23 శాతం రిజర్వేషన్లు చట్టబద్దంగా వస్తాయి. మిగతా 20శాతం సీట్లను పార్టీ పరంగా కేటాయించాలనే నిర్ణయానికి ముఖ్యమంత్రి ఉన్నట్లు అధికార పార్టీల్లో చర్చ జరుగుతోంది.అధికార పార్టీ ఈ విధంగా చేస్తే.. మిగతా పార్టీలు కాంగ్రెస్ దారిలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డెడికేటెడ్ సిపార్సుల ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సీట్లకు 22 శాతం రిజర్వేషన్లు అధికారంగా అమలు చేస్తూనే మిగతా 20శాతం బీసీలకు టికెట్లు ఇవ్వాలని భావిస్తోంది. ఎంపీపీలు, జెడ్పీ ఛైర్మన్ ఎంపికలో దామాషా పాటించాలని నిర్ణయానికి వచ్చినట్టు పార్టీ వర్గాల మాట.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 42 శాతం కేటాయిస్తే.. మిగతా పార్టీలపై ఒత్తిడి పెరగడం ఖాయం. దీనిపై ఇటు బీఆర్ఎస్, బీజేపీలో తేల్చుకోలేక పోతున్నాయి. ఇటీవల ఆయా పార్టీ సమావేశాల్లో దీనిపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. బీజేపీతోపాటు బీఆర్ఎస్ కూడా దీనిపై మల్లగుల్లాలు పడుతోంది. దీనిపై గతంలో కేటీఆర్ ఓ మాట ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ మాదిరిగా తాము కూడా 42 శాతం కేటాయిస్తామని చెప్పేశారు. కానీ.. పార్టీలో పరిస్థితులు ఆ స్థాయిలో లేవని అంటున్నారు. అధికారం పోయిన తర్వాత కేడర్ చెల్లాచెదురైంది. కేడర్ బలహీనం కావడంతో క్షేత్రస్థాయిలోకి వెళ్ల లేని పరిస్థితి కారు పార్టీ నేతలది.

ఇక బీజేపీ విషయానికొద్దాం.బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై సైలెంట్ అయిపోయింది. సిటీ, పట్టణాల్లో ఆ పార్టీ కొంత కేడర్ ఉంది. రూరల్లో మరింత వీక్గా కనిపిస్తోంది. ఇటీవల భర్తీ చేసిన పార్టీ మండల అధ్యక్ష పదవులు బీసీలకు 50 శాతం కేటాయించామని బయటకు చెబుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈ విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలో తెలియని సందిగ్ధంలో ఆ పార్టీ పడినట్టు తెలుస్తోంది. తెలంగాణలో 42 శాతం అమలు చేస్తే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇదే నినాదం రావచ్చని అంటున్నారు. మరి బీసీలకు 42 శాతం అంశం బీజేపీ ఎలా హ్యాండిల్ చేస్తుందో చూడాలి.

## ఆందోళన బాటలో హాలీం నిర్వాహకులు

హైదరాబాద్ : హైదరాబాద్లో హాలీం నిర్వాహకులు ఆందోళన చేపట్టారు. తాము ఎంతో కష్టపడి ఏర్పాటు చేసుకున్న హాలీం బట్టీలను కూల్చివేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ సిబ్బందిపై హాలీం నిర్వాహకులు మండిపడుతున్నారు. అన్ని అనుమతులు తీసుకునే హాలీం స్టాళు నిర్వహిస్తున్నామని, ఇలా చేసి మా పొట్ట కొట్టవద్దంటూ ప్రాధేయపడుతున్నారు. నగరంలో రంజాన్ మాసం వస్తుందంటే ఎక్కడ చూసినా హాలీం సందడే కనబడుతుంది. రంజాన్ వస్తుందంటే చాలు.. ఎప్పుడెప్పుడు ఆస్వాదిద్దామా అని హాలీం ప్రియులు ఎదురుచూస్తుంటారు. రంజాన్ మాసం ముస్లింలకు ఎంత ప్రత్యేకమైందో.. హాలీం మీద ఉన్న ఇష్టం కూడా అంతే స్థాయిలో ఉంటుంది. జనాలు అంతగా ఇష్టపడే హాలీంకి సంబంధించిన వ్యాపారాన్ని తమకు కాకుండా చేసి ఇలా ఇబ్బందులు పెడుతున్నారని హాలీం నిర్వాహకులు చెబుతున్న మాట.నగరంలోని బంజారాహిల్స్ సలీంనగర్లో కొందరు హాలీం నిర్వాహకులు రోడ్డెక్కారు. తమకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా హాలీం బట్టీలను కూల్చివేశారని మండిపడుతున్నారు. గత 30 ఏళ్లుగా ఇక్కడే హాలీం విక్రయాలు సాగిస్తున్నామని, ఇదే తమ జీవనాధారమని ఇప్పుడు కొత్తగా ఇలా తమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయడం సరికాదని అంటున్నారు. మా తాతముత్తాతల దగ్గరి నుంచి ఏటా హాలీం వ్యాపారం నిర్వహిస్తున్నామని, గతంలో ఎప్పుడూ ఇలా ఇబ్బందులు ఎదురవలేదని చెబుతున్నారు. మాలాంటి పేదలపైన ఇలా అధికారులు జులుం ప్రదర్శించడం ఎంతవరకు సమంజసమని, దీనిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని అంటున్నారు. రంజాన్ మాసం దృష్ట్యా ఒక నెల వ్యాపారం నిమిత్తం బట్టీ ఏర్పాటు చేసుకున్నామని, నెల గడిచిన తర్వాత తమంతట తామే వాటిని తొలగిస్తామని.. కానీ, ఇంతలో ఇలా చేసి తమను ఇబ్బందులు పెడుతున్నారని నిర్వాహకులు ఆందోళనతో చెబుతున్నారు.అయితే నిర్వాహకుల దయనీయ పరిస్థితి ఇలా ఉంటే, రోడ్డు పక్కన ఏర్పాటు చేసే హాలీం బట్టీల ద్వారా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని.. అందుకే తొలగించాల్సిన అవసరం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.

## పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కుదేలైన గ్రామాలు

**రేషన్ కార్డులు, ఇల్ల నిర్మాణాలకు వేలాదిగా దరఖాస్తులు**

**గోపాల్ పేట, రేవల్లి, ఏదుల మండలాల పర్యటనలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

వనపర్తి :పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలన్నీ కుదేలయ్యాయనీ, నేడు గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం, రేషన్ కార్డుల కోసం వేలాదిగా దరఖాస్తులు ఇస్తున్నారని నాటి ఃఖీా ప్రభుత్వం ఇండ్లు రేషన్ కార్డులు మంజూరు చేసి ఉంటే ప్రజలు ఇంత ఇబ్బందులు పడేవారు కాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేటి ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ గ్రామాన ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పూర్తిస్థాయిలో అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు ప్రారంభోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గ పరిధిలోని గోపాల్పేట, రేవల్లి, ఏదుల మండలంలో ఆయన పర్యటించి, ఐ రహదారుల నిర్మాణాలకు, గ్రామాలలోని ఎస్సీ కాలనీలలో సిసి రహదారుల నిర్మాణాలకు, డ్రైనేజీల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు భూమి పూజలు చేశారు.

# చర్లపల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా చెల్లా ప్రభాకర్

మల్కాజిగిరి,ఫిబ్రవరి 13, (ప్రజా కలం ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ సంస్థ గత ఎన్నికల్లో భాగంగా జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ నూతన అధ్యక్షుడిగా కుషాయిగూడ కు చెందిన చెల్లా ప్రభాకర్ ను ఎన్నుకున్నారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ గురువారం ప్రభాకర్ కు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చల్లా



ప్రభాకర్ మాట్లాడుతూ క్రమశిక్షణగా పని చేసే ప్రతి ప్రతి కార్యకర్తకు భారతీయ జనతా పార్టీలో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. తనకు డివిజన్ బాధ్యతను అప్పగించిన ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలను సారం తన నాయకత్వంలో చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తాను అన్నారు. సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం కల్పిస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్తానన్నారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో చర్లపల్లి డివిజన్లో భారతీయ జనతా పార్టీ విజయ డంకా మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాదం,ఆనంద్ గౌడ్,నర్సింగ్ రావు,లక్ష్మణ్ గౌడ్,వెంకుల్,సహదేవ గౌడ్, శ్రీకాంత్,నవీన్,బోలె శ్రీనివాస్ ముదిరాజ్,రాంబాబు, నాగమణి,రామకృష్ణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ బోర్డ్ కాలనీలో 100 కే వీ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

ఎల్లారెడ్డి ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి లోవోల్టేజ్ ప్రాబ్లం ఉండడంతో గురువారం వేణుగోపాల స్వామి ఆలయం పక్కన గల స్థలంలో



నూతన 100 కేవి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తతో ఈ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఎస్ ఈ శ్రావణ్ కుమార్, ఎల్లారెడ్డి డీఈ విజయ సారథి, ఏ ఈ వెంకటస్వామి, లైన్ ఇన్స్పెక్టర్ జగదీశ్వర్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ జితేందర్ రెడ్డి, లైన్మెన్ శశికాంత్ రెడ్డి లు పాల్గొన్నారు.

# విద్యార్థులను ఇంగ్లీష్ లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి

## - మండల విద్యాధికారి ఏవీఎం వెంకటేశం

ఎల్లారెడ్డి ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి : విద్యార్థులను ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని మండల విద్యాధికారి ఏవీఎం వెంకటేశం అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల ఇంగ్లీష్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాధారణంగా విద్యార్థులలో ఇంగ్లీష్ అంటే భయం ఉంటుందని దానిని పోగొట్టే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ఇందు కోసం ఐఎఫ్టి ప్యానల్స్ ని ఉపయోగించి విద్యాబోధన చేస్తే విద్యార్థులకు తొందరగా అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎదిగిన రాష్ట్ర టి పి టి ఎఫ్ అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ లను ఎంఈఓ సన్మానించారు. అలాగే వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్న ఎంఈఓ వెంకటేశ్ అన్న ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల ఇంగ్లీష్ కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఇష్టరాజ్యంగా రోడ్లపై ఆటోలు నిల్పడంతో ఆర్టీసీ బస్సుకు ఇబ్బందులు

ప్రజా కలం ప్రతినిధి మెదక్ ఫిబ్రవరి 13 మండల కేంద్రమైన రేగోడు బస్టాండ్ గాంధీ చౌక్ చుట్టుముట్టు ఆటోలు ఇష్ట రాజ్యాంగ నిల్పడంతో ఇతర వాహనదారుల కు ఇబ్బందులు తప్పడం లేదు రేగోడు పోలీసులకు వాహనదారులు చెప్పిన పట్టించుకోకుండా పోయింది గాంధీ చౌక్ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు వచ్చినప్పుడు బస్సు తిరిగి పోవాలంటే అనేక ఇబ్బందిగా ఉంది పోలీసులు పట్టించుకోని రోడ్లపై వాహనాలు నిలుపుతున్న వారిపై చర్యలు తీసుకొని ఇతర వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని మండలంలో ధృవపత్రాలు లేని వాహనాలు ఎన్ని ఉన్న పోలీసులు కానీ ఆర్టిఏ అధికారులు కూడా చూసి చూడనట్టుగా వెళ్లడం గమనార్హం జిల్లా అధికారులు స్పందించి రోడ్లపై వాహనాలు నిల్పకుండా చూడాలని పలువురు కోరుతున్నారు



# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో 'కమలం పార్టీ దూకుడు'

## - బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హైమారెడ్డి నేతృత్వంలో...
## - విస్తృతంగా పర్యటిస్తూ టీచర్లను, గ్రాడ్యుయేట్లను చైతన్యవంతం చేస్తున్న బీజేపీ నేతలు...
## - తమ పార్టీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కా కొమురయ్య లను గెలిపించాలని వినతి

ఎల్లారెడ్డి ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి : కరీంనగర్ ఆదిలాబాద్ మెదక్ నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బిజెపి ఇన్చార్జ్ హైమారెడ్డి నేతృత్వంలో కమలం పార్టీ దూసుకుపోతుంది. ప్రతిరోజు నియోజకవర్గ ఇన్చార్జ్ హైమారెడ్డి తో పాటు స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తూ గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్లను కలుస్తూ బిజెపి అభ్యర్థులు అయిన అంజిరెడ్డి, మల్కా కొమురయ్య లకు ఓట్లు వేయాల్సిందిగా కోరుతున్నారు. తాజాగా ఆమె గురువారం పార్టీ నాయకులతో కలిసి మండలంలోని అన్నాసాగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుస్తూ బిజెపికి ఎందుకు ఓటు వేయాలో వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

అధికార పార్టీ వైఫల్యాలను వివరిస్తూ గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్లను బిజెపి వైపు తిప్పుకోవడంలో వారు సఫలీకృతం అవుతున్నారు. ఇదిలా ఉండగా అధికార కాంగ్రెస్ నేతలు మాత్రం ఎక్కడా ప్రచారంలో కనిపించడం లేదు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి బాలకిషన్, ఎల్లారెడ్డి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పెద్దల్ల నర్సింలు, ప్రధాన కార్యదర్శి నరేష్ పీకే, పట్టణ అధ్యక్షులు రాజేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుజాత, ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్, బిజెపి సీనియర్ నాయకులు దేవేందర్, బిజెపి మాజీ మండల అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు కుశలకంఠి శంకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు సాయిలు, కిసాన్ మోర్చా నాయకులు సంగారెడ్డి, వెంకట్ రెడ్డి, సంతోష్ రెడ్డి, మహేందర్, బీజేవైఎం నాయకులు మహేశ్వరం రవి, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు బొంగోని రాణి ఎంపిక

గజ్వేల్:13 ఫిబ్రవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొంగోని రాణి గత ఆరు సంవత్సరాలుగా అనేక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటూ గత సంవత్సరం అక్టోబర్ నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టుకు కేప్టెన్ గా వ్యవహరించి మంచి ప్రతిభ చూపడంతో, అక్కడ రాష్ట్ర స్థాయి క్యాంప్ ట్రయల్స్ కి ఎంపికైంది.



బుధవారం జరిగిన ఫైనల్ ఎంపికలలో రాష్ట్ర కబడ్డీ జట్టులో చోటు దక్కించుకుంది. ఈనెల 14 నుండి 18వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటుంది. ఈ సీనియర్ జాతియ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు జిల్లా నుండి ఎంపికపట్ల సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎన్ సి సంతోష్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివ కుమార్ మాట్లాడుతూ సీనియర్ మహిళా విభాగంలో జాతీయ స్థాయిలో సిద్దిపేట నుండి వెళ్ళడం ఇదే తొలిసారి అని, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టు హర్యానాకి వెళ్ళడానికి క్రీడాకారులందరికి విమాన ప్రయాణం కల్పించడం ఇదే తొలిసారి అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టు మరింత బలంగా మార్చడానికి ఈ ఎంపికలు చాలా పారదర్శకంగా జరిగాయని కబడ్డీ క్రిడాభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా కబడ్డీ క్రిడాలోకం ఎప్పుడూ రుణపడి ఉంటుందని తెలిపారు. అలాగే సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గద్దల రమేష్, సంపంగి రాజు ప్రేమ్ నారాయణ, రంగనాథ్, సంయుక్త కార్యదర్శులు శ్రీకాంత్, నరేంద్ర బాబు, మహేష్, కరుణాకర్, సిద్దిపేట జిల్లా మహిళా కమిషన్ కబడ్డీ కార్యవర్గం సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

గజ్వేల్ నియోజకవర్గం:13 ఫిబ్రవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ నియోజకవర్గంలోని తిగుల్ గ్రామానికి చెందిన గౌలికార్ నర్సింగరావు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వారం రోజుల క్రితం మృతి చెందారు. ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబాన్ని పరామర్శించి మృతుడి కుటుంబానికి కే బి ఫౌండేషన్ చైర్మన్ కామల్ల భూమయ్య మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డితో కలిసి రూ 4000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగేల్లి శ్రీనివాస్ రెడ్డి నాయకులు ఉప్పల అశోక్ మాజీ వార్డు సభ్యుల ఆంజనేయులు కనకయ్య మహేష్ లు పాల్గొన్నారు



# పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

## -జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్

గజ్వేల్:13 ఫిబ్రవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు రాష్ట్ర ప్రభుత్వాన్ని




డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల పై ఎటివో గజ్వేల్ కార్యాలయాన్ని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ల నాగరాజు, గోక విద్యా సాగర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగులో ఉన్న మెడికల్, జిపిఎఫ్ లోన్స్, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్, సరెండర్,ఇతర బకాయిలువెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష రూపాయలుపై బడిన బిల్లులు విడుదల చేయకపోవడం, వలన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, వెంటనే ఆయా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం డైరీని ఎటివో మరియు ఎస్టివోకు అందజేశారు.

# కాలనీలో సమస్యలు లేకుండా చూస్తా

## కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్

మల్కాజిగిరి,ఫిబ్రవరి13,(ప్రజా కలం ప్రతినిధి)

కాలనీలో సమస్యలు లేకుండా చూస్తానని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ లో కార్పొరేటర్ పర్యటించారు. ఈ



సందర్భంగా కాలనీవాసులు కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మంచినీటి లో ప్రెజర్ తో నీళ్లు వస్తున్నాయని కార్పొరేటర్ కు తెలియజేయడం జరిగింది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య లేకుండా చూస్తారని కార్పొరేటర్ ఈ సందర్భంగా కాలనీవాసులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ,సత్యమూర్తి, సంపత్ రావు,కిషోర్, బ్రహ్మయ్య,రాము,హరి కిషన్, దుర్గా,దాస్ గౌడ్,రామకృష్ణ, రత్న,భూషణ్ రావు,గోపి, వెంకటసుబ్బయ్య,వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్యలో బాలరామున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

మల్కాజిగిరి,ఫిబ్రవరి 13 (ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి,మేడ్చల్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి మల్లారెడ్డి,మర్రి రాజశేఖర్ రెడ్డి భార్య మమతారెడ్డి, కుమారులు దీరెన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్య బాల రాముడి ని దర్శించుకున్నట్లు ఎమ్మెల్యే ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.



# ప్రభుత్వ భూముల్లో యదేచ్చగా అక్రమ నిర్మాణాలు

## - పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

**ఎల్లారెడ్డి ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి :**

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో గల రెవెన్యూ భూముల్లో భూ కబ్జాదారులు యదేచ్చగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎల్లారెడ్డి గ్రామ పంచాయతీ నుండి మున్సిపాలిటీగా మారిన తర్వాత శివారు ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ భూములపై భూకబ్జాదారులు కన్నేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని 12 వార్డ్ బిడి కాలనీ పక్కన గల సర్వే నంబర్ 693 లో ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డదారిలో ఇంటి నంబర్లు తీసుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు నిజమైన లబ్ధిదారులకు అనుమతులు ఇవ్వని అక్రమార్కులకు మాత్రం ప్రోత్సహిస్తున్నారని రెవెన్యూ అధికారుపై సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ విషయమై సంబంధిత శాఖల ఉన్నత అధికారులు స్పందించి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఈ ఫ్లెక్సీ కి ఎమ్మెల్సీ ఎన్నికల

# కోడ్ వర్తించదా ?

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద అధికార పార్టీ నాయకుల ఫోటోలతో ఉన్న ఫ్లెక్సీ
- తొలగించని మున్సిపల్ అధికారులు
- వారి తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షాలు





ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీ.

**ఎల్లారెడ్డి ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి :**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ స్థానిక మున్సిపల్ అధికారులు ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే, రాష్ట్ర ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఉన్న ఫ్లెక్సీని తొలగించకపోవడం పట్ల ప్రతిపక్ష పార్టీలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. అధికార పక్షానికి ఒక న్యాయం ప్రతిపక్షాలకు మరో న్యాయమా అంటూ వారు మున్సిపల్ అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలతో పాటు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాల్సిన విషయం అందరికీ తెలిసిందే. కానీ ఎల్లారెడ్డి లో మాత్రం అంతటా ఫ్లెక్సీలు తొలగించినప్పటికీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మాత్రం ఫ్లెక్సీ ని తొలగించకపోవడం శోచనీయం. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ ఉమ్మడి నాలుగు జిల్లాల పట్టభద్రుల టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మ్రోగింది. ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు మేల్కొని సదరు ఫ్లెక్సీని తొలగించి ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.

# ఈ బావికి రక్షణ కంచ ఏర్పాటు చేయరూ ?

- ప్రమాదకరంగా పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం పక్కన ఉన్న బావి



**ఎల్లారెడ్డి ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి :**

ఎల్లారెడ్డి పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం పక్కన ఉన్న బాబుకి ఎలాంటి రక్షణ కంచ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎల్లారెడ్డి నిజాంసాగర్



ప్రధాన రహదారి పక్కనే ఈ బావి ఉండటం, నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు ఆ రోడ్డుగుండా ప్రయాణిస్తుంటాయి. దురదృష్టవశాత్తు ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే ఇక అంతే సంగతి. బావి లోతుగా ఉండడంతో పాటు ప్రధాన రహదారికి అతి సమీపంలో ఉంది. లింగంపేట మండల కేంద్రంలోని నాగన్న మెట్ల బావికి అధికారులు అన్ని హంగులు సమకూర్చి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దినప్పటికీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న చారిత్రక బావిని మాత్రం మర్చిపోవడం గమనార్హం.ఈ బావికి ఇకనైనా రక్షణ కంచ ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

# వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం

## కుల్లిన చికెన్ అమ్ముతున్న దుకాణాదారులు

**కంటోన్మెంట్ ఫిబ్రవరి 13 ప్రజాకలం ప్రతినిధి**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం బేగంపేట్ అన్నా నగర్ లో అక్రమంగా నిల్వ ఉంచిన మాంసాన్ని అధికారులు గుర్తించారు. నియమాలను ఉల్లంగించిన కొందరు చికెన్



సెంటర్ లలో ఆహారం ను చాలా కాలంపాటు నిల్వ చేసి తక్కువ ధరలకు అమ్ముతున్నారని అధికారులకు ఫిర్యాదులు అందడంతో వారి భరతం పట్టారు. ఫిర్యాధులను స్వీకరించిన కంటోన్మెంట్ ఆహార భద్రతా అధికారులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అన్నానగర్ లో దాడులు నిర్వహించారు.దాడుల్లో సుమారు 600 కిలోల కుళ్లిన చికెన్ ను స్వాధీనం చేసుకున్నారు. కుల్లిన మాంసం ను బార్లు, మద్యం దుకాణాలు వద్ద స్టఫ్ కోసం అమ్మకాలు చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. పూర్తిగా కుళ్ళి పాడైపోయిను చికెన్ విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఎస్ఎస్ఎస్, రవి చికెన్ దుకాణాలలో తనిఖీలు చేయగా 600 కిలోల చికెన్ ను స్వాధీనం అధికారులు గుర్తించారు.గత మూడు నెలలుగా ఈ మాంసంను ఇక్కడే నిల్వ ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఇది ఇలా ఉండగా కుల్లిన మాంసం ను వినియోగదారులకు అమ్మకాలు చేసినట్లు స్థానికులు అధికారులకు తెలిపారు. మరోవైపు ఇటీవల బర్డ్ ఫ్లూ విస్తరిస్తున్న నేపథ్యంలో కుళ్ళిన చికెన్ విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## 'స్థానిక ఎన్నికల వాయిదాపై'

# వెల్లువెత్తుతున్న అగ్రహాలు

- బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం తేలాలంటే మరింత సమయం పట్టే అవకాశం
- రాష్ట్ర సర్కార్ నిర్ణయంతో జూన్, జూలై వరకు వాయిదా పడనున్న స్థానిక సంస్థల ఎన్నికలు ?
- మరింత దీన స్థితిలోకి గ్రామ పంచాయతీలు
- ఇప్పటికే పాలకవర్గాలు లేక 12 నెలలకు పైనే
- పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర నిధులూ రావడం లేదు
- మరో 4 నెలలపాటు జిపిల భారమంతా కార్యదర్శులపైనే
- ఎన్నికల నిర్వహణ చేతకాని సర్కార్ అంటూ ప్రతిపక్షాల గగ్గోలు



గ్రామ ముఖ చిత్రం.

**ఎల్లారెడ్డి ఫిబ్రవరి 13 ప్రజా కలం ప్రతినిధి :**

రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడం పై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో పాటు ప్రతిపక్షాలు సైతం ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేక సుమారు 12 నెలలకు పైగా సమయం అవుతుంది. దీనికి తోడు ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపాలిటీ, సహకార సంఘాల పదవీ కాలాలు సైతం ముగుసాయి. దీంతో స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులతో కూడిన పాలకవర్గాలు లేకుండా కేవలం అధికారుల ప్రత్యేక పాలనతో నెట్టుక రాబడుతు న్నాయి. ఈ తరుణంలో స్థానిక సంస్థల పరిధిలోని పట్టణాలు, గ్రామాలు, పల్లెలు, గిరిజన తండాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుండి జీపీలకు వచ్చే నిధులు కూడా రావడం లేదు. గ్రామ పంచాయతీలకు అత్యధికంగా కేంద్ర ప్రభుత్వం నుంచే నిధులు వస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల పెంపును సాకు గా చూపి మరో నాలుగు నెలల పాటు స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడం పట్ల ప్రతిపక్ష పార్టీలు అధికార కాంగ్రెస్పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర సర్కారు చేతకాని నిర్ణయంతో గ్రామ పంచాయతీలు మరింత దినస్థితిలోకి వెళ్లే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేక అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్యదర్శులపైనే పూర్తి స్థాయిలో పని భారం పడే అవకాశం ఉంది. ఇప్పటికే జీపీలకు పాలకవర్గాలు లేక పని భారం అంతా పంచాయతీ కార్యదర్శుల పైన పడింది. ప్రస్తుతం మరో నాలుగు నెలల పాటు ఈ భారాన్ని వారు మోయక తప్పదు. దీంతో పాటు గ్రామాల్లోని పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు వంటి ఎన్నో పనులు కార్యదర్శులకు పెను భారంగా పరిణమిస్తాయి.



ఇది ఇలా ఉండగా గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇది అమలుకు సాధ్యమైతదా కాదా అనే విషయం తెలుసుకోకుండా ఇష్ట రాజ్యాంగ నోటికొచ్చినట్లు హామీ ఇచ్చి ప్రస్తుతం దానిని అమలు చేసేందుకు మల్లాగుల్లలు పడడం పట్ల రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. చేతకాని హామీలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పాటించడంతో పాటు గ్రామాలు, పల్లెలను అభివృద్ధికి నోచుకోకుండా చేస్తున్నాయని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు గ్రామాల్లోని సర్పంచ్ ఆశావాహులు సైతం ఇప్పటికే ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం తోపాటు ప్రజల్లో తిరుగుతూ ఎంతో ఖర్చు పెట్టడం జరిగింది. తీరా చూస్తే రాష్ట్ర సర్కారు స్థానిక ఎన్నికల వాయిదా వేయడం తో వారు తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## బాక్సింగ్ లో సత్తాచాటిన వర్షిత, పలువురి అభినందనలు

# భవిష్యత్తులో బంగారు పతకాలు ఖాయం

**సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఫిబ్రవరి 13 ప్రజాకలం ప్రతినిధి**

పట్టుదలతో కృషి చేస్తే ఎంతటి విజయాన్ని అయినా సరే సాధించడం కష్టమేమీ కాదని మాజీమంత్రి, సనత్ నగర్ MLA తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్ పేట కు చెందిన సిల్వరి పరమేష్ కుమార్తె వర్శిత రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా వెస్ట్ మారేడ్ పల్లి లోని కార్యాలయంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో ఆయన్నిమర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వర్షిత ను అభినందించారు. జగద్గిరిగుట్ట లోని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ 3 వ సంవత్సరం చదువుతున్న వర్షిత ఈ నెల 11 న లాలాపేట లోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా మార్చి నెలలో



ఉత్తర ప్రదేశ్ లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీ లో చదువుతూ బాక్సింగ్ లో గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో అభినందనీయం అన్నారు. జాతీయ స్థాయిలో కూడా గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. బాక్సింగ్ లో మరింత ఉన్నతంగా రాణించేలా కృషి చేయాలని, అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు కుమార్ యాదవ్, దేశపాక శ్రీనివాస్, అరుణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**మహిళా బాక్సర్ కు పద్మారావ్ గౌడ్ అభినందనలు**

మహిళా బాక్సర్ సిల్వరి వర్షిత బాక్సింగ్ ఛాంపియన్షిప్ ను సాధించి తెలంగాణా రాష్ట్ర ఉత్తమ మహిళా బాక్సర్ గా షీల్డును కైవసం చేసుకున్న నేపధ్యంలో సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ఆమెను అభినందించారు. గురువారం మోండా మార్కెట్ లోని తన నివాసంలో వర్షితను అభినందించి శాలువాతో సత్కరించారు.రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావలని సూచించారు.భవిష్యత్తులో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పద్మారావు గౌడ్ ఆకాంక్షించారు. తన వంతు ప్రోత్సహాం ఎల్లప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వర్షితతోపాటు బాక్సింగ్ కోచ్ మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.

# కాప్రా రెవెన్యూ మండలం అధికారులు అడిగిన డబ్బులు ఇవ్వకుంటే అన్యాయంగా కూల్చివేతలు చేస్తున్నారు

**మల్కాజిగిరి,ఫిబ్రవరి13,(ప్రజా కలం ప్రతినిధి)**

కాప్రా రెవెన్యూ మండలం పరిధిలోని సర్వే నంబర్ 199/28 లో మంగళవారం రెవెన్యూ అధికారులు చేపట్టిన కూల్చివేతలు అన్యాయంగా, అమానవీయంగా చేపట్టారని స్థల యజమాని మంత్రి లక్ష్మణ్ పేర్కొన్నారు.చర్లపల్లి డివిజన్ చక్రిపురం లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బాధితుడు మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 199/28 స్థలాన్ని తన తండ్రి మంత్రి అడివయ్యా 28 సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారని తెలియజేశారు, 2011లో తాము నిర్మాణాలు చేపట్టే క్రమంలో అప్పటి కీసర రెవెన్యూ మండలం అధికారులు అడ్డుకున్నారని, తాము కోర్టుని ఆశ్రయించామని, కోర్టులో తమకు అనుకూలంగా జడ్జిమెంట్ వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 58 జీవో నిబంధనల ప్రకారం తమ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం పట్టాలు జారీ చేశారని తెలిపారు. అప్పటినుండి స్థలం తమ ఆధీనంలోనే ఉందని వివరించారు. అకస్మాత్తుగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా పోలీస్ బందోబస్తుతో రెవెన్యూ అధికారులు వచ్చి దశాబ్దాల క్రితం నిర్మించుకున్న కట్టడాలను అన్యాయంగా, అమానవీయంగా జెసిబిల సాయంతో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేతలు చేపట్టడానికి కారణాలు అడిగే అవకాశం ఇవ్వకుండా పోలీసులతో తనను అడ్డుకున్నారని తెలిపారు.మధ్యవర్తుల ద్వారా తనను డబ్బులు అడిగారని మంత్రి లక్ష్మణ్ ఆరోపించారు.సంబంధిత కొనుగోలు పత్రాలు,కోర్టు జడ్జ్మెంట్ కాపీలు,58 జీవో పట్టాలు విలేకరుల సమావేశంలో



చూయించారు. కాప్రా రెవెన్యూ మండలం అధికారులు అన్యాయంగా తమ ఆస్తులను కూల్చివేసినందుకు తాను కోర్టును ఆశ్రయించి ఆస్తి, పరువు నష్టా దావా వేస్తానని తెలిపారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **Kalakonda Ramakrishna**, Printed at M/s. Swetha Offset Printers, H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State and Published from H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State, Editor: **Kalakonda Ramakrishna**, RNI. Regn.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com